ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 22.07.2025 | సంపుటి :12 సంచిక : 03 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించండి

**ఏ రోజు ఏం పనిచేశారో నాకు రిపోర్టు ఇవ్వండి**

**ఎరువులపై పారదర్శకంగా వ్యవహరించండి**

- షాపు ముందు స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయండి
- యూరియా కొరతపై అసత్య ప్రచారాలు సహించం
- 25 నుంచి వచ్చే నెల 10 వరకు రేషన్ కార్డులను పంపిణీ చేయండి
- భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి
- ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలి
- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి
- హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలి
- అంటువ్యాధులు ప్రబలకుండా గిరిజన ప్రాంతాల్లో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రాష్ట్రంలో రేషన్ కార్డు కింద సన్న బియ్యం ఇవ్వడం వల్లనే రేషన్ కార్డుల డిమాండ్ పెరిగింది. రాష్ట్రంలో 96.95లక్షల రేషన్ కార్డులున్నాయి. వచ్చే నెల 10 వరకు కార్డులు పంపిణీ చేయాలి. సాగు పనులు జోరుగా సాగుతున్న వేళ నీటి నిర్వహణతో పాటు ఎరువుల అంశంలోనూ చర్యలు తీసుకోవాలి. ఫర్టిలైజర్ షాపులన్నింటి ముందు స్టాక్ వివరాలు తప్పనిసరిగా బోర్డుపై డిస్‌ప్లే చేయాలి సబ్సిడీ ఎరువులను ఇతర అవసరాలు మళ్లిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం.

భారీ వర్షాల దృష్ట్యా వాతావరణ సూచనలకు అనుగుణంగా ముందుగానే టీమ్‌లను పంపిస్తున్నాం. పరిశ్రమలకు అనుగుణంగా కోర్సులు, శిక్షణ ఇవ్వాలి. గిగ్ కార్మికులకు సంబంధించిన పూర్తి డేటా ఆన్‌లైన్‌లో ఉంచాలి. వారి కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి - సీఎం రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి): జిల్లాల పరిధిలోని ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, రోజూ కలెక్టర్లు ఏ పనిచేశారో తనకు తెలియజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వారి కార్యాచరణ రిపోర్టు రోజూ తనకు పంపించాలన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వర్షాలు, వానాకాలం పంటసాగు, సీజనల్ వ్యాధులు, రేషన్‌కార్డుల పంపిణీ తదితర అంశాలపై చర్చించారు. "రాష్ట్రంలో సరిపడినంత ఎరువులు ఉన్నాయి. ఆందోళన అవసరం లేదు. ఎరువుల దుకాణాల్లో ఎంత స్టాక్ ఉందో బయట మిగతా 2లో..



సచివాలయంలో కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు



## సినీ ప్రముఖులకు ఈడీ షాక్..

**రానా,విజయ్ దేవరకొండ,ప్రకాశ్ రాజ్, మంచు లక్ష్మీలకు నోటీసులు**

**విచారణకు రావాలని ఆదేశం**

**బెట్టింగ్ యాప్ కేసులో దర్యాప్తు ముమ్మరం**

వార్త 2 లో

## జీవో 49 నిలిపివేత

**ఆదివాసీల అనుమానాలు, ఆందోళనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం**

హైదరాబాద్(జనంసాక్షి): ఆదిలాబాద్ జిల్లాలో కుమురం భీం కన్జర్వేషన్ కారిడార్ కోసం ఇచ్చిన జీవో 49ని రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. ఆదివాసీల అనుమానాలు, ఆందోళనల నేపథ్యంలో జీవో 49 నిలిపివేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తడోబా టైగర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లను కలుపుతూ మధ్యలో ఉన్న ప్రాంతంలో కుమురంభీం కన్జర్వేషన్ కారిడార్ ఏర్పాటు చేస్తూ గత నెల 30న ప్రభుత్వం జీవో 49 విడుదల చేసింది. ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్, కర్జెల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ రేంజ్‌లలో మిగతా 2లో..



ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ కు సంబంధించిన జీవో నంబర్ 49ని ప్రభుత్వం రద్దు చేసిన నేపథ్యంలో సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆదివాసీ సంఘాల నాయకులు.చిత్రంలో మంత్రులు ఉత్తమ్, వివేక్

## కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ కన్నుమూత

- 101 ఏళ్ల వయసులో గుండెపోటుతో మృతి చెందిన నేత
- కమ్యూనిస్టు ఉద్యమాల్లో కీలక భూమిక
- భూస్వాములపై పోరాటంలో అలుపెరగని నేతగా గుర్తింపు

వార్త 2 లో



## హైదరాబాద్‌కు మరో బస్టాండ్

**అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేస్తాం: మంత్రి పొన్నం**

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ మహానగరంలో అత్యాధునిక సౌకర్యాలతో మరో బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఇప్పుడు ఉన్న ఎంజీబీఎస్, జేబీఎస్‌లకు దీటుగా నూతన బస్టాండ్‌ను నిర్మించాలని మిగతా 2లో..





## 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇవ్వలేం

**చేతులెత్తేసిన భాజపా**

- సాధ్యం కాదని తెలిసీ కాంగ్రెస్ బీసీ ఓట్ల రాజకీయం
- రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో ఎలా చేరుస్తారు?
- దానికి సుప్రీం కోర్టు ఒప్పుకోదు
- అంతా తెలిసినా కావాలనే రాజకీయాలు చేస్తున్నారు
- ఢిల్లీలో మీడియా సమావేశంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు

న్యూఢిల్లీ(జనంసాక్షి): బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం, భాజపాపై నిందలు వేస్తే ఊరుకోబోమని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేశారని.. సాధ్యం కాదని తెలిసినా బిల్లు తీసుకొచ్చారని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం కాదని తెలిసినా.. ఓటు- బ్యాంకు పాలిటిక్స్ కోసం మోసం చేస్తున్నారని మండిపడ్డారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రామచంద్రరావు మాట్లాడారు. అసాధ్యమైన పనిని కేంద్రంపైకి నెట్టివేస్తున్నారన్నారు. భాజపా, కేంద్ర ప్రభుత్వంపై నిందలు వస్తే ఊరుకోం. మీకు న్యాయ సలహాదారులు లేరా?ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ తీసివేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. ముస్లింలకు ఇచ్చినవి రాజకీయ రిజర్వేషన్లు.. అందుకే వ్యతిరేకిస్తున్నాం. 42 శాతం బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లోకి తీసుకురాలేం. దానికి సుప్రీంకోర్టు అనుమతించదు. తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీలో ఎందుకు చెప్పలేదని రామచంద్రరావు ప్రశ్నించారు. పార్టీని ఎలా నడిపించాలనే విషయంపై పెద్దల మార్గదర్శనం తీసుకునేందుకు ఢిల్లీకి వచ్చానని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. 46 సార్లు ఢిల్లీకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ దక్కలేదన్నారు. కానీ ప్రధానమంత్రి మిగతా 2లో..

## ఏకపక్షంగా సమావేశాలు

**ప్రతిపక్ష నేతగా కూడా మాట్లాడే అవకాశం ఇవ్వలేదు**

**సభలో ప్రతిపక్షాల గొంతు నొక్కారు**

**విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపణ**

న్యూఢిల్లీ(జనంసాక్షి): లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న తనకు లోక్‌సభ సమావేశాల్లో మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల్లో అధికార పక్షం సభ్యులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేంద్ర రక్షణ మంత్రి, ప్రభుత్వంలోని మిగతా 2లో..





## తొలిరోజే వాయిదాల పర్వం

**లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్, ట్రంప్ వ్యవహారంతోపాటు పలు అంశాలపై చర్చకు విపక్షాల పట్టు**

- రాజ్యసభలో నలుగురు కొత్త సభ్యుల ప్రమాణం
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం

న్యూఢిల్లీ(జనంసాక్షి): పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ, రాజ్యసభ సమావేశమయ్యాయి. పహల్గాం మిగతా 2లో..

## ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా

**వైద్యపరమైన కారణాలతో తప్పుకుంటున్నట్లు రాష్ట్రపతికి లేఖ**

**వర్షాకాల సమావేశాల వేళ అనూహ్య పరిణామం**



న్యూఢిల్లీ(జనంసాక్షి): పార్లమెంటు వర్షాకాల సమావేశాల వేళ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. వైద్య పరమైన మిగతా 2లో..

## ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచం చూపు మనవైపు..

- నిమిషాల్లో పాక్ ఉగ్రస్థావరాలు ధ్వంసం
- మన సైనిక శక్తిని ప్రపంచం గుర్తించింది
- ఉగ్రవాదం,నక్సలిజం నుంచి విముక్తి
- అంతరిక్షంలో త్రివరణ పతాకం ఎగరేసిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా
- పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి భారతదేశం ఉగ్రవాదం, నక్సలిజం వంటి సమస్యలను ఎదుర్కొంటోందని ప్రధాని మోడీ అన్నారు. నేడు నక్సలిజం, మావోయిజం ప్రభావం మిగతా 2లో..





## బంగ్లాలో ఘోర విషాదం

**రాజధాని ఢాకాలో పాఠశాలపై కూలిన యుద్ధ విమానం**

**ఘటనలో 19 మంది మృతి**

**మృతుల్లో 16 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు**

**సాయం చేసేందుకు సిద్ధం: ప్రధాని మోదీ**

ఢాకా(జనంసాక్షి): బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో సోమవారం ఘోర ప్రమాదం జరిగింది. స్థానిక మైల్‌స్టోన్ పాఠశాలపై ఆ దేశ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన శిక్షణ యుద్ధ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. పైలట్‌తోపాటు 16 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు మృతి చెందినట్లు తెలుస్తోంది. మరో 50 మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో మిగతా 2లో..

## రేషన్ కార్డు అంటే ఆహార భద్రత

- 93 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు, సన్న బియ్యం.. దేశంలోనే ఒక రికార్డు
- అభివృద్ధి, సంక్షేమాలను జోడెద్దుల మాదిరిగా పరుగులు పెట్టిస్తున్నాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




బోనకల్(జనంసాక్షి): రేషన్ కార్డు అంటేనే ఆహార భద్రత అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం మధిర నియోజకవర్గం బోనకల్లు మండల కేంద్రంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడారు. అత్యంత పేదలతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన మధ్యతరగతి వర్గాలకు కూడా ఇందిరమ్మ ప్రభుత్వంలో రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 1.15 లక్షల కుటుంబాలు ఉండగా 93 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇవ్వడమే కాదు, సన్న బియ్యం కూడా ప్రజా ప్రభుత్వంలో పంపిణీ జరుగుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. కుటుంబంలోని ఒక్కో వ్యక్తికి నెలకు ఆరు కిలోల చొప్పున సన్న మిగతా 2లో..

## గ్రీన్‌కార్డులకూ ఎసరు..

**పునరుద్ధరణలో తీవ్ర జాప్యంతో ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితుల్లో కార్డుహోల్డర్లు**

వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికాలో ట్రంప్ సర్కారు వచ్చిన తర్వాత గ్రీన్‌కార్డులు, వీసాల జారీ, వలసపోవడం కష్టతరంగా మారాయి. అయితే.. వీటిల్లో వీసాలు, గ్రీన్‌కార్డుల జారీలో జాప్యం వల్ల ఇప్పుడు ఆ దేశ కార్పొరేట్ రంగంపై దుష్ప్రభావం చూపడం మొదలుపెట్టింది. వివిధ రంగాల్లోని కార్పొరేట్ లీడర్లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల వర్క్ పర్మిట్‌లు ముగియడం.. వాటి పునరుద్ధరణ వెంటనే జరగకపోవడంతో వారు పదవుల నుంచి వైదొలగాల్సి వస్తోంది. ముఖ్యంగా శాశ్వత నివాసం కల్పించే గ్రీన్‌కార్డ్‌ల జారీలో జాప్యం వల్ల.. సక్రమమార్గంలో దేశంలోకి వచ్చి కొన్నేళ్లుగా వివిధ కంపెనీల్లో మిగతా 9లో..




## స్థానిక ఎన్నికల్లో పట్టం కట్టండి

**మెజారిటీ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకోబోతోంది :: హరీశ్**

వార్త 2 లో

## ఆ 12 మంది నిర్దోషులే..

**ముంబయి రైలు పేలుళ్ల కేసులో బాంబే హైకోర్టు సంచలన తీర్పు**

**అభియోగాలను నిర్ధరించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైనందున ధర్మాసనం నిర్ణయం**



## 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వలేం

సహా కేంద్ర మంత్రులందరూ ఎప్పుడు అడిగితే అప్పుడు రేవంత్ రెడ్డికి సమయం ఇచ్చారని, మీ పార్టీ ముఖ్యమంత్రికి మీరే ఎందుకు సమయం ఇవ్వడం లేదు చెప్పాలన్నారు రామచందర్ రావు. మతపరమైన రిజర్వేషన్లను మేము వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. తొమ్మిదో షెడ్యూల్లో పెట్టడం కేంద్రం బాధ్యత అని అని అంటున్నారని, లీగల్ ఒపీనియన్ లేకుండా ఆర్డినెన్స్ తీసుకువచ్చారన్నారు. తొమ్మిదో షెడ్యూల్లో పెట్టే అంశాలు కూడా న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయని కేశవనంద భారతి కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని, 2006లో అయ్యర్ కోహ్లీ కేసులో .. సుప్రీంకోర్టు మరోసారి కేశవనంద భారతి కేసు తీర్పు ను దగ్గర మరోసారి పునరుద్ఘాటించిం దన్నారు. తెలంగాణ బీసీలను తప్పుదోవ పట్టించేందుకు ముఖ్యమంత్రి ఆర్డినెన్స్ తెచ్చారని, న్యాయపర మైన చిక్కులు తెలిసి ...బీసీలను మోసం చేస్తున్నందుకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలన్నారు. బీసీ బిల్లుకు, ఆర్డినెన్స్ కు మద్దతు ఇచ్చాం.. వాటిని అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా.. ఎన్నికలు జరగకుండా ఉండేందుకు జరిగే ఎత్తుగడే ఈ మోసమని ఆయన ఆరోపించారు. తమిళనాడు తీర్పు నేపథ్యంలో ...తొమ్మిదో షెడ్యూల్ లో పెట్టే పరిస్థితి లేదని, పార్టీ క్రమశిక్షణ దాటితే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు రామచందర్‌రావు. నాయకులందరూ పార్టీ విధానాలకు లోబడే పని చేయాలని, ఈ అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామన్నారు. కాంగ్రెస్‌లో రేవంత్ రాజగోపాల్ రెడ్డి మధ్య సమస్యలు.. బీఆర్ఎస్ లో కవితకు పార్టీకి మధ్య గొడవలు ఉన్నాయన్నారు. ప్రతి పార్టీలోనూ గొడవలు ఉన్నాయి వాటిని అంతర్గతంగా పరిష్కరించుకుంటామన్నారు.

## సినీప్రముఖులకు ఈడీ షాక్

**హైదరాబాద్(జనంసాక్షి):** బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ అధికారులు సినీ సెలబ్రిటీలకు షాక్ ఇచ్చారు. ఈ కేసులో ముమ్మరంగా విచారణ చేస్తున్న క్రమంలో బెట్టింగ్ యాప్ కేసులో నిందితులుగా ఉన్న సినీ సెలబ్రెటీలకు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే పలువురిని పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దగ్గుబాటి రానా, ప్రకాష్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మీప్రసన్న విచారణకి హాజరవ్వాలని ఈడీ అధికారులు నోటీసులు పంపించారు. జులై 23న దగ్గుబాటి రానా, జులై30న ప్రకాష్‌రాజ్, ఆగస్ట్6న విజయ్ దేవరకొండ, ఆగస్ట్ 13న మంచు లక్ష్మీప్రసన్న విచారణకి హాజరవ్వాలని నోటీసులో తెలిపారు. విదేశీ బెట్టింగ్ యాప్‌లను వీరు ప్రమోట్ చేసినట్లు- ఈడీ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో వీరిని మనీ లాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు విచారణ చేయనున్నట్లు- తెలుస్తోంది. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినందుకు ఆయా కంపెనీల నుంచి సినీ సెలబ్రెటీలకు నగదు ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై విచారణ చేయనున్నారు. ఇప్పటికే హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులు వీరిపై కేసులు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ అధికారులు కేసు నమోదు చేశారు. సినీ సెలబ్రెటీలు బెట్టింగ్ యాప్‌లని ప్రమోట్ చేయడంతోనే పలువురు ఆకర్షితులు అయ్యారని ఈడీ అధికారులు, పోలీసులు చెబుతున్నారు. బెట్టింగ్ యాప్‌లలో పెట్టుబడి పెట్టి అమాయకులు మోసపోయినట్లు అధికారులకి ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఈడీ అధికారులు, పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు. ఎంతోమంది బెట్టింగ్ యాప్‌ల బారిన పడి ఆత్మహత్యలు చేసుకోవడంతో ఈడీ అధికారులు, పోలీసులు ఈ కేసుని సీరియస్‌గా తీసుకుని విచారణ జరుపుతున్నారు.

## బంగ్లాదేశ్‌లో ఘోర విషాదం

చికిత్స పొందుతున్నట్లు సమాచారం. పాఠశాలలో విద్యార్థులు ఉన్న సమయంలోనే ప్రమాదం జరగడంతో తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. విమానం కూలిన వెంటనే పెద్ద ఎత్తున మంటలు, పొగలు వ్యాపించినట్లు స్థానికులు చెబుతున్నారు. అక్కడి దృశ్యాలను మీడియా ప్రసారం చేసింది. మరోవైపు ఎఫ్-7బీజీఐ ఎయిర్‌క్రాఫ్ట్ కూలిపోయినట్లు బంగ్లాదేశ్ ఆర్మీ అధికార ప్రతినిధి ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేస్తున్నారు.

సాయం చేసేందుకు సిద్ధం: ప్రధాని మోదీ

బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో జరిగిన ఘోర విమాన ప్రమాద ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారత్ అండగా ఉంటుందని, అన్నివిధాలా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. "ప్రమాద వార్త తెలిసి షాక్‌కు గురయ్యా. మృతుల్లో చాలా మంది యువ విద్యార్థులు ఉన్నారు. చాలా బాధ అనిపించింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని మోదీ అన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. బంగ్లాదేశ్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన శిక్షణ యుద్ధ విమానం ఢాకా సమీపంలోని పాఠశాలపై కూలిపోయిన సంగతి తెలిసిందే. టేకాఫ్ అయిన కొద్ది సేపటికే ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో పైలట్‌తోపాటు 16 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోగా.. దాదాపు 100 మందికి పైగా క్షతగాత్రులయ్యారు.

## ఆ 12 మంది నిర్దోషులే..

**ముంబయి(జనంసాక్షి):** దాదాపు రెండు దశాబ్దాల క్రితం ముంబయిలో జరిగిన రైలు పేలుళ్ల ఘటనలో బాంబే హైకోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. 2006లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన కేసులో శిక్ష పడిన 12 మందిని తాజాగా నిర్దోషులుగా ప్రకటించింది. వారిపై ఉన్న అభియోగాలను నిర్ధరించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైనందున వారిని నిర్దోషులుగా తేల్చినట్లు తీర్పు వెలువరించింది. వీరిలో ఉరిశిక్ష పడిన ఖైదీలు కూడా ఉండటం గమనార్హం. ఆ పేలుళ్లలో 189 మంది ప్రాణాలు కోల్పోయారు. 2006 జులై 11న ముంబయి పశ్చిమ రైల్వేలైన్‌లోని పలు సబర్బన్ రైళ్లలో వరుసగా బాంబు పేలుళ్లు చోటుచేసుకున్నాయి. యావత్ దేశాన్ని ఉలిక్కిపాటుకు గురిచేసిన ఈ మారణహోమంలో 189 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 800 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై సుదీర్ఘ దర్యాప్తు అనంతరం 2015 అక్టోబరులో ప్రత్యేక కోర్టు.. 12 మంది నిందితులను దోషులుగా తేల్చింది. వీరిలో బాంబు అమర్చారన్న అభియోగాలపై ఐదుగురికి మరణశిక్ష, మిగతా ఏడుగురికి జీవితఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. దోషుల్లో కమల్ అన్సారీ అనే వ్యక్తి 2021లో కొవిడ్ కారణంగా నాగ్‌పుర్ జైల్లో మృతి చెందాడు. ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పుపై దోషులు హైకోర్టును ఆశ్రయిం చారు. వాటిని సవాల్ చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం కూడా పిటిషన్ దాఖలు చేసింది.



# కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించండి

నోటీస్ బోర్డు పెట్టాలి. రాయితీ ఎరువులను ఇతర అవసరాలకు వాడితే కఠిన చర్యలు తీసుకోవాలి. కలెక్టర్లు వాటర్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాలి. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టర్లు ఖర్చు చేసేందుకు ఒక్కొక్కరికి రూ.కోటి కేటాయించాలి. ఇప్పటి వరకు 7లక్షలకుపైగా కొత్త రేషన్‌కార్డులు ఇచ్చాం. ఈనెల 25 నుంచి వచ్చే నెల 10 వరకు రేషన్‌కార్డుల పంపిణీ చేయాలి. ఈ కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలి. అన్ని మండల కేంద్రాల్లో పంపిణీ జరగాలి. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ.. ఆందోళన అవసరం లేదు" అని సీఎం అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో వివిధ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్లను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులను అప్రమత్తం చేయాలని వారికి సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ నుంచి ఇప్పటి వరకు 21 శాతం వర్షపాతం నమోదు అయ్యిందని.. ఇది తక్కువ వర్షపాతమని సీఎం పేర్కొన్నారు. అయితే గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని.. అన్ని విభాగాలను అప్రమత్తం చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ఇప్పటికే 150 బృందాలను ఏర్పాటు- చేశామని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సమన్వయం చేసుకుని ముందుగానే బృందాలను పంపిస్తున్నామని చెప్పారు. పోలీస్ కమిషనరేట్లల్లోని ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాల్లో పిడుగుపాటు- కారణంగా జరిగే నష్టాల వివరాలు నమోదు చేయాలని వారికి వివరించారు. గిరిజనులు అంటువ్యాధుల బారిన పడకుండా ఐటీడీఏ ప్రాంతాల అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటు-లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం సైతం అప్రమత్తంగా ఉండాలని హుకుం జారీ చేశారు. ఆ క్రమంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అజాగ్రత్తగా ఉంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ప్రతీరోజు జిల్లా కలెక్టర్ల కార్యాచరణకు సంబంధించి ప్రభుత్వానికి పూర్తి నివేదికను అందించాలని సీఎస్ రామకృష్ణారావును ఈ సందర్భంగా సిఎం ఆదేశించారు. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని.. సాగునీటికి సంబంధించి వాటర్ మేనేజ్‌మెంట్ ఉండాలని సీఎం రేవంత్ రెడ్డిగ అభిప్రాయపడ్డారు. 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి చేయడం ద్వారా దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఆయన గుర్తు చేశారు. యూరియా స్టాక్‌కు సంబంధించి ప్రతీ ఎరువుల దుకాణం వద్ద స్టాక్ వివరాలను బోర్డుపై ప్రదర్శించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. స్టాక్ డిటైల్స్ ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువుల కొరత ఉన్నట్లు- కొందరు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో కావాల్సినంత యూరియా స్టాక్ ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇతర వ్యాపార అవసరాలకు యూరియా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకోండంటూ అధికారులను ఆదేశించారు. రైతుల కంటే ఏదీ ముఖ్యం కాదని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎరువులకు సంబంధించి ఫిర్యాదులకు ప్రత్యేక డెస్క్ ఏర్పాటు- చేయాలని ఉన్నతాధికారులను ఈ సందర్భంగా సీఎం రేవత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 96 లక్షల 95 వేల 299 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. గతంలో రేషన్ షాపులపై ఆసక్తి ఉండేది కాదని.. సన్న బియ్యంతో రేషన్ కార్డులకు డిమాండ్ పెరిగిందన్నారు. అంతేకాదు రేషన్ కార్డు విలువ, రేషన్ షాపు విలువ పెరిగిందన్నారు.

## హెచ్‌సీఏ అక్రమాల్లో కేటీఆర్, కవిత

### తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గురువారెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అక్రమాల్లో మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత ప్రమేయముందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గురువారెడ్డి ఆరోపించారు. పదేళ్లుగా రాష్ట్రంలోని క్రికెట్ వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్నారని.. చాలా మందికి క్రికెటర్లకు గుర్తింపు లేకుండా చేశారని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీ-ఆర్, కవితతో పాటు హెచ్‌సీఏ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సంపత్‌కుమార్‌ను తక్షణమే విచారించాలి. వారి తప్పుడు నిర్ణయాల వల్ల గ్రామీణ క్రికెటర్లకు అన్యాయం జరిగింది. సమ్మర్ క్యాంపులను ఉచితంగా నిర్వహించాలి. కానీ డబ్బులు తీసుకున్నారు. దానికి మా వద్ద ఆధారాలున్నాయి. ఆ డబ్బంతా ఎక్కడికి పోయింది. అవకాశాల కోసం తెలంగాణ క్రికెటర్లు ఎదురుచూస్తున్నారు. హెచ్‌సీఏలో జరిగిన అక్రమాల వివరాలను సీఐడీ, ఈడీకి అందజేస్తాం. హెచ్‌సీఏ కార్యవర్గాన్ని రద్దు చేయాలి. హెచ్‌సీఏ ఎన్నికపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. క్రికెట్‌తో సంబంధం లేని జగన్మోహన్‌రావు ఎలా అధ్యక్షుడు అయ్యారు?ఆయన వెనుక కేటీ-ఆర్, కవిత ఉన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎలా ఓట్లు- వేస్తారు?ఐపీఎస్ అధికారి సజ్జనార్ కూడా ఎన్నికల్లో పాల్గొన్నారు. 155 క్రికెట్ అసోసియేషన్లు యాక్టివ్‌లో లేవు. అలాంటి వాటికి ఎన్నికలు ఎలా నిర్వహిం చారు? వెంటనే ఎన్నికలు రద్దు చేసి క్లబ్బులను ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.

## జీవో 49 నిలిపివేత

లక్షా 49 వేల హెక్టార్లను టైగర్ రిజర్వులోకి మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే, జీవో 49ను రద్దు చేయాలని ఆదివాసీ ప్రజలతో పాటు మంత్రి సీతక్క, ఆదివాసీ ఎమ్మెల్యేలు కోరారు. మంత్రి సీతక్క, ఆదిలాబాద్ జిల్లా ఇంఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ వివిధ అంశాలు చర్చించి.. జీవో 49 అమలును నిలిపివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జీవో 49ను నిలిపివేస్తూ ప్రభుత్వం సోమవారం మెమో జారీ చేసింది. మంత్రి సీతక్క, ఆదివాసీ ఎమ్మెల్యేలు, నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## హైదరాబాద్‌కు మరో బస్టాండ్

తెలంగాణ ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నూతన బస్టాండ్ కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై ఈటీవీ నిర్వహించిన ముఖాముఖిలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పలు విషయాలను వెల్లడించారు

## స్థానిక ఎన్నికల్లో పట్టంకట్టండి

### మెజారిటీ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకోబోతోంది : హరీశ్

**సిద్దిపేట(జనంసాక్షి):** స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా బిఆర్ఎస్‌దే విజయమని అన్నారు. కాంగ్రెస్ 20 నెలల పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. స్థానిక ఎన్నికలపై ఈ మధ్య సర్వే చేయిస్తే.. తెలంగాణలో మొత్తం 31 జిల్లా పరిషత్‌లు ఉంటే.. 16 నుంచి 18 స్థానాలని బీఆర్ఎస్ కైవసం చేసుకోబోతోందని ఆ సర్వేలో తేలిందని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ని ఓడించాలని పిలుపునిచ్చారు. సోమవారం ప్రజ్ఞాపూర్‌లో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హరీష్‌రావు పాల్గొని బీఆర్ఎస్ శ్రేణులకి దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గజ్వేల్ అని ఉద్ఘాటించారు. 32 రేవంత్ ప్రభుత్వం అన్నదాతలని ఇబ్బందులకు గురిచేస్తోందని మాజీమంత్రి హరీష్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతులు ఎరువులకు లైన్‌లో నిలబడ్డ దాఖలాలు లేవని.. రేవంత్ ప్రభుత్వంలో ఇప్పుడు ఎకరానికి ఒకటే బ్యాగ్ అంటున్నారని... మళ్లీ లైన్లలో నిలబడే పరిస్థితి తీసుకువచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరూ రైతులకు రైతుబంధు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మల్లన్నసాగర్‌లోకి కాళేశ్వరం నీళ్లు ఎందుకు విడుదల చేయడం లేదని నిలదీశారు. కేసీఆర్ హయాంలో మోటార్లు కాలకపోయేవని.. ఇప్పుడు మోటార్ వెండింగ్ దుకాణాలకు గిరాకీ పెరిగిందని విమర్శించారు. ఆనాడు తెలంగాణలో ఒక ఎకరం అమ్మితే ఆంధ్రాలో పది ఎకరాలు భూమి కొనవచ్చని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు రేవంత్ పాలనలో తెలంగాణలో రెండు ఎకరాలు అమ్మితే ఆంధ్రాలో ఒక ఎకరం కొనే పరిస్థితి వచ్చిందని మాజీమంత్రి హరీష్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.

## కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ కన్నుమూత

**తిరువనంతపురం(జనంసాక్షి):** కమ్యూనిస్టు కురువృద్ధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్ (101) కన్నుమూశారు. గత నెల 23న గుండెపోటుతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా.. ఆయన ఆరోగ్య పరిస్థితి మరింతగా క్షీణించడంతో సోమవారం తుదిశ్వాస విడిచారు. 2006 నుంచి 2011 వరకు ఆయన కేరళకు సీఎంగా పనిచేసారు. అవిభక్త వామపక్ష పార్టీలో చీలిక తర్వాత సీపీఎంను స్థాపించిన వ్యక్తుల్లో అచ్యుతానందన్ కూడా ఒకరు. 1923 అక్టోబరు 20న కేరళలో వెనకబడిన ఓ నిరుపేద కుటుంబంలో జన్మించిన అచ్యుతానందన్.. లెనిన్, స్టాలిన్, మావోల జీవితాలతో పాటు-.. ప్రపంచ కమ్యూనిస్టు చరిత్రలో అనేక కీలకఘట్టాలను చూసిన అత్యంత అరుదైన నేత. బాల్యంలో పేదరికం కారణంగా ప్రాథమిక స్థాయిలోనే చదువు ఆపేసి... దర్జీ దుకాణంలో, కొబ్బరి పీచు ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ.. జీవనం సాగించిన అచ్యుతానందన్ కార్మిక ఉద్యమంలో అడుగుపెట్టారు. 1940లో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు. స్వాతంత్ర్యానికి ముందున్న ట్రావెన్‌కోర్ సంస్థానంలో భూస్వాములపై పోరాటంలో భాగంగా జైలుకెళ్లటంతో ఆరంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం అంచెలంచెలుగా ప్రజా నేతగా ముఖ్యమంత్రి స్థాయికి చేరింది. 1964లో సీపీఐ జాతీయ కౌన్సిల్‌ను వదిలేసి.. సీపీఎం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. 1967 నుంచి 2016 దాకా కేరళ అసెంబ్లీకి ఎన్నికైన ఆయన ఒకసారి (2006-2011) ముఖ్యమంత్రిగా, మూడుసార్లు విపక్షనేతగా వ్యవహరించారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాటంలో ఎన్నడూ వెనకంజ వేయని అచ్యుతానందన్... రాష్ట్రంలో భూ ఆక్రమణదారులపైనా ముఖ్యమంత్రిగా ఉక్కుపాదం మోపారు. ఈ చర్యలతో అనేకమంది వ్యతిరేకమైనా ఆయన వెరవలేదు. ప్రజలు.. పార్టీ మధ్య అంతరం వచ్చినప్పుడు మార్క్సిస్టు పార్టీ క్రమశిక్షణనూ పక్కనబెట్టి ప్రజల పక్షాన నిలబడటానికే పెద్దపీట వేశారు.

# తొలిరోజే వాయిదాల పర్వం

ఉగ్రదాడి, ఎయిరిండియా విమాన ప్రమాద మృతులకు ఉభయ సభలు నివాళులర్పించాయి. రాజ్యసభలో కొత్తగా ఎం పికైన నలుగురు ఎంపీలు ప్రమాణస్వీకారం చేశారు. అటు- లోక్‌సభలో విపక్షాలు నిర సనకు దిగాయి. ఆపరేషన్ సిందూర్'తో పా టు పలు అంశాలపై చర్చకు పట్టుబడుతూ లోక్‌సభలో విపక్షాలు ఆందోళన చేపట్టా యి. తామిచ్చిన వాయిదా తీర్మానాలపై చ ర్చించాలని పట్టుబట్టాయి. అయితే ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి, మీరు చర్చక్రమంలో వస్తే సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని స్పీకర్ ప్రకటించారు. పోడియంలోకి రావడం, నిలబడి నినాదాలు చేయడం తగదని అన్నారు. వారి నినాదాల నడుమ స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ప్రతి పక్ష ఎంపీలు నిరసన విరమించాలని సభాపతి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ వారు వినిపించు కోకపోవడంతో సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆగస్టు 21 వరకు 21 రోజుల పాటు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్ సహా అనేక అంశాలపై ప్రశ్నల్ని సంధించడానికి విపక్షాలు మూకుమ్మడిగా సిద్ధమయ్యాయి.

**ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలి: ఖర్గే**

వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభల కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ఇటీవలి భారత్-పాకిస్తాన్ సంఘర్షణ సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన శాంతి ఒప్పందం వాదనలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏప్రిల్ 22న జరిగిన పెహల్గామ్ దాడి గురించి మాట్లాడుతూ, ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడి జరిగి నెలలు గడిచినా, ఆ ఉగ్రవాదులను ఇప్పటి వరకు పట్టుకోలేదు, వారి గురించి సమాచారం కూడా లేదన్నారు. మా పార్టీ మాత్రమే కాదు, అన్ని పార్టీలు దేశాన్ని బలోపేతం చేయడానికి, సైన్యానికి ధైర్యం నింపడానికి మద్దతు ఇస్తున్నట్లు- తెలిపారు. కానీ, ఇప్పుడు అసలు పెహల్గామ్ దాడి జరిగిన దాని గురించి స్పష్టమైన సమాచారం కావాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఇం-టె-లిజెన్స్ విషయంలో లోపం జరిగిందని లెఫ్టినెంట్ గవర్నర్ చెప్పారు. ఆ క్రమంలో ఆపరేషన్ సిందూర్ గురించి ప్రభుత్వం ప్రపంచానికి, భారత ప్రజలకు చెప్పింది. కానీ, ఆ తర్వాత ఏమైంది, ఏం జరిగిందో సమాచారం ఇవ్వాలని ఖర్గే కోరారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత్-పాకిస్తాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందని 24 సార్లు పేర్కొన్నారని ఖర్గే గుర్తు చేశారు. ట్రంప్ ఈ విషయాన్ని ఎందుకు చెబుతున్నారు? శాంతి ఒప్పందం జరిగిందా? ఒకవేళ జరిగితే, దాని వివరాలు ఏంటి? ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలన్నారు. దేశ ప్రజలకు, పార్లమెంటుకు సమాచారం అందించడం ప్రభుత్వం బాధ్యత అని ఈ సందర్భంగా ఖర్గే గుర్తు చేశారు. ఈ దాడి వెనుక ఉన్న ఉగ్రవాదులను పట్టుకోవడంలో జాప్యం జరగడం, ఇం-టె-లిజెన్స్ వైఫల్యం గురించి ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. మన సైన్యం ధైర్యంగా పోరాడుతోంది. కానీ, ఇటు-వంటి సంఘటనలు మన భద్రతా వ్యవస్థలోని లోపాలను బయటపెడుతున్నాయి. ప్రభుత్వం ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా

కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపిన లేఖలో ఆయన పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన రోజే ధన్‌ఖడ్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. 2022 ఆగస్టులో ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. "ఆరోగ్య సంరక్షణతో పాటు వైద్యుల సలహాలను పాటించేందుకు వీలుగా ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నాను. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది. నా పదవీ కాలంలో మద్దతుగా నిలిచిన రాష్ట్రపతి, ప్రధాని, పార్లమెంటు సభ్యులందరికీ కృతజ్ఞతలు. వారి నుంచి లభించిన అమూల్యమైన సహకారం, ఆప్యాయతలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. పదవీకాలంలో ఎన్నో విలువైన విషయాలు నేర్చుకున్నాను. అనేక అనుభవాలను మూటగట్టుకున్నాను. ఈ పరివర్తనాత్మక సమయంలో ఉపరాష్ట్రపతిగా.. దేశ ఆర్థిక పురోగతిని, అభివృద్ధిని గమనించే అవకాశం రావడాన్ని నేను గౌరవంగా భావిస్తున్నాను. ఇది నాకు సంతృప్తినిచ్చింది. ప్రపంచ వేదికపై భారత్ విజయాల పట్ల గర్విస్తున్నాను. దేశ ఉజ్వల భవిష్యత్తుపై అచంచలమైన విశ్వాసం ఉంది" అని తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు.

## ఏకపక్షంగా సమావేశాలు

ఇతర మంత్రులకు మాట్లాడడానికి అవకాశం ఇచ్చి.. తనకు మాత్రం అభిప్రాయాలను తెలియజేసే అవకాశం ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతగా లోక్‌సభలో మాట్లాడే హక్కు తనకు ఉన్నప్పటికీ.. వారు ఈ విధంగా చేయడం ప్రతిపక్షాల హక్కులను కాలరాయడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. లోక్‌సభలో చర్చలు మొదలవగానే ప్రధాని మోదీ అక్కడ నుంచి వెళ్లిపోయారన్నారు. వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యా యి. లోక్‌సభ, రాజ్యసభ సమావేశమయిన అనంతరం ఆపరేషన్ సిందూర్'తో పాటు- పలు అంశాలపై చర్చకు పట్టుబడుతూ లోక్‌సభలో విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ప్రతిపక్ష ఎంపీలు నిరసనను విరమించాలని సభాపతి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ వారు వినిపించుకోకపోవడంతో సభను కొంతసేపు వాయిదా వేశారు. రాజ్యసభలో చర్చలు కొనసాగాయి. ఈ సందర్భంగా లోక్ సభలో తీవ్ర గందరగోళం కొనసాగింది. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు కాంగ్రెస్ పార్టీ ఎంపీలు డిమాండ్ చేశారు. అలాగే, వాయిదా తీర్మానాలపై చర్చించాలని కోరారు. దానికి స్పీకర్ ఒప్పుకోకపోవడంతో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విపక్షాలు లోక్ సభలో నిరసన వ్యక్తం చేశాయి. దీంతో రెండు సార్లు లోక్ సభ వాయిదా పడింది. ఈ సందర్భంగా లోక్ సభలో రాహుల్ గాంధీ మీడి యాతో మాట్లాడుతూ.. లోక్ సభలో విపక్షాలకు కూడా మాట్లాడటానికి అవకాశం ఉండాలి అని డిమాండ్ చేశారు. సభలో నేను రెండు విషయాలు చెప్పాలనుకున్నాను.. రక్షణ మంత్రి, ఇత రులు మాట్లాడతారు.. కానీ, విపక్ష నేతగా నాకు అవ కాశం ఇవ్వలేదని మండిపడ్డారు. మరోవైపు, వయనాడ్ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు సిద్ధమా అని సవాల్ చేసా రు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ పై చర్చకు సిద్ధంగా ఉంటే, సభలో మాట్లాడటానికి మాకెందుకు అవకాశం ఇవ్వలేదు అని ప్రశ్నించింది. విపక్ష నేతగా రాహుల్‌కు అవకాశం ఇచ్చి ఉండాల్సింది అని పేర్కొన్నారు.

## రేషన్ కార్డు అంటే ఆహార భద్రత

బియ్యం ఇవ్వడం భారతదేశ చరిత్రలో నే ఒక రికార్డు అని అన్నారు. లబ్ధిదారుల సంఖ్య రీత్యా చూసినా, సన్న బియ్యం వారీగా చూసిన ఈ దేశంలో ఆహార భద్రత విషయంలో తెలంగాణ రాష్ట్రం ఒక రోల్ మోడల్ గా నిలిచిందని తెలిపారు. కొత్తగా పెళ్లి అయిన వాళ్ళు గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డులు పేరు నమోదు, కుటుంబ సభ్యుల పేర్ల చేర్పులు, మార్పుల కోసం గత పది సంవత్సరాలు కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూసిన ఫలితం కనిపించలేదని తెలిపారు. ఒక మధిర నియోజకవర్గంలోనే కొత్తగా 13,767 మంది లబ్ధిదారులకు ఒకేరోజు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం సంతోషించదగిన అంశం అన్నారు. రేషన్ కార్డులో జారీ అనేది ఉమ్మడి రాష్ట్రంలో నిరంతర ప్రక్రియ కాగా ప్రతి సంవత్సరాలు పరిపాలించిన వారు ఈ విషయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలు పెట్టామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుండగా ఈ పథకం కింద రాష్ట్రంలోని 51 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద పది లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం



రాష్ట్రంలోని 93 లక్షల కుటుంబాలకు అందుబాటులోకి వచ్చిందని వివరించారు. ఇటీవలే తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు రైతులకు రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో జమ చేశాం అని అన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలోనే రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ కింద 21 వేల కోట్లు రైతుల పక్షాన బ్యాంకులకు చెల్లించామని వివరించారు. కేవలం సంక్షేమ కార్యక్రమాలే కాదు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జోడేట్ల మాదిరిగా పరుగులు పెడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ఆర్ అండ్ బి శాఖ ద్వారా 20వేల కోట్లతో పనులు చేపట్టామని, విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ అందుబాటులోకి తీసుకువస్తున్నామని వివరించారు.

## ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచం చూపు మనవైపు..

వేగంగా తగ్గుతోందని చెప్పారు. దేశ భద్రతా దళాలు ఉత్సాహంతో విజయం వైపు పయనిస్తున్నాయని, వందలాది జిల్లాలు నక్సలిజం ప్రభావం నుంచి విముక్తి పొందాయని ఆయన తెలిపారు. గతంలో రెడ్ కారిడార్‌గా పిలిచే ప్రాంతాలు ఇప్పుడు గ్రీన్ జోన్‌లుగా మారుతున్నాయని, ఇది దేశ ఉజ్వల భవిష్యత్తుకు నిదర్శనమని ఆయన అన్నారు. బాంబులు, తుపాకుల ముందు భారత రాజ్యాంగం విజయం సాధిస్తోందని ఆయన ఉద్ఘాటించారు. దేశ భద్రత, సైనిక శక్తి, ఆర్థిక వ్యవస్థ, సైన్స్ అండ్ టెక్నాలజీ, వ్యవసాయ రంగంలో జరుగుతున్న అభివృద్ధిని గురించి ఆయన మాట్లాడారు. పార్లమెట్ సమావేశాలను పురస్కరించుకుని ఆయన పార్లమెంట్ ముందు మీడియాతో మాట్లాడారు. వర్షాకాలం సమావేశాలకు మీ అందరికీ స్వాగతం అని ప్రధాన మంత్రి మోదీ అన్నారు. ఈ సమావేశం దేశానికి గర్వకారణమైన విజయోత్సవంగా ఆయన అభివర్ణించారు. మోదీ తన ప్రసంగంలో దేశం ఎదుర్కొంటున్న హింసాత్మక ఘటనల గురించి మాట్లాడారు. ప్రధాని మోదీ భారత సైనిక శక్తి గురించి మాట్లాడుతూ, దేశం సైనిక రంగంలో గొప్ప పురోగతి సాధిస్తోందని తెలిపారు. సైనిక రంగంలో పరిశోధన, తయారీ, మేక్ ఇన్ ఇండియా ఆయుధాల ఉత్పత్తి బలపడుతోందన్నారు. ఇది యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం 100 శాతం లక్ష్యాలను సాధించిందని, కేవలం 22 నిమిషాల్లోనే శత్రువుల ఇళ్లలోకి వెళ్లి వారి స్థావరాలను నాశనం చేసిందని పేర్కొన్నారు. ఈ విజయం దేశానికి గర్వకారణమని మోదీ అన్నారు. సైన్స్, టెక్నాలజీ రంగంలో భారతదేశం సాధిస్తున్న విజయాల గురించి మోదీ మాట్లాడారు. ఈ రంగంలో దేశం కొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతోందని, అంతరిక్ష రంగంలో భారత్ కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ఆయన తెలిపారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో భారత త్రివర్ణ పతాకం ఎగిరిన సందర్భాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ క్షణం దేశ ప్రజలందరికీ గర్వకారణమని, పార్లమెంట్ లోక్‌సభ, రాజ్యసభ రెండూ ఒకే సమయంలో ఈ విజయాన్ని కొనియాడాయని మోదీ అన్నారు. ఈ విజయాలు భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలకు ప్రేరణగా నిలుస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలో వాతావరణం చాలా బాగా అభివృద్ధి చెందుతోందన్నారు. వ్యవసాయ రంగంలో అభివృద్ధిని కూడా ప్రస్తావించారు.

## కొమరం భీం కన్సర్వేషన్ రిజర్వ్ ఏర్పాటుకు
# బీజం వేసింది బీఆర్ఎస్సే..

- కన్సర్వేషన్ రిజర్వ్ ఏర్పాటుకు అన్ని పార్టీలు సంతకం చేశాయి
- స్థానిక ప్రజల అనుమానాల నేపథ్యంలో నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన సీఎం
- సీఎంను ప్రత్యేకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపిన సీతక్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కొమరం భీం కన్సర్వేషన్ రిజర్వ్ ఏర్పాటు కోసం ఉద్దేశించిన జీవో 49 ను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జీవోను నిలుపుదల చేస్తూ అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి అహ్మద్ నదీం మెమో జారీ చేశారు. జీవో 49 ని రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేయడం పట్ల పంచాయత్ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. సీఎంను సచివాయంలో ఆదివాసీ నేతలతో ప్రత్యేకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. తడోబా టైగర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వలను కలిపేందుకు వాటి మధ్యలో ఉన్న ప్రాంతాన్ని కన్సర్వేషన్ రిజర్వ్ గా ఏర్పాటు చేయాలని 2016 లోనే బీజం పడింది. జూన్ 12, 2016 నాడే దీనికి గత ప్రభుత్వం అంకుర్పార్పన చేసింది. రాష్ట్ర వన్యప్రాణి బోర్డు మొదటి సమావేశం.. ప్రతిపాదిత ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వ్ గా ప్రకటించాలనే ప్రతిపాదనపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చర్చించింది. ఆ తర్వాత 27 ఫిబ్రవరి 2017 న రాష్ట్రవన్యప్రాణి బోర్డు రెండో సమావేశంలో నోటిఫికేషన్ కోసం అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూన్ 26, 2018న ఛీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ప్రతిపదిత ప్రాంతాన్ని వన్యప్రాణులు అభయారణ్యంగా ప్రకటించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. జూలై 11, 2019 లో కవ్వాల్ టైగర్ రిజర్వ్ కారిడార్ కు అనుభందంగా ప్రతిపాదితక ప్రాంతాన్ని ఉపగ్రహ కేంద్రంగా ప్రకటించాలని నిర్ణయించారు. ఆ ప్రాంతాన్ని అత్యవసరంగా కన్జర్వేషన్ జోన్ గా ప్రకటించాలని జాతీయ పులుల సంరక్షణ సంస్థ తెలంగాణ అటవి శాఖను ఆదేశించింది. ఈ ప్రక్రియను కొనసాగిస్తూ బీజేపీ ఎంపీ గుడెం నగేష్, బీఆర్ఎస్ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మీతో పాటు అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులు మద్దతుతో జూలై 10, 2024 న రాష్ట్ర ప్రభుత్వం ముసాయిదాను సిద్దం చేసింది. అనుగుణంగా తడోబా టైగర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వలను కలిపేలా వాటి మద్యలో ఉన్న ప్రాంతాన్ని కొమురం భీం కన్సర్వేషన్ రిజర్వ్ గా ఏర్పాటు చేస్తూ జీవో 49 ని జారీ చేసింది. అయితే ఈ జోవో పట్ల స్థానిక ప్రజలు అనుమానాలు, ఆందోళన వ్యక్తం చేయడంతో మంత్రి సీతక్క నేతృత్వంలో ఆదివాసీ, గిరిజన ఎమ్మెల్యేలతో సంక్షేమ భవన్ లో జూన్ 10, 2025 సమావేశమై జీవో 49ను నిలిపి వేయాలని తీర్మాణం చేశారు. సీఎంను ప్రత్యేకంగా కలిసి స్థానిక ప్రజల ఆకాంక్షలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మరో వైపు అటవీ పర్యావరణ శాఖ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి సీతక్క అటవి అధికారులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్యేలతో 3 జూలై 2025 న సమావేశమై మరో సారి చర్చించి జీవో 49 ని నిలుపు దల చేయాలని నిర్ణయించారు. అనుగుణంగా సీఎం దృష్టికి తీసుకెల్లి జీవో ను నిలిపుదల చేసేలా ఒప్పించారు. దీంతో జీవో 49 ను నిలుపుదల చేస్తూ ప్రభుత్వం సోమవారం నాడు మెమోను జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయం పట్ల స్థానిక ప్రజలు సంబురాలు చేసుకుంటున్న నేపథ్యంలో..వారి ఆకాంక్షల మేరకే జీవో 49 పై ముందుకు వెళుతామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## కులగణన, బీసీ రిజర్వేషన్లపై 24న పవర్ పాయింట్ ప్రజంటేషన్

- ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహణ
- కాంగ్రెస్ ఎంపీల కన్వీనర్ డాక్టర్ మల్లు రవి



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** జులై 24న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీ రానున్నారని చెప్పారు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి. సోమవారం నాడు ఆయన ఢిల్లీ లోని తెలంగాణ భవన్లో మీడియాతో మాట్లాడుతూ కులగణన సర్వేపై నిపుణుల కమిటీ నివేదికను లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేకు అందజేయనున్నారని చెప్పారు.. అనంతరం సాయంత్రం 5 గంటలకు కులగణన, బీసీ రిజర్వేషన్లపై ఇందిరా భవన్ లో దేశంలోని కాంగ్రెస్ ఎంపీలందరికీ సీఎం రేవంత్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తారని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై పార్లమెంట్ లో చర్చించాలని కోరనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ లో ఆపరేషన్ సిందూర్ పై చర్చ జరపాలని పట్టుబడితే పదే పదే సభను వాయిదా వేస్తున్నారని చెప్పారు. వాస్తవాలు దేశ ప్రజలకు తెలియజేయాలని తాము కోరామన్నారు. దీనిపై ప్రధాని మోదీ ఎందుకు నోరు మెదపరని ప్రశ్నించారు. సీఎం రేవంత్ పై ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలను అధిష్టానం పరిశీలిస్తోందన్నారు. ఏవైనా అభ్యంతరాలుంటే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలి కానీ.. బహిరంగ వ్యాఖ్యలు చేయొద్దని సూచించారు. ఈ మీడియా సమావేశంలో డా. మల్లు రవితో పాటు ఎంపీలు రామసహాయం రఘురామ్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి,గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు.

## గురుకులాల్లో ఫుడ్ పాయిజనింగ్‌లు

**వందమంది పిల్లలు ప్రాణాలు పోయినా లెక్కలేదు**

**సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ హరీష్ రావు**



**హైదరాబాద్, జూలై21 (జనంసాక్షి) :** ఢిల్లీకి చక్కర్లు కొట్టడం తప్ప, రాష్ట్రంలో పరిపాలనను చక్కదిద్దడం చేతగాదా సిఎం రేవంత్ రెడ్డిపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. 20నెలల కాంగ్రెస్ పాలనలో పాము కాట్లు, ఆత్మహత్యలు, ఫుడ్ పాయిజనింగ్ లతో 100కు పైగా గురుకుల విద్యార్థులు ప్రాణాలు కోల్పోతే ఎందుకు సీరియస్ గా తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ గురుకులాల ఖ్యాతిని ఎవరెస్ట్ శిఖరం ఎత్తున నిలబెడితే.. రేవంత్ రెడ్డి అధఃపాతాళానికి దిగజార్చాడని విమర్శించారు. ఇంకెంత మంది ప్రాణాలు కోల్పోతే మీ రాతి గుండె కరుగుతుందని ప్రశ్నించారు. స్పందించి ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా, నారాయణ్ ఖేడ్, నాగల్ గిద్ద మోడల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్.. నాగర్ కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్.. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మిపూర్ గ్రామం గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం గురుకుల కళాశాలలో ఫుడ్ పాయిజన్.. ఇలా 48 గంటల్లో జరిగిన ఈ ఫుడ్ పాయిజన్ ఘటనలు కాంగ్రెస్ అసమర్థ పాలనకు నిదర్శనాలు అని విమర్శించారు. ప్రతిపక్షాలపై నోరు పారేసుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రోజురోజుకీ దిగజారుతున్న గురుకులాల దీనస్థితి కనిపించడం లేదా అని హరీశ్ రావు ప్రశ్నించారు. వరుసగా ఫుడ్ పాయిజన్లు జరిగి పదుల సంఖ్యలో విద్యార్థులు ఆసుపత్రి పాలవుతుంటే మనస్సు కరగడం లేదా అని నిలదీశారు. కేసీఆర్ గుర్తులు చెరిపేయాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి గురుకులాల వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తుండటం చారిత్రక నేరమని విమర్శించారు. సంకుచిత మనస్తత్వంతో దళిత, గిరిజన, బడుగు, మైనార్టీ వర్గాల పిల్లలు చదువుకునే గురుకులాల ఖ్యాతికి గ్రహణం పట్టిస్తుండటం దుర్మార్గమని అన్నారు. స్వయంగా తానే మానిటరింగ్ చేస్తానని బీరాలు పలికిన రేవంత్ రెడ్డి, మీ మానిటరింగ్ ఏమైంది? విద్యాశాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉండి మీరు చేస్తున్నదేమిటని ప్రశ్నించారు.

## బిల్స్ ఆఫ్ లేడింగ్ బిల్-2024 ఎంతగానో ఉపయోగకరం

**రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర**



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ఓడరేవులు,జల మార్గాలు,నౌకానిర్మాణం శాఖల మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రవేశపెట్టిన 'బిల్స్ ఆఫ్ లేడింగ్ బిల్ - 2024' దేశానికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని ఆశిస్తూ తమ పార్టీ మద్దతు తెలుపుతున్నదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు.పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం రోజున సోమవారం ప్రవేశపెట్టిన "బిల్స్ ఆఫ్ లేడింగ్ బిల్ -2024"పై ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ తమ తెలంగాణ తీరరహిత రాష్ట్రమైనా కూడా వాణిజ్యం లో మాత్రం బాగా ముందున్నదన్నారు. ఐటీ, ఫార్మా, టెక్స్ టైల్స్ తదితర రంగాలలో ఎన్నో దేశాలకు తెలంగాణ ఎగుమతులు చేస్తోందని తెలిపారు.అటువంటిది, ఈ బిల్లులో ఉన్న సవరణలు తెలంగాణకూ, దేశానికీ ఎంతో ఉపయోగపడతాయని భావిస్తున్నామని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. ఈ బిల్లులోని ముఖ్యాంశాలు క్లాజ్ 2 ప్రకారం "బిల్ ఆఫ్ లేడింగ్"లో పేరుండే వ్యక్తికి అన్ని హక్కులు, బాధ్యతలు వస్తాయని, వాణిజ్యం సూటిగా, నేరుగా జరుగనున్నదని పేర్కొన్నారు. క్లాజ్ 4 ద్వారా నిజమైన డాక్యుమెంట్స్ ఉన్నవారికి న్యాయపరంగా రక్షణ లభిస్తుందని,మోసాలను అడ్డుకునేందుకు ఇది దోహదపడుతుందని ఎంపీ రవిచంద్ర చెప్పారు. క్లాజ్ 5 కేంద్ర ప్రభుత్వానికి మార్గదర్శకాలు ఇవ్వాలనే అధికారం ఇస్తుందన్నారు. 1856 నాటి పాత చట్టాన్ని రద్దు చేసి, కొత్త అవసరాలకు తగ్గట్టుగా ఇది రూపొందించబడిందన్నారు. మన దేశం నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1.2 బిలియన్ టన్నుల సరుకులు మన ఓడరేవుల ద్వారా విదేశాలకు ఎగుమతి చేయడం జరిగిందని ఎంపీ వద్దిరాజు వివరించారు.ఇది మన దేశ వాణిజ్య రంగంలో ఒక గొప్ప మైలురాయిగా చెప్పుకోవచ్చన్నారు. తెలంగాణ 2023-24ఆర్థిక సంవత్సరంలో సుమారు 10 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేసిందని, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ తదితర నగరాలలో నెలకొన్న మధ్య, చిన్న తరహా పరిశ్రమలలో ఉత్పత్తైన సరుకులు విదేశీ మార్కెట్‌లకు చేరేందుకు సముద్ర మార్గాన్ని ఉపయోగిస్తున్నట్లు ఎంపీ రవిచంద్ర చెప్పారు.ఈ బిల్లుతో ఫార్మా కంపెనీలు మాత్రమే కాదు, చిన్న పరిశ్రమలకు, డాక్యుమెంట్ల క్లారిటీ, హక్కుల స్పష్టత వల్ల ఎంతో ఉపయోగం జరుగుతుందని తెలిపారు. విశాఖపట్నం, చెన్నై పోర్టుల ద్వారా తెలంగాణ నుంచి సరుకులు త్వరగా వెళ్లేలా ఇది మరింత దోహదం చేస్తుందని ఎంపీ రవిచంద్ర చెప్పారు.ఇందులో ఒకటి రెండు ఆందోళనలు కూడా ఉన్నాయని, ప్రపంచవ్యాప్తంగా ఈ-బిల్ (ఎలక్ట్రానిక్ బిల్స్ ఆఫ్ లేడింగ్) ఎక్కువగా వాడుతున్నారని, హైదరాబాద్ నగరంలో ఐటీ కంపెనీలు పెద్ద సంఖ్యలో ఉన్నందున ఈ బిల్లులో ఈ-బిల్ కు ప్రాధాన్యత ఉండాలని ఎంపీ వద్దిరాజు సూచించారు. చిన్న ఎగుమతిదారులు ఎదురయ్యే వ్యాజ్యాలకు గాను అంతగా ఖర్చు పెట్టే పరిస్థితి ఉండదన్నారు.క్లాజ్ 4 కింద అవకతవకలు, అక్రమాలు నిరూపించాల్సిన భారాన్ని షిప్ మాస్టర్ మీద వేయడం సమస్యలకు దారి తీయవచ్చని ఎంపీ రవిచంద్ర అభిప్రాయపడ్డారు.

## ఎపిలో నాలుగు రోజులపాటు భారీ వర్షాలు

**హెచ్చరించిన వాతావరణ శాఖ**

**విశాఖపట్నం, జూలై21 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రాబోయే నాలుగు రోజులపాటు- పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంతోపాటు ద్రోణి ప్రభావం కొనసాగుతోందని, దీని వల్ల భారీ వానలు పడే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఆదివారం వరకూ ఉన్న ఉపరితల ఆవర్తనం దక్షిణ ఒడిశా పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి నైరుతి దిశగా ప్రయాణిస్తోందని వెల్లడించారు. కర్ణాటక నుంచి దక్షిణ ఆంధ్రప్రదేశ్ వరకూ ద్రోణి ప్రభావం కొనసాగుతోందని చెప్పుకొచ్చారు. ఏపీలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే జులై 24వ తేదీన ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావణ శాఖ అధికారులు వెల్లడించారు. అలాగే కాకినాడ, ఈస్ట్ గోదావరి, కోనసీమ, వెస్ట్ గోదావరి, ఏలూరు, కృష్ణా, అల్లూరి, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోనూ వానలు పడతాయని చెప్పారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబయి, జూలై21 (జనంసాక్షి) :** నష్టాలను వీడి దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. విశ్లేషకుల అంచనాలను మించి త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు రాణించడం సూచీలకు కలిసొచ్చింది. దీంతో రెండ్రోజుల వరుస నష్టాల తర్వాత సూచీలు బయటపడ్డాయి. మరోవైపు రికార్డు త్రైమాసిక ఫలితాలను ప్రకటించినప్పటికీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 3 శాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ ఉదయం 81,918.53 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,757.73) స్వల్ప లాభాల్లో ప్రారంభమై వెంటనే నష్టాల్లోకి జారుకుంది.

## వివిఎస్ మృతికి సీపీఎం పొలిట్ బ్యూరో సంతాపం

**ఎనిమిదన్నర దశాబ్దాల అనుబంధం గుర్తు చేసుకున్న పార్టీ**



**న్యూఢిల్లీ, జూలై21 (జనంసాక్షి) :** కమ్యూనిస్ట్ ఉద్యమంలో ప్రముఖ నేత, అనుభవజ్ఞుడు వి.ఎస్.అచ్యుతానందన్ (101) మృతికి పొలిట్‌బ్యూరో తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీతో ఎనిమిదన్నర దశాబ్దాల అనుబంధం కలిగిన వి.ఎస్.అచ్యుతానందన్.. కేరళలో కమ్యూనిస్ట్ ఉద్యమ స్థిరత్వానికి ఎంతగానో కృషి చేశారు. ప్రజావక్తగా ప్రజలతో నేరుగా సంభాషించే కళలో ప్రావిణ్యం సంపాదించారు. కఠినమైన జీవనశైలి, సామాజిక న్యాయం పట్ల నిబద్ధత కలగిన వ్యక్తిగా గుర్తింపుపొందిన వివిఎస్... కేరళ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారు. ఆయన మృతి పార్టీకి, కమ్యూనిస్ట్ ఉద్యమానికి తీరని లోటని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఆయనకు నివాళిగా ఎర్రజెండాను అవనతం చేసింది. ఆయన భార్య, కుమారుడు, కుమార్తెలకు సానుభూతి ప్రకటించింది. వి.ఎస్ అని ముద్దుగా పిలుచుకునే అచ్యుతానందన్ కేరళలో వివిధ పోరాటాలకు నేతృత్వం వహించడమే కాకుండా సమర్థవంతంగా నడిపించారు. కార్మికుడిగా ఆస్పిన్వాల్ కంపెనీలో పనిచేసిన సమయంలో కొబ్బరిపీచు కార్మికులను సంఘటిత పరిచారు. ఆ సమయంలోనే మొదటిసారి ట్రేడ్ యూనియన్ ఉద్యమంలోకి అడుగుపెట్టారు. 17 ఏళ్ల వయస్సులో వివిఎస్ 1940లో కమ్యూనిస్ట్ పార్టీలో చేరారు. కృష్ణ పిళ్ళై ఆయనను కుట్టనాడ్‌లో భూస్వాములతో భయంకరమైన దోపిడీకి గురవుతున్న వ్యవసాయ కార్మికుల మధ్య పని అప్పగించారు. ట్రావెన్ కోర్ దివాన్‌కు వ్యతిరేకగా జరిగిన పున్నప్ర వాయిలార్ తిరుగుబాటు- సమయంలో వి.ఎస్. అజ్ఞాతంలోకి వెళ్లారు. అరెస్టు తర్వాత పోలీసులు ఆయనను తీవ్రమైన హింసకు గురిచేశారు. 1956లో ఐక్య కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర కమిటీ-కి, 1958లో జాతీయ మండలికి ఎన్నికయ్యారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్)ను స్థాపించిన జాతీయమండలిలో మిగిలి ఉన్న 32 మంది సభ్యుల్లో ఆయన చివరి వ్యక్తి. ఆయన 1980-1991 వరకు సిపిఐ(ఎం) కేరళ రాష్ట్ర కమిటీ-కార్యదర్శిగా పనిచేశారు. 1964లో పార్టీ కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1985లో పొలిట్‌బ్యూరో సభ్యుడయ్యారు. వయస్సు రీత్యా 2022లో ఆయనను కేంద్ర కమిటీ- నుండి రిలీవ్ చేయగా, ఆ తర్వాత ప్రత్యేక ఆహ్వానితునిగా వున్నారు. కేరళ అసెంబ్లీకి ఏడు పర్యాయాలు ఎన్నికయ్యారు. రెండు పర్యాయాలు ప్రతిపక్ష నేతగా పనిచేశారు. 2006-2011 మధ్య కేరళ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ముఖ్యమంత్రిగా ఆయన పదవీకాలంలో కార్మికుల సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టారు.

### అట్టడుగువర్గాలకు అండగా నిలిచిన విఎస్

**సిపిఐ(ఎం) రాష్ట్రకార్యదర్శి ఎం.వి.గోవిందన్ సంతాపం**

**తిరువనంతపురం, జూలై21 (జనంసాక్షి) :** అనారోగ్య సమస్యలతో సోమవారం మధ్యాహ్నం వి.ఎస్. అచ్యుతానందన్ మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మృతికి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.గోవిందన్ సంతాపం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ.. వి.ఎస్ అట్టడుగు వర్గాల ఉద్యమాన్ని బలోపేతం చేసిన పోరాట యోధుడని అన్నారు. కేరళలోని లెక్కలేనన్ని పోరాటాలను నడిపించిన ధృఢ సంకల్పం ఆయనదని అన్నారు. కేరళతో పాటు- భారత దేశంలో కమ్యూనిస్ట్ పార్టీని ముందకు తీసుకు వెళ్లడంలో ఆయన ప్రత్యేక పాత్ర పోషించారని అన్నారు.

## ఉపాధ్యాయ సంఘాలకు ఏమైనట్టు?


**అన్యాయంగా కేసులు పెట్టిన స్పందించవేం?**

**పోరాట పటిమ చచ్చుబడిందా?**

**రాజకీయ పార్టీల ఒత్తిళ్లకు తలొగ్గాయా?**

**ఇథనాల్ ఫ్యాక్టరీ పోరాటానికి సంబంధం లేకున్నా ప్రభుత్వ టీచర్‌పై కేసు**

**అండగా నిలవని ఉపాధ్యాయ సంఘాలు**



**గద్వాల (జనంసాక్షి) :** ఉపాధ్యాయ సంఘాలు మిన్నకుండిపోతున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ టీచర్ల ఐకమత్యం ఇతర సంఘాలు ఆదర్శంగా తీసుకుని పని చేసేవి. రాజకీయ ఒత్తిళ్లో, రాజీ నేపథ్యమో తెలియదుగానీ ఇప్పుడు సంబంధం లేకుండా కేసులు పెడుతున్నా పట్టించుకోవడం లేదు. అన్యాయంగా, అక్రమంగా, సంబంధం లేకున్నా ఓ ప్రభుత్వ ఉపాధ్యాయునిపై కేసు పెడితే కనీసం నోరెత్తలేని పరిస్థితికి ఉపాధ్యాయ సంఘాలు దిగజారాయి. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామ సమీపంలో ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని, ప్రాణాలు తీసే పరిశ్రమ ఇక్కడ పెట్టొద్దని 12 గ్రామాలు తిరగబడ్డాయి. పరిశ్రమకు అనుమతులు వచ్చాయని తెలిసినప్పటి నుంచీ ఆందోళన చేస్తున్నాయి. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని పోలీసు యంత్రాంగాన్ని ఉసిగొలిపి రెచ్చగొట్టిన ఫలితంగానే రాజోళి మండలం పెద్ద ధన్వాడ రణరంగంగా మారిన విషయం తెలిసిందే. 35 ఎకరాల్లో గాయత్రి ఇథనాల్ కంపెనీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన ఆందోళన కేసులో 57 మంది రైతులపై కేసులు నమోదు చేశారు. అందులో 12 మంది రైతులను రిమాండ్‌కు తరలించారు. ఫ్యాక్టరీ నిర్మాణం దగ్గర 12 గ్రామాల రైతులు కంపెనీ నిర్మాణం చేపట్టే ప్రదేశంలో భారీ వాహనాలను, యంత్ర సామాగ్రిని, కూలీల పూరి గుడిసెలు, కంట్కెనర్లను తగులబెట్టారన్న కారణంగా 57 మందిపై కేసు నమోదు చేయగా 12 మందిని అరెస్ట్ చేసి గద్వాల కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించారు. అయితే ఈ ఘటనతో సంబంధం లేని మరో మందిపైనా కేసులు పెట్టారు. వీరిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు కెఎంఎస్ శ్రావణ్ కూడా ఉన్నారు.

పెద్ద ధన్వాడ గ్రామానికి చెందిన వ్యక్తులు అనే నెపంతో ఘటనతో సంబంధం లేని, పోరాటంలో పాల్గొనని సబ్‌జైలర్‌పైనా, వార్తలు ప్రచురించినందుకు జనంసాక్షి ఎడిటర్ రెహమాన్‌పైనా కేసులు పెట్టారు. రెహమాన్‌పై కేసులు పెట్టిన విధానానాన్ని జర్నలిస్టు లోకమంతా దుయ్యబట్టింది. జిల్లాల్లో జర్నలిస్టులు స్వతంత్రంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించారు. కేసును తొలగించాలని డిమాండ్ చేశారు. ఇది జర్నలిస్టుల్లో ఉన్న పోరాట పటిమ. అలాగే ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై అన్యాయంగా, అక్రమంగా కేసు పెడితే మాత్రం ఉపాధ్యాయ సంఘాలు చడీచప్పుడు లేకుండా ఊరుకుంటున్నాయి. పెద్దధన్వాడలోలాగానే నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ లో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా సబ్బండ వర్ణాలు ఆందోళనలు పాల్గొన్నాయి. అక్కడా ఇష్టారీతిన ప్రభుత్వం కేసులు పెట్టింది. అక్కడి ఆందోళనలో పాల్గొన్న ఆందోళనలో పాల్గొన్న ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్‌ను ప్రభుత్వం విధుల నుంచి తొలగించింది. అయినా అప్పుడూ ఉపాధ్యాయ సంఘాలు స్పందించలేదు. ప్రభుత్వం నుంచి వచ్చే జీతభత్యాలు తీసుకోవడానికి, సొంత ఆర్జన కోసమే సంఘాలు పని చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్దధన్వాడకు సంబంధం లేకున్నా, ఎక్కడో రాయలసీమ దరిదాపుల్లో విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రావణ్‌పై కేసు పెట్టడాన్ని ఉపాధ్యాయ సంఘాలు ఎక్కడా ఖండిరచలేదు. కనీసం ఓ ప్రకటన కూడా విడుదల చేయలేదు. కనీసం స్పందన లేకపోవడంతో ఉపాధ్యాయ సంఘాలకు ఏమైనట్టు అని ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో చర్చ సాగుతోంది. ఇంత అన్యాయం జరుగుతుంటే కనీసం ప్రశ్నించలేని సంఘాలు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. సంఘాలు స్వతంత్ర్యంగా పని చేయాలే తప్ప ఏ రాజకీయ పార్టీలకు తలొగ్గద్దని, మనలోని ఓ సభ్యునిపై కక్షగట్టి, రాజకీయ రంగు పులిమి వికృతంగా కేసులు పెడితే స్పందించకపోతే రేపురేపు తమకు ఏద్కెనా సమస్య వచ్చినా ఇంతేకదా అని ప్రభుత్వ టీచర్ల నుంచి ఆవేదన వ్యక్తమవుతున్నది. గతంలో ప్రభుత్వాలపై అనేక పోరాటాలు జరిపిన ఉపాధ్యాయ సంఘాల పోరాట పటిమను నెమరువేసుకుంటే ఇప్పుడీ కేసు విషయంలో మాట్లాడటానికి ఆ సంఘాలకు పెద్దకష్టమైన పనేం కాదు.

గురుకులాలు ఒకప్పుడు విజ్ఞాన దీపాలుగా, క్రమశిక్షణ కేంద్రాలుగా, కలలను సాకారం చేసే నందనవనాలుగా విరాజిల్లేవి. నల్ల బోర్డు విశాల ప్రపంచాన్ని చూపగా, గురువు నేర్పిన విచక్షణ జీవితాలను నిలబెట్టేది. కానీ, నేడు ఈ గురుకులాలు మృత్యుకూపాలుగా మారుతున్నాయి. కలుషిత ఆహారం, అనారోగ్యం, ఆత్మహత్యలు విద్యార్థులను బలిగొంటున్నాయి. పేద విద్యార్థుల కోసం ఏర్పాటైన సంక్షేమ వసతి గృహాలు సమస్యల స్థావరాలుగా మారాయి. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పినా, క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం తాండవిస్తోంది. అరకొర సౌకర్యాలు, శిథిల భవనాలు, పరిశుభ్రత లేమి, కనీస మరుగుదొడ్లు, నీటి వసతి లేక విద్యార్థులు భయాందోళనలో చదువుకుంటున్నారు. దోమలు, విషపురుగుల బెడద, అపరిశు భ్రమైన మరుగుదొడ్లు, నాణ్యత లేని ఆహారం విద్యార్థుల జీవితాలను కబళిస్తున్నాయి. తెలంగాణలో 1100 గురుకులాలు ఏర్పాటైనా, నిధుల కొరత, అధికారుల నిర్లక్ష్యం విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రభుత్వం మేల్కొని, విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి, ఆహారం అందించాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.






# సమస్యల వలయంలో గురుకులాలు


నాలుగు గోడల తరగతి గది విజ్ఞానాన్ని అందించే నిధి,గురువులు కొలువుండే సన్నిధి,అజ్ఞాన అంధకారంను తొలగించే దీపం,విజ్ఞాన కుసుమాలను వికసింప చేసే నందనవనం,క్రమశిక్షణను అలవరిచే కుటీరం,నల్ల బోర్డు చూపును విశాల ప్రపంచం,సుద్దముక్క పంచును తరగని విజ్ఞానం, గురువు చేతి కర్ర నేర్పును విచక్షణా జ్ఞానం,కలలను సాకారం చేసే బృందావనం, గమ్యాన్ని నిర్దేశం చేసే గురుకులం,జీవితాలను నిలబెట్టే ఆలయం, ఒకప్పుడు గురుకులాలు ఆలా వుంటే, ఇప్పుడు గురుకులాలు మృత్యుకుహ రాలుగా మారుతున్నాయి.ఆహారం విషతుల్యమై కొందరు,అనారోగ్యంతో ఇంకొందరు,ఆత్మహత్యలు చేసుకుని మరికొందరు విద్యార్థులు మరణిస్తున్నారు. పిల్లల మరణాలు తల్లిదండ్రులకు తీరని కడుపు కోత మిగుల్చుతున్నాయి.పేద విద్యార్థులకు విద్యతో పాటు వసతి,ఆహారం అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారాయి.రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయి.ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో ఎక్కడ చూసినా నిర్లక్ష్యం తాండవిస్తున్నది.ఏడాదిగా హాస్టళ్లలో అనుమానస్పద మరణాలు,బలవన్మరణాలు,అనారోగ్యం, కలుషిత ఆహారం తిని చనిపోవడం వంటి ఘటనలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నాయి.కొన్ని సందర్భాల్లో విద్యార్థినులు వ్యాధుల బారిన పడుతున్నారు.విద్యార్థులకు విద్యతో పాటు వసతి, ఆహారం అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాలు,గురుకులాలు,ఆశ్రమ పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారాయి.రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయి. దశాబ్దాలుగా సంక్షేమ వసతి గృహాల్లో పరిస్థితులు మెరుగు పడకపోగా పాలకుల చిన్న చూపు కారణంగా దిగజారుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ప్రత్యేకంగా గురుకుల విద్యాలయాలు ఏర్పాటు చేయడంతో పాటు కొత్తగా సంక్షేమ వసతి గృహాలను మంజూరు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ వాటిలో కనీస సౌకర్యాలు కల్పించక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.అరకొర వసతులు,సవాలక్ష సమస్యలతో అస్తవ్యస్తంగా ప్రభుత్వ గురుకులాలు మారాయి.సరిపడా గదులు లేక కొన్ని,ఉన్నా శిథిలమై పెచ్చులూడే తరగతులు,ఉరుస్తున్న భవనాల భయంభయంగా విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.సరిపడా గదులు లేక కొన్ని, ఉన్నా శిథిలమై పెచ్చులూడే తరగతులు, ఉరుస్తున్న భవనాల భయంభయంగా విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక చాలాచోట్ల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, స్నానగదులు లేవు, వాటికి తలుపులు కూడా మల విసర్జనకూ బాటిళ్లు తీసుకొని ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. ఈ క్రమంలో పాములు, తేళ్లు వంటి విషపురుగులూ కుట్టిన సందర్భాలూ లేకపోలేదు.చాలా ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించడం లేదు. గత ప్రభుత్వం గురుకులాలు, ఆశ్రమ పాఠశాలు, హాస్టళ్లకు సన్నబియ్యంతోపాటు బలవర్ధకమైన పౌష్టికాహారం సరఫరా చేసింది.విద్యార్థులు కూర్చునేందుకు కుర్చీలు, పడుకొనేందుకు గార్మెంట్స్ లేక నేలపైనే కూర్చోబెట్టి క్లాస్‌లు చెప్పడం, రాత్రివేళల్లో అదే నేలపైనే పడుకోబెట్టడడంతో విద్యార్థులు భయాందోళనకు గురువుతున్నారు.దోమల బెడద ఎక్కువగా ఉన్న రాత్రి సమయంలో విపరీతంగా కొడుతున్నాయి అంటున్నారు విద్యార్థులు.వీటి నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలి కోరుకుంటున్నారు. కలుషిత నీటి వల్ల విద్యార్థులు పలుమార్లు జ్వరాల బారిన పడుతున్నారు. అలాగే మూత్రశాలలు,మరుగుదొడ్లు కూడా అపరిశుభ్రంగానే ఉంటున్నాయి.వీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడంలో కూడా అధికారులు నిర్లక్ష్యం కనిపిస్తోంది.అలాగే శుచి, రుచికరమైన భోజనం పెట్టడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.బెంచీలు లేక విద్యార్థులు నేలపైనే కూర్చొని పాఠాలు వింటున్నారు.డార్మెట్రీలో బెడ్స్ కూడా లేక నేలపైనే పడుకోవాల్సి వస్తోంది.వసతి గృహంలో తలుపులు,కిటికీలు లేకపోవడంతో విద్యార్థులు రాత్రి భయపడుతున్నారు.కిటికీ లు లేనందు వల్ల దోమలు ఎక్కువగా వస్తున్నాయి.విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేవు.. అరకొర ఉన్న వాటికి సైతం తలుపులు లేవు.ఇంకా తీవ్రమైన సమస్య ఏంటంటే నీటి వసతి కూడా లేదు.ఇక ఇతర సమస్యలు ఎలాగు తిష్టవేసి కూర్చుని ఉన్నాయి.ఉమ్మడి రాష్ట్రము లో విద్యా వ్యవస్థ తెలంగాణ లో అంతంతా మాత్రమే. తెలంగాణ రాష్ట్రము ఏర్పడిన తర్వాత అనేక గురుకులాలు ఏర్పడ్డాయి.ఉమ్మడి రాష్ట్రము లో సుమారు 200 హాస్టల్ లు కూడా లేవు.కానీ తెలంగాణ రాష్ట్రము ఏర్పడ్డ తర్వాత సుమారు 1100 వరకు గురుకులాలు ఏర్పాటు చేసి,6 లక్షలకు పైచిలుకు విద్యార్థులు చదువు తున్నారు.విద్యా కమిషన్ ను ఏర్పాటు చేసిన ప్రస్తుత ప్రభుత్వం గురుకులాల విషయం లో,అనేక మంది విద్యార్థులు అస్వస్థ కు గురై చనిపోతున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదు. కావలసిన నిధులను కుడా విడుదల చేయడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకొని విద్యార్థులకు కావలసిన సదుపాయాలు,నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుకుంటున్నారు.



డాక్టర్ మోటె చిరంజీవి
సామాజికవేత్త, విశ్లేషకులు
సెల్ : 9949194327

ఢిల్లీ హైకోర్టు తీర్పు..

# 'గోదీ మీడియా'కు చెంపపెట్టు








విదేశీయులకు ఆశ్రయం కల్పించారని, ఉద్దేశ్యపూర్వకంగా కరోనా వ్యాప్తి చేశారనే ఆరోపణలతో 70 మంది తబ్లీగీ జమాత్ సభ్యులపై ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ లు, దాఖలు చేసిన చార్జిషీట్ లను రద్దు చేస్తూ ఇటీవల ఢిల్లీ హై కోర్టు తీర్పు ఇచ్చింది. పోలీసులు చేసిన నేరారోపణలపై ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. అందరినీ నిర్దోషులుగా ప్రకటించడమే కాకుండా.. 'వారు లాక్ డౌన్ కారణంగా మర్కజ్ లో చిక్కుకున్న నిస్సహాయులు' అని వ్యాఖ్యానించింది. అయితే 2020లో కొవిడ్-19 మహమ్మారి తీవ్ర రూపం దాల్చిన సమయంలో, ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్‌లో జరిగిన సమావేశాన్ని కారణంగా చూపుతూ.. ముస్లిం సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని తబ్లీగీ జమాత్ పై పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేసిన మీడియా.. ఢిల్లీ హై కోర్టు తీర్పు వార్తను మాత్రం తొక్కిపెట్టింది. జడ్జిమెంట్ వార్తను కొన్ని సెకన్లకు మాత్రమే పరిమితం చేసింది. 2020లో 'కరోనా జిహాద్' అనే హ్యాష్ ట్యాగ్ తో ముస్లింలపై విషం చిమ్మిన చానెల్స్.. ఇప్పుడు కోర్టు తీర్పును మాత్రం బ్రేకింగ్ న్యూస్‌గా ప్రసారం చేయడానికి భయపడుతున్నాయి.

**లాక్ డౌన్‌కు ముందే సమావేశం**

కొవిడ్‌ను ఒక మహమ్మారిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ 2020 మార్చి 11న ప్రకటించింది. దీంతో 200 మందికి మించి సమావేశాలపై భారత ప్రభుత్వం మార్చి 13న నిషేధం విధించింది. ఆ తర్వాత మత సమావేశాలను 50 మందికి పరిమితం చేస్తూ మార్చి 16న ఆదేశాలు జారీ చేసింది. మార్చి 24న దేశవ్యాప్త లాక్‌డౌన్ విధించింది. అయితే అంతకుముందే ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్ లో అంతర్జాతీయ మత సమావేశానికి సంబంధించి షెడ్యూల్ ఖరారైంది. మార్చి 13, 14, 15 తేదీల్లో ఈ సమావేశాన్ని నిర్వహించారు. అంటే కొవిడ్-19 మహమ్మారి గురించి పూర్తి అవగాహన లేని సమయంలో, లాక్‌డౌన్ ప్రకటనకు ముందే ఈ సమావేశం పూర్తయింది. ఒక్కసారిగా లాక్ డౌన్ ప్రకటించడంతో మర్కజ్ లో ఉన్న వందలాది మంది విదేశీయులు భారత్ లోనే చిక్కుకుపోయారు.
ముస్లిం సమాజాన్ని లక్ష్యంగా చేసుకొని అనేక మీడియా సంస్థలు మర్కజ్ సమావేశంపై దుష్ప్రచారం చేశాయి. కొవిడ్ వ్యాప్తికి ప్రధాన కారణంగా చిత్రీకరించాయి. 'కరోనా జిహాద్', 'మానవ బాంబులు', 'సూపర్ స్ప్రెడర్స్' వంటి శీర్షికలతో ముస్లింల పట్ల ద్వేషాన్ని పెంచాయి. ఉత్తరప్రదేశ్‌లోని సహరన్‌పూర్‌లో తబ్లీగీ జమాత్ సభ్యులు ఆస్పత్రిలో అసభ్యంగా ప్రవర్తించారని, నాన్-వెజ్ ఆహారం డిమాండ్ చేశారని తప్పుడు వార్తలు ప్రసారం చేశాయి. ఈ దుష్ప్రచారం ముస్లిం లపై వివక్షకు, సామాజిక బహిష్కరణకు దారితీసింది. దేశవ్యాప్తంగా అనేక చోట్ల ముస్లిం సమాజంపై దాడులకు కారణమైంది. సామాజిక సామరస్యాన్ని సైతం దెబ్బతీసింది.

**నిరాధార ఆరోపణలన్న ఢిల్లీ హైకోర్టు..**

తబ్లీగీ జమాత్ కు చెందిన 70 మంది భారత పౌరులపై పోలీసులు చేసిన ఆరోపణలు నిరాధారమైనవని ఢిల్లీ హై కోర్టు స్పష్టమైన తీర్పు చెప్పింది. వారికి కొవిడ్ పాజిటివ్ ఉన్నదని, లేదా 2020 మార్చి 24 తర్వాత వారు మర్కజ్ నుంచి బయటకు వెళ్లారని, కొవిడ్ వ్యాప్తి చేశారని ఏ ఒక్క ఆధారం లేదని జడ్జిమెంట్ లో పేర్కొంది. లాక్ డౌన్ విధించినప్పుడు వారు ఎక్కడికి వెళ్లగలుగుతారని ప్రశ్నించింది. వారంతా లాక్‌డౌన్ కారణంగా మర్కజ్‌లో చిక్కుకుపోయిన నిస్సహాయ వ్యక్తులని వ్యాఖ్యానించింది. మర్కజ్‌లో నివసించడం, విదేశీయులకు ఆశ్రయం కల్పించడం నిషేధ ఆదేశాల ఉల్లంఘన కాదని స్పష్టం చేసింది. ఎఫ్‌ఐఆర్ లు, చార్జిషీట్లను కొనసాగించడం న్యాయ ప్రక్రియ దుర్వినియోగానికి సమానమని అభిప్రాయపడుతూ వాటిని రద్దు చేసింది. కాగా, అంతకు ముందే బాంబే హై కోర్టుతోపాటు ఇతర కోర్టులు కూడా ఇలాంటి తీర్పులనే వెలువరించాయి. అంతేకాకుండా తబ్లీగీ జమాత్ సమావేశం గురించి మీడియా రిపోర్టింగ్‌ను విమర్శిస్తూ, 'దేశంలో ప్రతీదీ మతపరమైన కోణంలో చూపబడుతోంది. ఇది దేశానికి చెడ్డ పేరు తెస్తుంది' అని 2021లో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ వ్యాఖ్యానించారు.

**చేసిన తప్పునకు క్షమాపణలు అవసరమే..**

తబ్లీగీ జమాత్ ఘటనపై చేసిన రిపోర్టింగ్.. భారత మీడియా యొక్క బాధ్యతారాహిత్యాన్ని, సంక్షోభ సమయంలో ఒక నిర్దిష్ట సమాజాన్ని లక్ష్యంగా చేసుకునే విధానాన్ని బహిర్గతం చేసింది. కానీ అప్పట్లో ద్వేషాన్ని రెచ్చగొట్టిన మీడియా.. ఢిల్లీ హై కోర్టు తీర్పు తర్వాత మౌనంగా ఉండడం సరికాదు. టీఆర్పీ కోసం, ఒక పార్టీ రాజకీయ లబ్ధి కోసం ముస్లింలపై దుష్ప్రచారం చేసిన మీడియా.. ఢిల్లీ హై కోర్టు తీర్పు తర్వాతైనా క్షమాపణలు చెప్పాల్సిన అవసరమున్నది. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా పేర్కొనబడే మీడియాకు విశ్వసనీయత ఎంతో అవసరం. అయితే, తబ్లీగీ జమాత్ ఘటనలో.. మీడియా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసి, సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసింది. ఇప్పుడైనా మీడియా తన తప్పిదాలను సరిదిద్దుకోవాలి. చేసిన తప్పునకు క్షమాపణలు కోరాలి. ఇది మీడియాపై విశ్వసనీయతను మరింత పెంచుతుంది.



ఫిరోజ్ ఖాన్,
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9640466464

నోబెల్ పురస్కార ప్రతిష్టకు

# మచ్చ రానుందా?



ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన నోబెల్ అవార్డుల గురించి వార్తలు తరచూ కనిపిస్తున్నాయి, ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి కోసం పరితపించడం దీనికి ప్రధాన కారణం. ఈ సంవత్సరం నోబెల్ శాంతి బహుమతికి 338 మంది నామినేట్ అయ్యారు. 11 మిలియన్ స్వీడిష్ క్రోనర్ల విలువైన నోబెల్ బహుమతి భారత కరెన్సీలో సుమారు 8.9 కోట్ల రూపాయలకు సమానం. నోబెల్ బహుమతులను ఆశించే వారు భారీ నజరానా కోసం కాక, తమ ప్రతిభకు, వివిధ రంగాల్లో చేసిన సేవలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు, గౌరవం కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తారు. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వైద్యం, ఆర్థిక శాస్త్రం, సాహిత్యం వంటి రంగాలతో పాటు, ప్రపంచ శాంతి కోసం అవిశ్రాంతంగా పాటుపడిన వ్యక్తులకు నోబెల్ శాంతి బహుమతి అందజేయడం ఈ అవార్డుల పరంపరలో ప్రాముఖ్యతను సంతరించుకుంది. స్వీడన్‌కు చెందిన ప్రముఖ రసాయన శాస్త్రవేత్త, డైనమైట్ సృష్టికర్త ఆల్ఫ్రెడ్ బెర్న్‌హార్డ్ నోబెల్ జ్ఞాపకార్థం, ఆయన వర్ధంతి సందర్భంగా ప్రతి ఏటా నోబెల్ ఫౌండేషన్ ద్వారా వివిధ రంగాల్లోని ప్రజ్ఞావంతులైన ప్రముఖులకు ఈ అవార్డులను ప్రధానం చేస్తారు. తన ఆవిష్కరణల దుష్ఫలితాలపై గాఢమైన పశ్చాత్తాపంతో, తన సంపదను వివిధ రంగాల్లో ప్రతిభావంతుల ప్రోత్సాహానికి వినియోగించాలని నిర్ణయించాడు, ఇది నోబెల్ ఫౌండేషన్ ఏర్పాటుకు దారితీసింది. రెండవ ప్రపంచ యుద్ధంలో అణుబాంబుల తయారీని, వాటి వినియోగాన్ని వ్యతిరేకించిన సుప్రసిద్ధ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ లాగే, నోబెల్ కూడా తన ఆవిష్కరణల వల్ల ప్రపంచానికి నష్టం జరగడంపై తీవ్ర మనోవ్యథకు గురయ్యాడు. ఈ నేపథ్యంలోనే నోబెల్ ట్రస్ట్ ఏర్పడింది. నోబెల్ బహుమతుల ఎంపిక కోసం విస్తృతమైన మేధోమథనం జరుగుతుంది, ఇది ఒక సుదీర్ఘ ప్రక్రియ. రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ భౌతిక, రసాయన శాస్త్రాల్లో, స్టాక్‌హోం కరోలిన్స్కా సంస్థ వైద్య రంగంలో, స్వీడిష్ అకాడమీ సాహిత్య రంగంలో, రాయల్ స్వీడిష్ అకాడమీ నియమించిన ఆర్థిక శాస్త్ర కమిటీ ఆర్థిక రంగంలో నోబెల్ బహుమతుల ఎంపిక కార్యక్రమాన్ని చేపడుతుంది. వ్యక్తుల గుణగుణాలు, శాంతి స్థాపన కోసం చేసిన ప్రయత్నాలను వాస్తవిక దృక్పథంతో పరిశీలించి, నార్వేజియన్ నోబెల్ కమిటీ శాంతి బహుమతి గ్రహీతలను ఎంపిక చేస్తుంది. ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి సందర్భంగా బహూకరించే నోబెల్ పురస్కారాలు ప్రపంచంలో అత్యుత్తమ పురస్కారాలుగా పరిగణించబడతాయి. ఆల్ఫ్రెడ్ నోబెల్ కేవలం సైన్స్‌లోనే కాక, విభిన్న రంగాల్లో తన విలక్షణ శైలితో ప్రతిభావంతుడిగా రాణించాడు, అందుకే నోబెల్ బహుమతులను వివిధ రంగాల ప్రముఖులకు ప్రతి ఏటా అందజేస్తారు. అయితే, డోనాల్డ్ ట్రంప్ లాంటి వ్యక్తులు నోబెల్ శాంతి బహుమతి కోసం ప్రాకులాడటం విచిత్రంగా, హాస్యాస్పదంగా ఉంది. ప్రపంచ శాంతి కోసం పాటుపడుతున్నానని ప్రగల్భాలు పలికే ట్రంప్, ఒకవైపు తన అహంకారంతో యుద్ధాలకు ఉసిగొల్పు తూ, మరోవైపు శాంతి ప్రవచనాలు చేస్తూ నోబెల్ శాంతి బహుమతి కోసం ప్రయత్నించడంలో ఎలాంటి ఔచిత్యం లేదు. ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి కోసం పైరవీలు చేస్తున్నారనే వార్తలు విభ్రాంతి కలిగిస్తున్నాయి. గాజాలో హమాస్-ఇజ్రాయిల్ మధ్య సంధి, ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం, భారత్-పాకిస్థాన్‌లను బెదిరించి సీజ్‌ఫైర్‌కు ఒప్పించానని చెప్పుకునే ట్రంప్, రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం ఎందుకు కుదర్చలేకపోయాడు? రష్యా ఆయుధాలు, చమురు దిగుమతి చేయవద్దని భారత్‌ను బెదిరించడం, గుజరాత్ రిఫైనరీపై ఆంక్షలు విధించడం, రష్యాకు హెచ్చరికలు జారీ చేయడం అమెరికా నియంతృత్వ ప్రయత్నాలకు పరాకాష్టగా కనిపిస్తుంది. అమెరికా ఇతర దేశాలపై తన నిర్ణయాలను బలవంతంగా రుద్దడం శాంతికి సంకేతమా? గాజాను స్వంతం చేసుకోవాలని, కెనడాను అమెరికాలో విలీనం చేయాలని, పనామా కాలువ, గ్రీన్‌లాండ్ తనవని, మెక్సికోను శాసించాలని కోరుకునే ట్రంప్ శాంతి కాముకుడా, శాంతి భక్షకుడా? గాజాలో లక్షలాది పాలస్తీనీయులను ఖాళీ చేయించి, దాన్ని పర్యాటక ప్రాంతంగా మార్చాలని వాంఛించడం దేనికి నిదర్శనం? ఎన్నికల ముందు, తర్వాత కొద్ది రోజుల వరకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీపై విరుచుకుపడి, ఇప్పుడు రష్యాపై దాడులకు ఆయుధాలు సమకూరుస్తానని, భారత్‌పై 100 శాతం సుంకాలు, నాటో దేశాలతో ఆంక్షలు విధిస్తామని హెచ్చరించడం శాంతి ప్రతిపాదనా? జెలెన్స్కీకి మద్దతు ఇస్తూనే, రష్యా 50 రోజుల్లో యుద్ధం ఆపకపోతే సుంకాలు విధిస్తానని చెప్పడం సంధి ప్రయత్నమా? ఇది అమెరికా బలవంతపు నిర్ణయాల రుద్దడం కాదా? ట్రంప్ కేవలం అమెరికా అధ్యక్షుడు, ప్రపంచానికి కాదు. ఇరాన్‌పై దాడి చేసిన వ్యక్తి శాంతి బహుమతికి అర్హుడా? ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి దక్కితే, ఈ అవార్డు ప్రాధాన్యత కోల్పోవడం ఖాయమని, ఆయన శాంతి కాముకుడు కాదని, శాంతి భక్షకుడనే విమర్శలు వినిపిస్తున్నాయి. డిసెంబర్‌లో ప్రధానం చేయబడే నోబెల్ శాంతి బహుమతి ఎవరికి దక్కుతుందో చూడాలి. నోబెల్ కమిటీ యొక్క కఠినమైన ఎంపిక ప్రక్రియ, శాంతి కోసం నిజమైన కృషి చేసిన వారిని గుర్తించడంలో దృష్టి సారిస్తుంది, కాబట్టి ట్రంప్ వంటి వివాదాస్పద వ్యక్తుల అర్హతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



సుంకవల్లి సత్తిరాజు
సామాజిక విశ్లేషకులు,
మోటివేషనల్ స్పీకర్
మొ: 9704903463

## ప్రేమా..!

భుజం నుంచి భుజానికి,
హృదయం నుంచి హృదయానికి
ప్రవహించేదే ప్రేమ!
అది మాటల్లో కాదు,
నిశ్శబ్దంలో పుడుతుంది.
ఒక చేతి స్పర్శ, ఒక చూపు,
ఒక ఊపిరి సైతం –
ఎంత చెప్పగలదో చెప్పేస్తుంది.
ప్రేమకు గోడలు లేవు,
రహదారులూ లేవు.
మనసులు కలిసిన క్షణంలోనే
అది సాగిపోతుంది –
ఎటూ ఆగని నదిలా,
ఎటూ ఆరని వెలుగులా.
ప్రేమ అనేది –
నువ్వు నేను అని కాదు,
"మనము" అని పిలిచే
అదృశ్య సేతువే!

బాలాజీ పోతుల
8179283830

# మోదీ దశాబ్ద పాలనలో దిగజారుతున్న ప్రతిష్ట?

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత దశాబ్ద కాలంగా భారతదేశం రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో గణనీయమైన మార్పులను చవిచూసింది. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి, మోదీ బలమైన నాయకత్వం, ఆకర్షణీయమైన వాగ్ధాటి, అభివృద్ధి ఆధారిత వాగ్దానాల ఎజెండాతో దేశవ్యాప్తంగా ఆదరణ పొందారు. అయితే, 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు, ఆర్థిక సవాళ్లు,విదేశీ వ్యవహారాలలో వైఫల్యాలు మోదీ పాలనపై కొత్త చర్చలకు తెరలేపాయి. ఈ వ్యాసం మోదీ పాలనలోని విజయాలు, వైఫల్యాలు, రాజకీయ విశ్లేషకులు గుర్తించిన ఆయన రాజకీయ ప్రతిష్ట గ్రాఫ్ పతనాన్ని వివరిస్తుంది.

**ఎన్నికల ఫలితాలు - ప్రజాతీర్పు:**

2024 లోక్‌సభ ఎన్నికలు మోదీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. "400 పార్" అనే నినాదంతో భారీ మెజారిటీ సాధిస్తామని ధీమాగా ప్రకటించిన బీజేపీ, కేవలం 240 సీట్లకే పరిమితమైంది. ఇది 2019లో సాధించి న 303 సీట్లతో పోలిస్తే గణనీయమైన తగ్గుదల. ఈ ఫలితాలు ప్రజలలో మోదీ పాలనపై అసంతృప్తి ఉన్నట్లు స్పష్టంగా సూచిస్తున్నా యి. జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డీఏ) మిత్రపక్షాల మద్దతు తో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ద్వారా మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటికీ, ఈ సంకీర్ణ పరిస్థితి ఆయన గత రెం డు పర్యాయాలలో చూపిన ఏకపక్ష నిర్ణయాధికా రాన్ని బలహీనప రిచింది.ఈ ఎన్నికల ఫలితాల వెనుక పలు కారణాలు ఉన్నాయి. గత దశాబ్దంలో మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ... నల్లధనం తిరిగి తెప్పించడం, ప్రతి భారతీయుడి ఖాతాలో 15 లక్షల రూపాయ లు జమ చేయడం, సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాల సృష్టి, రైతుల ఆదాయం రెట్టింపు మొదలైన అనేక అలవికాని వాగ్దానాలు చేసినా, దేశ ప్రజల్లో ఆశలు రేకెత్తించినా ఆచరణలో "నీటి మీద రాతలు" గా అమలు కాకపోవడం ప్రజలలో తీవ్రంగా నిరాశను కలిగించింది. ఉదాహరణకు, ఆర్థిక వ్యవస్థలో నల్లధనం తగ్గలేదుబీ బదులుగా, స్విస్ బ్యాంకులలో భారతీయుల డిపాజిట్లు 2023 నాటికి 70 శాతం పెరిగాయని ఒక నివేదిక సూచిస్తుంది. అలాగే, "మేక్ ఇన్ ఇండియా" పథకం ఆశించిన స్థాయిలో ఫలితాల ను ఇవ్వలేదు, ఎగుమతులు 2023-24లో 3 శాతం తగ్గాయి.

**ఆర్థిక వైఫల్యాలు:**

మోదీ పాలనలో ఆర్థిక సవాళ్లు కీలకమైన విమర్శలకు దారితీశాయి. ధరల పెరుగుదల మరియు నిరుద్యోగం రెండు ప్రధాన సమస్యలు గా నిలిచాయి. ఇండియా టుడే-సీ వోటర్ సర్వే (2024) ప్రకారం, 42 శాతం మంది ప్రజలు ఈ రెండు అంశాలను మోదీ ప్రభుత్వం యొక్క అతిపెద్ద వైఫల్యాలుగా గుర్తించారు. ద్రవ్యోల్బణం 2024లో 6 శాతానికి పైగా ఉంది, ఇది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లక్ష్యం (4 శాతం) కంటే ఎక్కువ. రూపాయి విలువ కూడా 2014లో డాలర్‌తో పోలిస్తే 83 రూపాయలకు పడిపోయింది, ఇది దిగుమ తులను ఖరీదైనదిగా మార్చింది. నిరుద్యోగ రేటు 2024లో 8.5 శాతానికి చేరుకుంది. యువతలో నిరాశను మరింత పెంచింది. "మేక్ ఇన్ ఇండియా" వంటి పథకాలు ఉత్పాదక రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంలో విఫలమయ్యాయి.




2023-24లో భారతదేశం యొక్క తయారీ రంగం వృద్ధి 5.5 శాతానికి పరిమితమైంది. చైనా (7 శాతం) అలాగే వియత్నాం (8 శాతం) వంటి దేశాలతో పోలిస్తే ఇది చాలా తక్కువ. కంపెనీల మూసివేత మరియు ఎగుమతుల క్షీణత ఆర్థిక వ్యవస్థను మరింత బలహీనపరిచాయి. ఈ సమస్యలు మోదీ పాలన యొక్క ఆర్థిక విజయాలపై ప్రశ్నలను లేవనెత్తాయి.

**శాంతి భద్రతలు క్షీణించాయి:**

మోదీ పాలనలో శాంతి భద్రతలు కూడా సవాళ్లను ఎదుర్కొన్నాయి. బీజేపీ పాలిత రాష్ట్రాలలో హత్యలు, లైంగిక దాడులు, దోపిడీలు విపరీతంగా పెరిగాయని విమర్శలు ఉన్నాయి. ఉదాహరణకు, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో 2023 డేటా ప్రకారం, ఉత్తరప్రదేశ్‌లో హింసాత్మక నేరాలు 12 శాతం పెరిగాయి. పహల్గాం ఉగ్రవాద దాడి మోదీ ప్రభుత్వం యొక్క భద్రతా వైఫల్యానికి ఒక ఉదాహరణ గా నిలిచింది. ఈ దాడి తర్వాత చేపట్టిన "ఆపరేషన్ సిందూర్" భారత సైన్యానికి అంతర్జాతీయ గుర్తింపును తెచ్చినప్పటికీ, దౌత్యపరంగా పాకిస్థాన్‌ను ఒంటరిగా చేయడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**విదేశీ దౌత్య వ్యవహారాలలో వైఫల్యాలు:**

మోదీ పాలనలో విదేశీ వ్యవహారాలు కూడా విమర్శలను ఎదుర్కొన్నా యి. పహల్గాం దాడి సందర్భంగా అంతర్జాతీయ సమాజం ముందు పాకిస్థాన్‌ను దోషిగా నిలబెట్టడంలో భారత్ ఘోరంగా విఫలమైంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు తానే కారణమని పదేపదే బహిరంగ వేదికలపై పేర్కొంటున్నప్పుడు, మోదీ ప్రభుత్వం దానిని బలంగా తన వాదనల తో ఖండించలేకపోయింది. అమెరికా భారత్‌పై విధించిన సుంకా లు, రష్యాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటే 100 శాతం అధికంగా టారిఫ్ లు విధిస్తామని నాటో దేశాల బెదిరింపులతో కూడిన హెచ్చరికలు వంటి సవాళ్లను ఎదుర్కోవడంలో కూడా భారత్ చాలా బలహీనంగా కనిపించింది.అతి పెద్ద ప్రజాస్వామిక, సార్వభౌమాధికార దేశాన్ని ఒక బఫర్ స్టేట్ ను బెదిరించి నట్టుగా ట్రంప్, నాటో దేశాల సైన్యాధ్యక్షుడు కూడా బెదిరించటం భారత్ కు తీరని అవమానం. భారత్ ఈ బెదిరింపులకు లొంగిపోయినట్లు అంతర్జాతీయ సమాజం ముందు కనిపించింది. "వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటీఓ) నియమాల ప్రకారం మన దేశ అవసరాల కు అనుగుణంగా మేము ఏ దేశంతో నైనా మాకు నచ్చినట్లు వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటాం" అడగటానికి మీరు ఎవరు? అని ధీటుగా సమాధానం మన పాలకులు చెప్పలేక పోయారు.

**పొరుగు దేశాలతో సంబంధాలు:**

మోదీ పాలనలో క్రమంగా ఇరుగు పొరుగు దేశాలతో సంబంధాలు కూడా గణనీయంగా క్షీణించాయి.ముఖ్యంగా మాల్దీవులు, శ్రీలంక, బంగ్లాదేశ్, భూటాన్ వంటి దేశాలు చైనాతో సన్నిహిత సంబంధా లను ఏర్పరచు కుంటున్నాయి. మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు భారత్‌పై విమర్శలు గుప్పించడం, శ్రీలంకలో భారత వ్యతిరేక మార్క్సిస్ట్ నాయకుడు అనుర కుమార దిసనాయకే అధ్యక్షు డిగా ఎన్నిక కావడం వంటివి భారత్ యొక్క ప్రాంతీయ ప్రభావాన్ని బలహీనపరిచాయి. చైనా యొక్క బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో భాగంగా ఈ దేశాలు పెద్ద ఎత్తున రుణాలను స్వీకరిస్తున్నాయి, గత ప్రధాన మంత్రులు మోదీ చేసినన్ని విదేశీ పర్యటనలు చేయలేదు. ఇది రికార్డు బ్రేక్ చేసింది.అయినా గతంలో కంటే విదేశీ సంబంధా లు బలహీన పడ్డాయి. ఫలితాలు భారత్ కు అనుకూలంగా సాధించటంలో దారుణంగా దౌత్యపరమైన వైఫల్యాన్ని చెందింది.

**రాజకీయ వైఖరిలో మార్పు:**

మోదీ యొక్క మూడవ పర్యాయం గత రెండు పర్యాయాల కంటే భిన్నంగా ఉంది. గతంలో ఆర్టికల్ 370 రద్దు, జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు వంటి నిర్ణయాలను ఏకపక్షంగా అమలు చేసిన మోదీ, ఇప్పుడు సంకీర్ణ పక్షాల ఒత్తిడికి తలొగ్గాల్సి వచ్చింది. 2024 ఎన్నికలలో కులగణనను వ్యతిరేకించిన బీజేపీ, ఎన్నికల తర్వాత 2026 జనగణనలో కులగణనను చేర్చడానికి అంగీకరించింది. అలాగే, లాటరల్ ఎంట్రీ నియామకాలు, యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ వంటి విషయాలలో ప్రతిపక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంది. ఈ మార్పులు మోదీ యొక్క రాజకీయ వైఖరిలో సంకీర్ణ పాలన యొక్క ప్రభావాన్ని స్పష్టం చేస్తాయి.
అదనంగా, గతంలో విపక్ష నాయకులపై ఈడీ, సీబీఐ వంటి సంస్థలను ఉపయోగించి దాడులు చేసిన మోదీ ప్రభుత్వం, 2024-25లో ఈ దాడులను గణనీయంగా తగ్గించింది. 2014-22 మధ్య 2,974 ఈడీ, సీబీఐ దాడులు జరిగాయి, కానీ 2024-25లో ఇవి కేవలం పదుల సంఖ్యలోనే ఉన్నాయని గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ మార్పు మోదీ యొక్క రాజకీయ దూకుడు తగ్గినట్లు చూపిస్తుంది. మోదీ పాలన గత దశాబ్దంలో అనేక విజయాలను సాధించినప్పటికీ, 2024 ఎన్నికల ఫలితాలు, ఆర్థిక సవాళ్లు, శాంతి భద్రతల సమస్య లు, మరియు విదేశీ వ్యవహారాలలో వైఫల్యాలు ఆయన ప్రతిష్టపై ప్రభావం చూపాయి. ప్రజల అంచనాలను అందుకోవడం లో విఫలమవడం, సంకీర్ణ పాలన యొక్క ఒత్తిడి, అలాగే అంతర్జాతీయ రంగంలో బలహీనతలు మోదీ యొక్క రాజకీయ చరిష్మాను తీవ్రం గా దెబ్బతీశాయి. రాజకీయ విశ్లేషకులు ఈ పరిణామాలను "మోదీ డౌన్‌ఫాల్" యొక్క సూచనగా చూస్తున్నారు. అయితే, మోదీ యొక్క రాజకీయ జ్ఞానం మరియు అనుకూలత ఈ సవాళ్లను అధిగమించగలదా అనేది భవిష్యత్తులోనే తేలనుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# సూర్యాపేటలో భారీ బంగారం దోపిడీ

- సాయి సంతోషి జ్యువెలర్స్‌లో బంగారం చోరీ
- గోడకు రంధ్రం చేసి ఆభరణాలు అపహరణ
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ నరసింహ




సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో భారీ బంగారం దోపిడీ జరిగింది.సాయి సంతోషి జ్యూవెల్లర్స్ షాపులోకి ఆదివారం రాత్రి దొంగలు చొరబడి సుమారు 17 కోట్ల రూపాయల విలువ 18 కేజీల బంగారం దోచుకెళ్లినట్లు అంచనా వేస్తున్నారు. రాత్రి సమయంలో షాపు వెనుక భాగంలో ఉన్న గోడకు రంధ్రం చేసి, షట్లర్ ను గ్యాస్ కట్టర్ సహాయంతో మనిషి పట్టేంత కట్ చేసి లోపల ఉన్న ఇనుప తిజోరీ సైతం గ్యాస్ కట్టర్ తో తెరిచి వెండి జోలికి వెళ్ళకుండా కేవలం బంగారం మాత్రమే చోరీ చేశారు. సోమవారం ఉదయం షాపు తెరిచిన యజమాని తెడ్ల కిషోర్ దొంగతనం జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.ఘటనా స్థలానికి



చేరుకున్న పోలీసులు, క్లూస్ టీమ్ ఆధారాలు సేకరిస్తున్నారు. జిల్లా ఎస్పీ నరసింహ, డీఎస్పీ ప్రసన్న కుమార్, పోలీస్ అధికారులు బంగారం షాపును పరిశీలించారు. దోపిడీ ఘటన అంతరాష్ట్ర ముఠా పనా లేక ఇంటి దొంగలేవరైనా ఉన్నారా అనే కోణంలో విచారణ చేస్తున్నారు. బంగారం దోపిడీ విషయం పట్టణంలో సంచలనంగా మారింది.జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఉన్న షాపులో బంగారం భారీ ఎత్తున చోరీకి గురికావడం చర్చనీయాంశంగా మారింది.

**గోల్డ్ షాప్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ**

సూర్యాపేట జిల్లా కేంద్రంలో సాయి సంతోషి జువెలర్స్ నందు జరిగిన దొంగతనం ప్రదేశాన్ని జిల్లా ఎస్పీ నరసింహ డిఎస్పి ప్రసన్న కుమార్, పోలీస్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. దొంగతనం జరిగిన తీరును, చుట్టుపక్కల ప్రదేశాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

కేసును చేదించడానికి 5 పోలీస్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, దొంగతనానికి పాల్పడ్డ వారిని త్వరితగతిన గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆ మార్గంలో ఉన్న సీసీ టివి కెమెరాలు పరిశీలించాలని, ఆధారాలను సేకరించాలని సంబంధిత పోలీసు అధికారులకు సూచించారు. పోలీస్ టీమ్స్ క్లూస్‌ను సేకరిస్తున్నారని అన్నారు. ప్రజలు, వ్యాపారులు కమ్యూనిటీ రక్షణలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.ఎస్పీ వెంట సీసీఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, పోలీసు టెక్నికల్ టీమ్స్, క్లూస్ టీమ్ సిబ్బంది ఉన్నారు.

# ముగ్గురి ప్రతీకారమే అనిల్ మర్డర్

కుట్రలో ఏడుగురు నిందితులు.. ఐదుగురు అరెస్ట్

**వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ**

మెదక్ జిల్లా బ్యూరో, జూలై 21 ( జనం సాక్షి ): మెదక్ జిల్లాలో సంచలనం రేపిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మర్రెల్లి అనిల్ కుమార్ హత్య మిస్టరీ వీడింది. సుఫారి హత్య ఆరోపణలు వచ్చాయి. కానీ గత కొంతకాలంగా అనిల్ కు స్థానికంగా జరుగుతున్న భూ, ఆర్థిక అంశాలే హత్యకు ప్రధాన కారణంగా పోలీసులు తేల్చారు. హత్యకు సూత్రధారులైన ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు, మరో ఇద్దరిని త్వరలోనే పట్టుకుంటామని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస్ రావు వెల్లడించారు. మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ మహేందర్‌తో కలిసి సోమవారం మీడియా సమావేశం ఎస్పీ నిర్వహించారు. అనిల్ హత్యకు సంబంధించిన వివరాలు ఆయన వెల్లడించారు. కొల్చారం మండలం పైతరకు చెందిన మర్రెల్లి అనిల్ కుమార్ ఈ నెల 14 సాయంత్రం కారులో ఇంటికి వెళుండగా మార్గమధ్యలో వరిగుంతం సబ్ స్టేషన్ వద్ద రెండు కార్లలో వచ్చిన దుండగులు గన్‌తో కాల్చి హత్య చేసి వెళ్ళారు. మృతుడు అధికార పార్టీకి చెందిన జిల్లా దళిత ఎస్సీ సెల్ కార్యదర్శి కావడం ఎవరు హత్య చేశారన్న కోణంలో పలు రకాలుగా హత్యపై ప్రచారం జరగగా పోలీసులు సైతం అదే కోణంలో దర్యాప్తు చేసినా ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఏడు ప్రత్యేక బృందాలతో విచారణ చేసి అనిల్‌కు ఉన్న గొడవపై ఆరా తీశారు. పైతరకు చెందిన రవీందర్ రెడ్డి, రంగంపేటకు చెందిన పాడేపు నాగరాజు అతని సోదరుడు




పాడేపు నాగభూషణంకు అనిల్‌తో శత్రుత్వం ఉన్నట్లు గుర్తించారు. అనిల్, నాగరాజు ఒకప్పుడు స్నేహితులుగా కాగా కాలక్రమేణా వీరిద్దరి మధ్య వివాదాలు నెలకొన్నాయి. నాగరాజు రాబోయే ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేస్తానంటే గెలిపించనని అనిల్ చెప్పడం, రవీందర్ రెడ్డికి చెందిన ఫ్లాట్‌ను నాగరాజు అమ్మకుండా అడ్డుకోవడం, తన తల్లి పేరిట మంజూరైన ఇంటిని అనిల్ రద్దు చేయించిన కోపంతో పాటు తన సోదరుడు నాగభూషణం వద్ద తీసుకున్న రూ 6 లక్షల రుణం చెల్లించకపోగా నాగభూషణంకు ఉన్న ఆరోగ్య సమస్యలు బహిరంగంగా వెల్లడిస్తానని బ్లాక్ మెయిల్ చేశాడన్న ఆరోపణలు ఉన్నట్లు తెలిపారు. అనిల్ కుమార్‌తో ముగ్గురికి శత్రుత్వం ఉండడంతో హత్య చేయడమే సమస్యకు పరిష్కారంగా భావించారు. సూరారంలో విజయవాడకు చెందిన షాబుద్దీన్ గ్యారేజీలో మర్డర్ స్కెచ్ వేశారు. అనిల్ వద్ద గన్ ఉంటుందని, కత్తితో పొడిస్తే తమ పైనే ఎటాక్ చేస్తాడని ఊహించి ఫరీద్‌కి బీహార్‌లో పరిచయం ఉన్న సచిన్ కుమార్ వద్దకు జూన్ 27న హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో పాట్నా వెళ్లి రూ 1.50 లక్షలకు గన్, పది బుల్లెట్స్ కొనుగోలు చేశాడు. అక్కడ నాలుగు బుల్లెట్స్ కాల్చి తుపాకీ కాల్చడం నేర్చుకొని రైల్ ద్వారా తిరిగి వచ్చాడు. ఈ నెల 13న మర్డర్ ప్లాన్ కోసం డీసీఎంలో నాగరాజు, షాబుద్దీన్, చిన్నలు రెక్కీ నిర్వహించారు. 14 న ఫరీద్ హైదరాబాద్‌కు అనిల్ వస్తున్నట్లు సమాచారం ఇచ్చాడు. హైదరాబాద్ నుంచి వస్తున్న అనిల్ ను వెంబడించి వరిగుంతం సబ్‌స్టేషన్ వద్ద నాగభూషణం మారుతి కారును అడ్డు పెట్టాడు. స్విఫ్ట్ కారులో షాబుద్దీన్, ఫరీద్, చిన్నలు వచ్చారు. షాబొద్దీన్ తన వద్ద ఉన్న గన్‌తో 4రౌండ్లు కాల్పులు జరిపినట్లు చెప్పారు. అనిల్ పారిపోయే ప్రయత్నం చేసి విఫలం అయ్యాడు. కారు ఎక్స్‌లెటర్ నొక్కినప్పుడు నియంత్రణ కోల్పోయి వెనక ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ గేట్‌ను ఢీకొట్టినట్లు తెలిపారు. అనిల్ హత్యలో రవీందర్ రెడ్డి, నాగరాజు, నాగభూషణం, షాబుద్దీన్, ఫరీద్, చిన్న అశోక్‌ల ప్రమేయం ఉండగా షాబుద్దీన్, చిన్నలు మినహా మిగతా ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద గన్, మొబైల్ ఫోన్‌లు, కారు షిఫ్ట్, డీసీఎం, టియాగో, మారుతి కారు విడిభాగాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ రాజశేఖర్ రెడీ, జాన్ రెడ్డి, వెంకట రాజా గౌడ్, ప్రవీణ్ రెడ్డి, శంకర్, శ్రీనివాస్ గౌడ్, సుభాష్ గౌడ్, రంజిత్ రెడ్డి, బాల్ రాజ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# వోక్సెన్ బిజినెస్ యూనివర్శిటీలో విద్యార్థి ఆత్మహత్య

## క్యాంపస్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని..

**ఆత్మహత్యకు ముందు విద్యార్థి సెల్ఫీ వీడియో**

**వోక్సెన్ యూనివర్సిటీలో గతంలోనూ బలవన్మరణాలు**

సంగారెడ్డి ప్రతినిధి, జులై 21( జనం సాక్షి) వోక్సెన్ బిజినెస్ యూనివర్శిటీలో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని కంకల్ శివారులో గల వోక్సెన్ బిజినెస్ యూనివర్శిటీలో ఆర్క్ టెక్చర్ సెకండ్ ఇయర్ చదువుతున్న రుషికేష్(19) ఆదివారం రాత్రి క్యాంపస్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. హైదరాబాద్‌లోని సరూర్ నగర్ కు చెందిన రుషికేష్ వోక్సెన్ యూనివర్సిటీలో చదువుకుంటూ గత మూడు రోజుల క్రితం ఫ్రెండ్స్‌తో కలిసి విహార యాత్రకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆత్మహత్యకు ముందు విద్యార్థి సెల్ఫీ వీడియో తీసుకున్నట్లు సమాచారం. సెల్ఫీ వీడియోతో విద్యార్థి అమ్మా ఐ లవ్ యూ.. అక్క ఐ లవ్ యూ అని సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. విద్యార్థి కి సంబంధించిన మొబైల్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

**వోక్సెన్ యూనివర్సిటీలో ఏం జరుగుతోంది? :** కంకోల్ లోని



వోక్సెన్ యూనివర్సిటీలో గతంలో కూడా కొంతమంది ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. గత సంవత్సరం ఇదే నెలలో వోక్సెన్ యూనివర్సిటీలో కూలీ పనికి వెళ్లిన వ్యక్తి కూడా కనిపించకుండా పోయాడు రెండు మూడు రోజుల తర్వాత సదాశివపేట మండలంలోని గంగకత్వ చెరువులో శవమై కనిపించాడు. రెండు మూడు నెలల కింద కూడ అందులో పనిచేస్తున్న ప్రొఫెసర్ సైతం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలా వరుసగా జరుగుతున్న సంఘటనలకు విద్యార్థులను భయాందోళనకు గురవుతున్నారు. యూనివర్సిటీ యజమాన్యం పట్టించుకోకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా యూనివర్సిటీ యజమాన్యం విద్యార్థులను ఓ కంట కనిపెట్టాలని కోరుతున్నారు.

# మచ్చలేని మహానేత వీఎస్ అచ్చుతానందన్

కేరళలో అందరితోనూ గౌరవించబడ్డ వ్యక్తి

**సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు**

**ఎంబీ భవన్‌లో అచ్చుతానందన్‌కు నివాళి**

హైదరాబాద్ (జనంసాక్షి) : దేశ రాజకీయాల్లో మచ్చలేని మహానేత వీఎస్. అచ్చుతానందన్ అని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరోసభ్యులు బీవీ.రాఘవులు చెప్పారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన ఆదర్శాలను పాటిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని చెప్పారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో అచ్యుతానందన్ చిత్రపటానికి బీవీ.రాఘవులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సీపీఐ(ఎం) ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన వారిలో ఆయనొకరని గుర్తుచేశారు. ఆ 32 మందిలో చివరన మరణించిన వారు వీఎస్‌నే అన్నారు. జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా సైద్ధాంతిక, ప్రజా పోరాటాల్లో రాజీపడని వ్యక్తి వీఎస్ అని చెప్పారు. దేశ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో తనదంటూ ఒక ముద్ర వేసిన నేత అనీ, సైద్ధాంతిక అంశాలపై రివిజనిస్టుల ధోరణిని ప్రశ్నించి పోరాడిన వారిలో ఒకరని అన్నారు. తన 17 ఏండ్ల ప్రాయంలోనే ప్రజాపోరాటాల్లో పాలుపంచుకున్నారని గుర్తుచేశారు. కేరళలో భూస్వామ్య వ్యతిరేక వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన ఉన్నప్ర వాయిలార్ పోరాటంలో పాలుపంచుకున్న విషయాన్ని గుర్తుచేశారు. కేరళలో పేద ప్రజలకు భూములను పంచారనీ, పదిసెంట్ల ఇంటి స్థలాలను ఇచ్చారని గుర్తుచేశారు. కేరళలో కమ్యూనిస్టులతో పాటు అని పార్టీల, సామాజిక తరగతుల వారితోనూ గౌరవింపబడ్డ, మన్ననలు అందుకున్న మహెూన్నత వ్యక్తి



అని కొనియాడారు. కేరళలో కమ్యూనిస్టు విముక్తి ఉద్యమాన్ని ఆనాడు ఇందిరాగాంధీ తీసుకొస్తే...సమైక్య కేరళ నిర్మాణంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. ఎమర్జెన్సీ కాలంలో తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్న నేతల్లో వీఎస్ ఒకరన్నారు. కేరళలో ఎన్ని ఒడిదుకులు ఎదురైనా కమ్యూనిస్టు ఉద్యమాన్ని తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర మరువలేనిదని కొనియాడారు. పలువురు ముఖ్యనేతలతో ఆయన వేసిన బీజాలే అక్కడ పార్టీ బలంగా ఉండటానికి కారణమని చెప్పారు. ఇక్కడ సుందరయ్య లాగానే కేరళలో మన్ననలు అందుకున్నముగ్గురు, నలుగురు నేతల్లో వీఎస్ ఒకరన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్, పి.ప్రభాకర్, బండారు రవికుమార్, మాజీ ఎంపీ మిడియం బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బాబూరావు, స్కైలాబ్‌బాబు, ఆశయ్య, ఉడుత రవీందర్, సీనియర్ నాయకులు రాజారావు, అరిబండి ప్రసాదరావు, వంగూరు రాములు తదితరులు పాల్గొన్నారు.

# సొంతోల్లే దాడికి యత్నించిండ్రు..


**కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ వ్యాఖ్యలు**



హైదరాబాద్ (జనంసాక్షి) : తనపై సొంత పార్టీకి చెందిన వారే దాడికి యత్నించారని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బోనాల పండుగలో భాగంగా ఆదివారం సాయంత్రం ఉస్మానియా యూనివర్సిటీ మాణికేశ్వర్‌నగర్‌లో ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆయన ప్రయాణిస్తున్న వాహనంపై దాదాపు 20 మంది దాడి చేసేందుకు యత్నించారు. అద్దాలు దించాలంటూ కారును వెంబడించారు. అయితే అప్రమత్తమైన ఆయన గన్‌మెన్‌లు కారును నేరుగా ఓయూ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ ఘటనపై తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన పార్టీకి చెందిన వారే దాడికి యత్నించారని చెప్పారు. ఉద్దేశ పూర్వకంగానే చేశారని అనుమానం వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో తమ పార్టీకి చెందిన ఓ నేత (గొల్లకిట్టు) నన్ను టార్గెట్ చేశారని వెల్లడించారు. ఆయన వ్యవహారశైలిపై గత శుక్రవారం డీసీపీకి ఫిర్యాదు చేశానన్నారు. ఆ వెంటనే తన సన్నిహితులను భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. ఆదివారం తనపై దాడికి ప్రయత్నం చేసిన వారంతా బయట నియోజకవర్గానికి చెందిన వారేనని చెప్పారు. అందులో ముగ్గురిని గుర్తించామని, పోలీసులకు సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు. అయితే.. ఇది పార్టీ పెద్దలకు చెప్పాల్సినంత పెద్ద విషయమేం కాదన్నారు. ఈ ఘటనపై ఓయూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సమిష్టి నిర్ణయంతో వ్యక్తిగత బాధ్యతలను నిర్వర్తించండి : కూనంనేని

**పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు : బాధ్యతలు స్వీకరించిన దండి, జమ్ముల**



ఖమ్మం (జనం సాక్షి) : భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా సమితి సమిష్టి నిర్ణయాలు, వ్యక్తిగత బాధ్యతలు నిర్వర్తిస్తూ బలోపేతం కావాలని కూనంనేని సాంబశివరావు సూచించారు. నూతన నాయకత్వం సమర్ధవంతంగా పనిచేయాలని నూతన ప్రాంతాలకు పార్టీ విస్తరించే -దిశగా కార్యక్రమాలను తీసుకోవాలని ఆయన కోరారు. సిపిఐ 23వ జిల్లా మహాసభలో జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన దండి సురేష్, సహాయ కార్యదర్శిగా ఎన్నికైన జమ్ముల జితేందర్రెడ్డి సోమవారం ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్ లో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొని ఇద్దరిని శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో సిపిఐ కార్యకర్తలు హాజరై నూతన నాయకత్వాన్ని -అభినందించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు పార్టీకి ఒక చారిత్రిక నేపథ్యం ఉందని అనేక పోరాటాలతో వినతికెక్కిందన్నారు. పాలక వర్గాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బహుముఖ పోరాటాలకు క్యాడర్ను సిద్ధం చేయాలన్నారు. పార్టీ శత వసంతాల ముగింపు సభ ఖమ్మంలో జరగనుందని అందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. డిసెంబర్ 26న ఐదు లక్షల మందితో బహిరంగ సభ జరగనుందని ఇందుకు సంబంధించి త్వరలోనే ఆహ్వాన సంఘాన్ని -ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర సమితి సభ్యులు -యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పొలంలో నాటేస్తుండగా పిడుగుపాటుకు మహిళ మృతి



పినపాక, జూలై 21(జనంసాక్షి) : పిడుగు పాటుకు ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన సోమవారం పినపాక మండలం బోటిగూడెం గ్రామ పంచాయతీ బోటిగూడెంలో చోటుచేసుకుంది. స్థానికులు కుటుంబీకుల కథనం బోటిగూడెం గ్రామానికి చెందిన కొమరం రమణ(50) వరి నారు నాటడానికి కూలీ పనికి వచ్చింది. సోమవారం మధ్యాహ్నం వర్షంతోపాటు పిడుగులు పడ్డాయి. ఈ క్రమంలో ఓ పిడుగు కొమరం రమణ సమీపంలో పడింది. దీంతో స్పృహ తప్పడంతో సహ కూలీలు ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందింది.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో .. కాషాయ జెండా రెపరెపలాడించాలి

- కాంగ్రెస్, బిఆర్ఎస్‌లను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలి
- బిజెపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు



కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 21 (జనంసాక్షి) : త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులంతా సన్నద్ధం కావాలని, నాయకులు, కార్యకర్తలకు బిజెపి గెలుపే లక్ష్యం కావాలని, ఎన్నికల్లో కాషాయ జెండా రెపరెపలాడించాలని బిజెపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు అన్నారు. బిజెపి జిల్లా శాఖ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి అధ్యక్షతన సోమవారం కరీంనగర్లోని శుభమంగళ గార్డెన్లో స్థానిక సంస్థల ఎన్నికల కార్యక్రమం జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి శక్తి చెప్పడానికి సమయం ఆసన్నమైందన్నారు. నేడు భారతీయ జనతా పార్టీ గ్రామ, మండలాల్లో బలమైన శక్తిగా అవతరించిందన్నారు. గ్రామాల్లో మండలాల్లో జరిగే అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగు తున్నాయనే విషయం ప్రజలందరికీ అర్థమైంద న్నారు. ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం పనిచేస్తున్న మోడీ ప్రభుత్వం పట్ల ప్రజలంతా విశ్వాసంతో ఉన్నారని , అందుకే జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపిని అక్కున చేర్చుకునే పరిస్థితిలో ఉన్నాయన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్, బిఆర్ఎస్ లను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో, అడ్డగోలు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలు వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైంద న్నారు. ప్రధానంగా కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అన్ గ్యారెంటీలయ్యాయని, కాంగ్రెస్ ముచ్చట్లన్ని ఉద్దెర ముచ్చట్లేనన్నారు. చేసిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించకుండా సర్పంచులను గోస పెట్టిన చరిత్ర బిఆర్ఎస్‌కు ఉంటే , నేడు ఆ సర్పంచుల గోడు పట్టించుకోని పరిస్థితుల్లో కాంగ్రెస్ ఉందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్రామాలు, మండలాల అభివృద్ధి కోసం ఉద్ధరించింది, చేసిందిఏమీ లేదని ఆయన ఘాటుగా విమర్శించారు. కేంద్రం గ్రామాలు మండలాలు అభివృద్ధి చేస్తున్న అభివృద్ధి పనులను, ప్రజా సంక్షేమం కోసం కేంద్ర అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు, స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా కన్వీనర్ బాస సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. జరగబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కోసం పార్టీ శ్రేణులంతా సమాయత్తం కావాలని, ఆ మేరకు రాష్ట్ర పార్టీ తగిన సూచనలు చేసిందని తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో మండలాల్లో, జిల్లాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలను ఆయన సందర్భంగా వివరించారు. జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల ఆంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ళపు రమేష్, బంగారు రాజేంద్ర ప్రసాద్, మేకల ప్రభాకర్ యాదవ్, ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, వాసాల రమేష్, కన్నెబోయిన ఓదెలు , జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకట రెడ్డి, బత్తుల లక్ష్మీనారాణ, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, ఎర్రబెల్లి సంపత్ రావు, కన్న కృష్ణ, రంగు భాస్కర్ చారి, కళ్లెం వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చర్లపల్లిలో చకచకా అక్రమ కట్టడాలు

## అనుమతి లేకున్నా మూడంతస్తుల నిర్మాణాలు

- జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- చక్రం తిప్పుతున్న చైన్‌మెన్.. ఆఫీసర్లకు జేబులు ఫుల్?

కాప్రా, జూలై 21 (జనంసాక్షి) : సాధారణంగా పేదోళ్లు గూడు కట్టుకుంటే అందరికన్నా పడుతుంది. అధికారుల మొదలు స్థానిక నాయకులదాకా అనుమతులున్నాయా..? ఎక్కడి నుంచి కడుతున్నారంటూ ఆరా తీస్తుంటారు. కానీ కాప్రా సర్కిల్ పరిధిలో మాత్రం సర్కారు ఖజానాకు గండికొడుతున్నా అధికారులు మిన్నకుండిపోతున్నారు. యథేచ్ఛగా అక్రమ కట్టడాలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం ఏం చేస్తోందంటూ ప్రశ్నలు వినిపిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ అనుమతుల్లేకుండానే కొన్ని నిర్మాణాలు చేపడుతుండటం గమనార్హం.

కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధిలోని బిఎన్‌రెడ్డి నగర్‌లో ఎలాంటి ఇంటి అనుమతులు తీసుకోకుండా మూడంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ఇక్కడ కొంత ప్రాంతం యూఎల్‌సీ (అర్బన్ ల్యాండ్ సీలింగ్) ఉన్నందున సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇంటి నిర్మాణ అనుమతులు ఇవ్వడం లేదు. అయినప్పటికీ కొంతమంది ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. సదరు ప్రాంతంలో సర్కారు స్థల పరిధిని గుర్తించేవరకూ అనుమతులు ఇవ్వరాదని మున్సిపల్ అధికారులకు గతంలోనే కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఐనప్పటికీ, అక్రమ కట్టడాలకు


బీఎన్‌రెడ్డి నగర్‌లో ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్న నిర్మాణం

అడ్డూఅదుపూ లేకుండా పోతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమను అడిగే నాథుడే లేడని భావిస్తున్నారో ఏమోగానీ.. అనుమతులేవని ప్రశ్నించినవారిని బెదిరింపులకు గురిచేస్తున్నారు. అంతటితో ఆగకుండా వేర్వేరు వ్యక్తులతో ఫోన్లు చేయిస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తున్నారు.

**అంతా వారి కనుసన్నల్లోనే..?**

సామాన్య మధ్య తరగతి ప్రజలు ఇంటి నిర్మాణాలు చేపడితే ఏ చిన్న లోపం జరిగినా కాప్రా టౌన్‌ప్లానింగ్ అధికారులు తక్షణ చర్యలకు దిగడం పరిపాటే..! బిఎన్‌రెడ్డినగర్‌లో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా సాగుతోంది. జీహెచ్‌ఎంసీ నుంచి ఇంటి అనుమతుల్లేకుండానే మూడంతస్తులు ఎలా వెలుస్తున్నాయంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణదారుల నుండి అధికారులకు లక్షల రూపాయలు ముడుపులు ముట్టాయని, స్థానిక నాయకులు సైతం వత్తాసు పలుకుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ కట్టడాలకు అధికారులే సలహాదారులుగా ఉంటున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్, గ్రేటర్ కమిషనర్ కాప్రా సర్కిల్‌లో జరుగుతున్న అక్రమ కట్టడాలపై దృష్టిసారించి, ప్రభుత్వ ఖజానాకు గండిపడకుండా చూడాలని, అవినీతి కట్టడాలను ప్రోత్సహిస్తున్న అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పాతకక్షలతో యువకుడి దారుణ హత్య

**ఆసిఫ్‌నగర్‌లో కలకలం**

హైదరాబాద్ (జనంసాక్షి) : ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి దారుణ ఘటన చోటు చేసుకున్నది. పాతకక్షల నేపథ్యంలో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్‌నగర్‌లోని మొహమ్మద్ ఖబులా అలియాస్ అడ్డుఖాన్ (27) అనే యువకుడు సోఫాలు తయారు చేస్తుంటాడు. అతనికి గత కొద్దిరోజులుగా సమీర్, వసీం అనే వ్యక్తులతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గత రాత్రి కిషన్‌రావు నగర్‌లోని రాహత్ హెూటల్‌కు సమీపంలోని అడ్డుఖాన్ తన స్నేహితుడితో కలిసి మద్యం తాగుతున్నాడు. అదే సమయంలో సమీర్, వసీం మరికొందరు యువకులతో వచ్చి అతనిపై దాడి చేశారు. పెద్ద బండరాయితో తలపై కొట్టి చంపి అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి అన్నికోణాల్లో విచారిస్తున్నట్లు ఆసిఫ్‌నగర్ ఏసీపీ కిషన్ కుమార్ తెలిపారు. హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నట్లు వివరించారు.

# నివాసాలలో భూ నిర్వాసితుల నిరసనలు




**మక్తల్, జూలై 21 (జనంసాక్షి) :** నారాయణపేట కోడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులు సోమవా రం ప్రాజెక్టు పరిధిలోని వివిధ గ్రామాలలో నివాస ప్రాంతాలలోని ఇంటి దగ్గరనే కుటుంబ సభ్యులతో కలిసి ప్లే కార్డ్స్ పట్టుకొని నిరసనలు తెలియజేశారు. తమ గోడును ప్రభుత్వానికి నివేదిం చారు. బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా తమకు న్యాయ మైన పరిహారం అందించాలని మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి న్యాయం చేయాలని కోరారు. దంతనపల్లి, కాట్రేపల్లి, కాచ్వార్, ఉట్కూర్, బాపూర్ జాజాపూర్, సింగారం, పేరపల్ల, కాన్ కుర్తి, పీడెంపల్లి తదితర గ్రామాలలో తమ తమ ఇంటి దగ్గరనే ప్లే కార్డులు పట్టుకొని భూనిర్వాసితులు నిరసనలు తెలియజేశారు. బలవంతపు భూసేకరణను ఆపాలని రైతులను బెదిరింపులకు గురి చెయ్యొద్దని, మోసపూరితపు మాటలతో అతి తక్కువ పరిహారం చేతులో పెట్టి తరతరాలుగా అనుభవిస్తున్న తన భూమిని లాక్కో వద్దని వేడుకున్నారు. నివాస ప్రాంతాలలో నిరసనలు తెలియజేసి నివేదనలు ప్రభుత్వానికి అందజేసిన ముఖ్యమంత్రి పట్టించుకో కపోతే ప్రాజెక్టు పరిధిలోని అన్నీ గ్రామా పంచాయతీ కార్యాలయాల ముందు ధర్నాలు చేస్తా మని పంచాయతీ కార్యదర్శి లకు వినతి పత్రాలు అందజేస్తామని భూనిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు జి వెంకట్రాంరెడ్డి, జిల్లా అధ్య క్షులు మచ్చేందర్, ఉపా ధ్యక్షులు ధర్మరాజు తెలిపారు. రైతుల ఆందోళన ఉద్యమం రోజురో జుకు తీవ్రమవుతున్న సంగతి ప్రభుత్వం గ్రహించాలని కోరారు. ఉద్యమం తీవ్రతరం కాకముందే రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని కోరారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో మున్సిపల్ పార్కు దగ్గర జరిగే రిలే దీక్షలు ఈనెల 25వ తేదీ వరకు కొన సాగు తాయని ఆ తర్వాత 26న మండల కార్యాలయల ముట్టడి 28న జిల్లా కలెక్టరేట్ ముట్టడిస్తామని తెలిపారు.

# అసైన్డ్ భూములు ప్రభుత్వం లాక్కోవడం మానుకోవాలి

- పేదల సాగు భూములు కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కుట్ర
- సిపిఐ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దశరథ్




**సంగారెడ్డి, జూలై 21 (జనంసాక్షి):** పేదలు బడుగు బలహీనవర్గాల భూములను కాంగ్రెస్ ప్రభుత్వం లాక్కోవడం మానుకోవాలని సిపిఐ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దశరథ్ డిమాండ్ చేశారు. సోమవారం సదాశివపేటలోని సిపిఐ కార్యాలయంలో దశరథ్ మాట్లాడుతూ .. సదాశివపేటలో పేదలు సాగు చేసుకుంటున్న భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూములను సేకరించడం సమంజసం కాదన్నారు. కొండాపూర్ మండలంలోని తోగర్పల్లి, మహ్మదాపూర్ ,మునిదేవుని పల్లి, గ్రామాలలోని సర్వే నెంబర్418, 44 ఎకరాలు ,సర్వే నెంబర్ 22, 311 ఎకరాలు, సర్వే నెంబర్ 92 , 293ఎకరాలు, సదాశివపేట మండలంలొని ఆరూర్‌లో అసైన్డ్ భూములను గత 50 సంవత్సరాలు గా ఆ గ్రామంలోని ఎస్సీ ఎస్టీ పేద ప్రజలు సాగు చేసుకుంటున్నారని అన్నారు. పేద రైతులకు ఆ భూములపై యాజమాన్య హక్కులు కూడా ఉన్నాయని స్వయానా ప్రభుత్వాలే పాస్ బుక్కు లను కూడా ఇష్యూ చేశారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ప్రజా పాలనా గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని ఓర్చుకోలేక తొగర్పల్లి , మందాపూర్, మునిదేవుని పల్లి గ్రామాల్లోని సుమారు 200 మంది రైతుల నుంచి 648 ఎకరాల భూమిని ప్రభుత్వం పెట్టుబడిదారులకు చౌకగా అప్పనంగా అమ్మి కట్ట బెడుతోందని మండిపడ్డారు . ఇతర అవసరాల నిమిత్తం గ్రామాల్లో ప్రభుత్వ భూములను లేకుండా చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలను గ్రామాల్లోని రైతులు ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు .తొగర్ పల్లిలో గత 15 సంవత్సరాల క్రితమే ఈ భూమిని ఇళ్ల స్థలాల పేర తీసుకొని ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఇంటి జాగా ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే. విష్ణువర్ధన్ రెడ్డి ,బికెఎంయు జిల్లా కార్యదర్శి తాజొద్దిన్, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షఫి అహ్మద్, లింగం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భోజనం విషయంలో నిర్లక్ష్యం చేయొద్దు

- ఫుడ్ పాయిజన్ ఎలా జరిగిందో వివరాలు సేకరించండి
- ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



**నాగలిగిద్ద జూలై 21 (జనంసాక్షి):** విద్యార్థుల భోజనం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సంబంధిత అధి కారులకు సూచించారు. నాగల్ గిద్ద మండల పరిధిలోని మొర్గి గ్రామంలోని మాడల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిన సందర్భంగా నారాయణఖేడ్ పట్టణం లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగింది. విషయం తెలుసు కున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి హుటాహుటిన ఆసుపత్రికి బయలుదేరి విద్యార్థులను పరా మర్శించి ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలను విద్యార్థులకు అడిగి తెలుసుకు న్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల భోజన విషయంలో నిర్వాహకులు సంబంధిత ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని తెలిపారు. ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలు తెలుసుకోవాలన్నారు. ఆసు పత్రిలోని చికిత్స పొందుతున్న విద్యార్థులకు ధైర్యం చెప్పి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్ రిండెంట్, నాగలిగిద్ద మండల ఎంఈఓ మన్మథ కిషోర్‌మాజీ ఎంపీటీసీలు గుండె రావు పాటిల్, శంకర్ ముదిరాజ్, పాఠశాల ఉపాధ్యాయ ఉన్నారు.

# చేర్యాల పట్టణంలో వలస కూలీ ఆత్మహత్యయత్నం



**చేర్యాల జూలై 21 (జనంసాక్షి):**చేర్యాల మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో పెద్దమ్మగడ్డ ప్రాంత ంలో శేఖర్ అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా కొండ్రాపల్లి గ్రామానికి చెందిన శేఖర్ కూలిపనుల చేసుకుంటూ చేర్యాలలో జీవనం కొనసాగిస్తున్నాడు. తను ఉంటున్న అద్దె ఇంటిలో కూరగాయలు కోసే కత్తిపీటతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# ముఖ్యమంత్రిని కలిసిన కొమ్మూర్ యువకులు



**గుండుమాల్ జూలై 21 (జనంసాక్షి) :** గుండుమల్ మండలం కొమ్మూరు గ్రామానికి చెందిన యువకులు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రిని కలిసి చెప్పారు. మరియు కొమ్మూర్ గ్రామానికి కావలసిన పనులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అందులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, కొమ్మూర్ గ్రామం నుండి మల్లపురం (కోయిలకొండ మండలం) బిటి రోడ్డు వాగులో బ్రిడ్జి, హై స్కూల్ బిల్డింగ్, ఎల్లమ్మ, పోచమ్మ గుడికి సీసీ రోడ్డు, కొమ్మూర్ గ్రామానికి కొత్త పోస్ట్ఆఫీస్, కావాలని ముఖ్యమంత్రిని కోరగా సానుకూలంగా స్పందిస్తూ ఈ పనులను త్వరగా పరిశిలించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఖాదర్ పాషా,బాల్ రాజ్ గౌడ్, రాజు గౌడ్, బంటు వెంకట్రాములు, రమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకునూరు గ్రామంలో విషాదం తల్లి, కొడుకు మృతి




**చేర్యాల జులై 21 (జనంసాక్షి) :** ఆకునూరు గ్రామంలో అంగన్వాడీ ఆయాగా ఎన్నో సంవత్సరాలు పనిచేసిన అత్యంత పేదరికంలో జీవితం గడుపుతూ మూడు రోజుల క్రితం భూమని సుజాత చనిపోయారు. కుటుంబానికి ఆసరాగా ఉన్న సుజాత చని పోవడంతో శోకసంద్రంలో మునిగిన వారి కుటుం బానికి అండగా ఉండాల్సిన కుమారుడు రమేష్ ఇటీవల పురుగుల మందు త్రాగి హైదరాబా ద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమ వారం మృతి చెందారు. రెండు రోజుల వ్యవధిలోనే తల్లి, కొడుకు మృతి చెందడంతో ఒక్కసా రిగా గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మానసికంగా, ఆర్థికంగా తిరిగి కోలు కోలేని ఆ కుటుంబానికి ప్రభుత్వం, దాతలు సాహాయం అందించి చేయూతగా నిలబడాలని మృతుని స్నేహితులు కోరుతున్నారు.

# గద్వాలలో ఒకేసారి మూడు చోట్ల దొంగతనాలు



**గద్వాల నడిగడ్డ,జులై 21 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వేణు కాలనీలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మూడు చోట్ల ఒకేసారి దొంగతనం చేయడంతో కాలనీవా సుల తోపాటు గద్వాలలో ప్రజలు ఆందోళనకు గురి అవుతున్నట్టు తెలు స్తుంది. గద్వాలలో ఇలాంటి దొంగతనం చేయడం కొత్త కాదు గాని ఈసారి ఒకటే కాలనీలో వేరు వేరు చోట్ల మూడు దొంగతనములు జరగడం వల్ల ప్రజలు ఆందోళనకు గురి అవుతు న్నట్లు తెలుస్తుంది. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇండ్ల తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న బంగారు, వెండి, నగదుతో పాటు ఇతర సామాగ్రిని కూడా దొంగతనం చేసినట్లు తెలుస్తుం ది. ఇటీవల పోలీసులు బందోబస్తులు ఇతరత్రా పనులపై వెళ్ళుచున్నారని నెపంతో దొంగలు మళ్లీ గద్వాల పట్టణంలో విజృంభిస్తున్నట్లు ప్రజలనుకుంటున్నారు. ఇది ప్రజల జాగ్రత్తనా ,పోలీసుల వైఫల్యం అర్థం కావడం లేదని అక్కడక్కడ ప్రజలు గుసగుసలాడు తున్నారు. ఒకే సారి జరిగిన మూడు దొంగతనాలు జరిగిన ఇండ్లకు వెళ్లి స్థానిక పట్టణ ఎస్సై కళ్యాణ్ కుమార్ పరిశీలించారు.

# జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

- విద్యార్థులు రాజకీయాలను అధ్యయనం చేయాలి
- ఎస్ఎఫ్ఐ పూర్వ అఖిల భారత అధ్యక్షులు ఆర్.అరుణ్ కుమార్



**హైదరాబాద్ జూలై 21 (జనంసాక్షి):** దేశంలో జాతీయ విద్యావిధానం -2020కు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించి, పోరాడాలని, బిజెపి ఈ విద్యావిధానం పేరుతో దేశంలో విద్య కార్పోరేటీకరణ, కాషాయికరణ, వ్యాపారీకరణ కోసం పూనుకుందని పేద విద్యార్థులకు విద్యను మరింత దూరం చేసే కుట్రలో భాగంగానే జాతీయ విద్యావిధానం - 2020ను తీసుకుని వచ్చిందని ఎస్ఎఫ్ఐ పూర్వ అఖిల భారత అధ్యక్షలు ఆర్.అరుణ్ కుమార్ అన్నారు. స్థానిక ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు ఎం.మమత అధ్యక్షతన జరిగిన "డైలాగ్ విత్ అరణ్‌కుమార్" కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో జాతీయ విద్యావిధానం పేరుతో ప్రజాస్వామిక హక్కులపై బిజెపి దాడి చేస్తుంది. ఆర్ఎస్ఎస్ ఎజెండాను విద్యలో అమలుచేసే చర్యలు పాల్పడుతుంది. విద్యా రుణాలు ఇచ్చి మరి విదేశాలకు విద్యార్థులను వెళ్ళేలా ప్రొత్సహిస్తూ దేశ విద్యారంగాన్ని కార్పోరేట్, విదేశీ శక్తుల చేతులోకి పెడుతుందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఉద్యమించా అన్నారు. విద్యార్థులు నిరంతరం వారి చదువులతో పాటు రాజకీయాల ను కూడా అధ్యయనం చేయాలని అప్పుడే వ్యవస్థలో ఉన్న అసమానత లుకై పోరాడే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. విద్యారంగంలో వస్తున్న సమస్యలు పరిష్కారించే దిశగా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకొని పోరాటాలకి రావాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు ఈ సందర్భంగా అరుణ్ కుమార్ గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్, బి.శంకర్, అశోక్, రాష్ట్ర కమిటీ సభ్యులు కార్తీక్, లెనిన్, జె.రమేష్, అవినాష్ పాల్గొన్నారు.

# ఘనంగా ఇందిరా మహిళా శక్తి సంబరాలు

- రేషన్ కార్డుల పంపిణీ
- రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



**అచ్చంపేట జూలై 21(జనంసాక్షి):** పట్టణంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు మరియు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎక్సైజ్ పర్యటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మరియు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు..సందర్భంగా మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం హాయంలో మహిళలను అన్ని రంగాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం వారిని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది.. నియోజకవర్గంలో 3629 మంది సభ్యులకు స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు పంపించేశారు. మహిళా సంఘం సభ్యులకు ప్రమాద బీమా 10 లక్షల రూపాయలను కూడా సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు.ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ కార్యక్రమాలను మహిళా సంఘాల సభ్యులతోనే అమలు చేయడం జరుగుతుంది . ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు మహిళా సంఘాల అధ్యక్షులు, మహిళా సభ్యులు, మహిళలు సభ్యులు నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గద్వాల జిల్లాకు క్రీడలో ప్రత్యేక స్థానం

- జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి జితేందర్



**గద్వాల నడిగడ్డ,జులై 21 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లాలో క్రీడాకారులకు కోదువ లేదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో నె జిల్లాకు ప్రతేక స్థానం ఉందని జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి పి. జితేందర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ని ఇండోర్ స్టేడియంలో దివంగత రిటైర్డ్ ఫీజికల్ డైరెక్టర్ సీ.ఉస్మాన్ 5వ వర్ధంతి ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలోడి వైఎస్ఓ మాట్లాడారు. ఉస్మాన్ క్రీడాకారుడిగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక రికార్డులు సాధించిన ఘనత ఉందని ఇప్పటికి గుర్తుండి పోయాయని నేటి క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. అనంతరం రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు శంకర ప్రభాకర్, వీవసంతరాయుడు, అబ్రహం, విజయబాబు, ప్రకాష్‌లు ఉస్మాన్ చేసిన సేవలు క్రీడాకారుడిగా సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు.వ్యాయమ విద్య కు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని పాఠ్యముగా అమలు చేయాలనీ పాఠశాలలో ఖాళీగా వున్న వ్యాయామఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలనీ డిమాండ్ చేశారు. మొదలు ఉస్మాన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.అలాగే ఉస్మాన్ జ్ఞాపకార్థం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం విజేతలకు మెడల్స్ కుటుంబ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉస్మాన్ భార్య భ్రమరాంభ, కుమారుడు డాక్టర్ ఒమాన్, వ్యాయామఉపాధ్యాయులు హైమావతి, కృష్ణయ్య, బీసన్న,రజినీకాంత్, సతీషకుమార్,నగేష్ బాబు,స్రవంతి,ప్రభాకర్, ఆయ క్రీడాసం ఘాల ప్రతినిధులు నరసింహ, నరసింహ,తిరుపతి, క్రీడాకారులు, పాల్గొన్నారు.

# యువత సమాజసేవలో ముందుండాలి

- ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి



**కొల్చారం, జులై 21 (జనంసాక్షి):** యువత వక్రమార్గాన్ని వీడి, సమాజ సేవలో ముందుండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండల బిఆర్ఎస్ యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు జన్మదిన వేడుకలు కొల్చారం మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంపల్లి గౌరీశంకర్ గుప్త ఆధ్వర్యంలో ఏడుపాయలలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం రాత్రి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, సంతోష్ రావు మిత్రబృందం మధ్య అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి సంతోష్ రావుచే కేక్ కట్ చేయించి తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంతోష్ రావు సమాజసేవలో ముందున్నాడని... మున్ముందు సేవా కార్యక్రమాలను మరింతగా పెంచి ప్రజాసేవ చేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం కొల్చారం మండలంలోని 21 గ్రామపంచాయతీలకు చెందిన 21 టీం యువకులకు వాలీబాల్, నెట్లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాలతో మండలంలోని యువత సేవా కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటామన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ భాస్కర్ రెడ్డి, వేమారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగే రమేష్ కుమార్, సిడిసి మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, ముఖ్య నాయకులు సంతోష్ కుమార్, వరిగుంతం సొసైటీ చైర్మన్ చిన్నారం ప్రభాకర్, చిన్నగంపూర్ సొసైటీ వైస్ చైర్మన్ రాజా గౌడ్, మాజీ చైర్మన్ రంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్ అహ్మద్, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, డీసీఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి, కరెంట్ రాజా గౌడ్, సాయిబాబా గౌడ్, మోత్కు మల్లేశం, మాజీ సర్పంచ్ కన్నారం రమేష్, దొడ్ల ఆంజనేయులు, తలారి దుర్గేష్, వెంకట్రాంరెడ్డి, సోమ నరసింహులు, బాగా రెడ్డి, సురేష్ గౌడ్, మాజీ ఎంపిటిసి ఆదం ఎల్లయ్య, మాజీ సర్పంచులు చలం యాదగిరి, సంతోషా ఎల్లేశం, అర్కెల నాగయ్య, లంబాడి శ్రీను, పాండ్ర శీను, శ్రీకాంత్ యువకులు పాల్గొన్నారు.

# బాల్యస్నేహితున్ని పరామర్శించిన మాజీ మంత్రి



**వనపర్తి, జూలై21 (జనంసాక్షి) :** మండల కేంద్రమైన పాన్ గల్ కు ఛెందిన తన బాల్య మిత్రుడు కొత్త ఆనంద రెడ్డి సతీమణి కొత్త చంద్రకళ ఆదివారం రాత్రి మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సోమవారం మృతురాలి కుటుంబాన్ని సందర్శించి ఆమె పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. వారి,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# కార్యకర్తలను విస్మరిస్తే గద్వాల నుండి గాంధీభవన్‌కి పాదయాత్ర

**గద్వాల నడిగడ్డ,జులై 21 (జనంసాక్షి) :** గల్లి నుండి ఢిల్లీ దాకా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఎస్సీ ఎస్టీ, బీసి మైనార్టీ ప్రజల మెజార్టీతో తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిందని అలాంటి ప్రభుత్వంలో గద్వాల ప్రాంతంలోని బడుగు బలహీన వర్గాల ఎదుగుదలను అణచివేతకు కాంగ్రెస్ పార్టీ గురి చేస్తుందని మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ ఆరోపించారు. సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు విస్తృత స్థాయి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గద్వాల మున్సిపల్ మాజీ చైర్మన్ బిఎస్ కేశవ్, టిపిసిసి మెంబర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంజిపేట్ శంకర్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ముందు గద్వాలలో బలహీన పరిస్థితిలో ఉన్న కాంగ్రెస్ పార్టీని బలోపేతం కోసం అధిష్టాన పిలుపు మేరకు ఇంచార్జి సరిత నేతృత్వంలో గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేశారని అన్నారు.సరిత తిరుపతయ్య నాయకత్వంలో పార్టీ బలోపేతా నిలి కృషి చేయడం జరిగిందని,2023 అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో సరిత ఓటమి పాలయ్యారని గుర్తు చేశారు.కాని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని గంపెడు ఆశలతో ఉన్న పార్టీ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసే విధంగా బీఆర్ఎస్ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఇక్కడ ఉన్నటువంటి బడుగు బలహీన వర్గాల కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పూర్తిగా విస్మరిచ్చిందన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పాటు అనంతరం పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు గాని సంక్షేమ ఫలాలు గాని ఏమాత్రం పొందడం లేదని అయినప్పటికీ ఎక్కడ నిరుత్సాహ పడకుండా ఇంచార్జీ సరిత నాయకత్వంలో ఇప్పటికి పార్టీ కోసం శ్రమిస్తూ పార్టీ పిలుపు మేరకు పని చేస్తున్నారని అన్నారు. గల్లి నుండి ఢిల్లీ దాక బడుగు బలహీనవర్గాల ప్రజలు రాజకీయంగా ఎదగాలని సంకల్పంతో 42 శాతం రిజర్వేషన్ బీసీల కల్పిస్తూ ఏఐసిసి అగ్రనేత పార్లమెంటు ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో ముందుకు సాగుతున్న తరుణంలో అందుకు భిన్నంగా గద్వాల బీసీ నాయకత్వంపై అధిష్టానం వ్యవహరించడం ఏమిటో కాంగ్రెస్ పార్టీలో సరిత పాత్ర ఎంటో ఆమె నాయకత్వం అవమసమో లేదో అధిష్టానం స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ గద్వాలలో ప్రతిష్ఠాత్మకంగా ఉండాలంటే స్థానిక సంస్థల ఎన్నికలలో సరిత వర్గీయులకే ఇందిరమ్మ కమీటీ, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో పార్టీ కార్యకర్తలకు అవకాశం కల్పించాలని, కాంగ్రెస్ పార్టీలో సరితకు సముచిత స్థానం కల్పించాలని వేదికపై నుంచి కాంగ్రెస్ పార్టీ పెద్దలను కోరారు. 2023 అసెంబ్లీలో ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి సరిత అధ్వర్యంలో ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేశారు. నియోజకవర్గంలోని కొన్ని శక్తులు ఆమె ఓటమికి కుట్రలు చేసిన నైతికంగా ఆమె ప్రజల మనన్నలు పొందిన నేతగా ఎదిగినా బహుజన బిడ్డగా చోటు దక్కించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ పార్టీ కోసం ఓటు వేసిన కార్యకర్తలను విస్మరించి దొడ్డిదారిన వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే లను ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి సంక్షేమ పథకాలు వారికి అందేలా ప్రోత్సహించడం ఎంత వరకు సమంజషం అని నిలదీశారు.కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వారిని కాదని ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి అరు గ్యారెంటీలు ఎలా ఇస్తానారో పార్టీ పెద్దలు సమాలోచించలన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే తాను ఏ పార్టీలో ఉన్నాడో తనకే తెల్వదని, అలాంటప్పుడు పార్టీ కండువ కప్పుకోకుండా కాంగ్రెస్ పార్టీ సమావేశాలో ఏ విధంగా పాల్పడుతున్నారో అదిష్టానం తెలుసుకోవాలన్నారు. గద్వాలలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమైన సమయంలో పార్టీని బలహీనపరచడానికి ప్రత్యర్థులు కుట్రలు పనుతున్నారని ఆరోపించారు.మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన వారి కాకుండా దొడ్డిదారిన వచ్చిన నాయకులకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో భీఫామ్‌లు అందజేస్తే గద్వాల నుంచి గాంధీభవన్ కు పాదయాత్ర చేస్తామని హెచ్చిరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మాజీ కౌన్సిలర్లు మధుసూదన్ బాబు,బల్గేర నారాయణ రెడ్డి,మహ్మద్ ఇసాక్, మాచర్ల వరలక్ష్మి వెంకటస్వామి గౌడ్, గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, పెద్దపల్లి అల్వాల రాజశేఖర్ రెడ్డి,డిటిడిసి నర్సింహులు, భాస్కర్ యాదవ్,యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్,జనరల్ సెక్రటరీ యెస్,లత్తిపురం వెంకట్రామిరెడ్డి,పులిపాటి వెంకటేష్,డి.ఆర్,శ్రీధర్,కోటేష్, వాకిటిసంజీవులు,యూసూఫ్,ఎస్.కృష్ణ, మహేష్,పార్వతీ,అడ్వకేట్ షాఫీవుల్లా, సురేష్, నాగరాజు,పాతపాలెం ఆనంద్ గౌడ్, మహానంది రెడ్డి, పటేల్ శ్రీనివాసులు, సీసాల వెంకట్ రెడ్డి, జనార్థన్ రెడ్డి,మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.





# ఖర్గేకు పుట్టినరోజు శుభాకాంక్షలు

- ఎంపీ వంశీకృష్ణ, మంత్రి వివేక్

చెన్నూర్, జూలై, 21 జనం సాక్షి): ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఢిల్లీలోని ఆయన నివాసంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు వంశీకృష్ణ, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకుంటూ ఆయురారోగ్యాలతో, దీర్ఘాయుష్షుతో ఉన్నత పదవుల్లో కొనసాగాలని కోరారు. అనంతరం నాయకత్వ వ విలువలలో నిలకడగా దశాబ్దాల రాజకీయ అనుభవంతో దేశ రాజకీయాల్లో తనదైన శైలిలో ముద్ర వేశారని పొగిడారు. కాకా వెంకటస్వామితో కర్గేకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ కర్గే ఆశీస్సులు పొందారు.

# నాడు ఆదర్శంగా గురుకులాలు

- నేడు అస్వస్థతకు నిర్లక్ష్యానికి నిదర్శనం
- అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు పరామర్శ



**మంచిర్యాల ప్రతినిధి, జూలై 21 (జనంసాక్షి) :** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గురుకుల పాఠశాలలు ఆదర్శంగా నిలిచాయని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో గురుకుల పాఠశాలలు అస్వస్థతకు నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచాయని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సాయికుంటలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పురుగుల అన్నం తినడంతో అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు పరామర్శించారు. అనంతరం దివాకర్ రావు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం గిరిజన ఆశ్రమ పాఠశాలలో పురుగుల అన్నం తినడంతో అస్వస్థత గురైన 8వ తరగతి చదువుతున్న తరుణి అనే విద్యార్థిని, ఆరో తరగతి చదువుతున్న అలకనంద రేవతిలు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. నాలుగు రోజులుగా విద్యార్థినులు అవస్థకు గురైన కూడా తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవడంతో పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో ఆగమైపోతున్నది అని అన్నారు. కేసీఆర్ హయాంలో గిరిజన,గురుకుల పాఠశాలలు అంటే ఒక బ్రాండ్,గిరిజన, గురుకుల పాఠశాలలో సీట్ల కోసం మంత్రులు, ఎమ్మెల్యేలతో పిల్లల తల్లిదండ్రులు సిఫారసులు చేయించినా అప్పట్లో సీటు దొరకని పరిస్థితి. కానీ,ఇప్పుడా పరిస్థితి లేదు. కాంగ్రెస్ సర్కారు రాకతో గురుకుల,గిరిజన పాఠశాలల తలరాత తలకిందులైంది అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

### విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉంది : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహంలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినిలు అస్వస్థతకు గురికావడంతో వారిని ఆసుపత్రిలో చేర్పించి వైద్య సేవలు అందిస్తున్నామని, వారి ఆరోగ్యం నిలకడగా ఉందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహంలో విద్యనభ్యసిస్తున్న బి. తరుణి (8వ తరగతి) జ్వరంతో, బి. రేవతి (6వ తరగతి) టాన్సిలైటిస్ తో కూడిన జ్వరంతో బాధపడుతుండగా మాతా శిశు ఆసుపత్రిలో చేర్పించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థినిలు ఇద్దరి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, మీడియా ప్రతినిధులు సందర్శించినప్పుడు వైద్యులు ఈ విషయాన్ని నిర్ధారించారని, చికిత్స కొనసాగు తుందని, ఎటిడిఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి వెంట ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై కొంత మంది కలుషిత ఆహారం తినడం వల్ల ఇలా జరిగిందని అవాస్తవాలు ప్రచారం చేసి గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇలాంటి అవాస్తవ, అనాలోచిత చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

### అస్వస్థతకు గురై నాలుగు రోజులు గడిచినా సమాచారం ఇవ్వలేదన్న తల్లిదండ్రులు

నాలుగు రోజుల క్రితం ఆశ్రమ పాఠశాలలో గొంతునొప్పి జ్వరం రావడంతో అస్వస్థత గురైన 8వ తరగతి చదువుతున్న తరుణి అనే విద్యార్థిని, ఆరో తరగతి చదువుతున్న అలకనంద, రేవతి విద్యార్థినుల తల్లిదండ్రులు మాట్లాడుతూ...విద్యార్థులు అప్పుడప్పుడు అన్నంలో పురుగులు వస్తున్నాయని, మెన్ పాటించడం లేదని తమ పిల్లలు చెప్పారని పేర్కొన్నారు. నాలుగు రోజుల నుండి తమ పిల్లలు అస్వస్థతకు గురైనప్పటికీ తమకు సమాచారం ఇవ్వలేదని గురుకుల పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



# జిల్లాగ్రంథాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రులు

- పదవీ బాధ్యతలు చేపట్టిన జిల్లా గ్రంథాలయ చైర్మన్‌కు ఘన సన్మానం

**మహదేవపూర్ జూలై 21 (జనం సాక్షి) :** రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు గృహ నిర్మాణలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై నూతన గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. సోమవారం నూతన గ్రంథాలయ చైర్మన్ గా కోట రాజబాబు పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి కలిసి సన్మానించారు. అనంతరం మహదేవపూర్ సింగల్ విండో చైర్మన్, చల్ల తిరుపత రెడ్డి, కాటారం మండల పార్టీ అధ్యక్షులు వేమునూరు ప్రభాకర్ రెడ్డి మాజీ సింగల్ విండో చైర్మన్ వామన్ రావు సీనియర్ నాయకులు కటకం అశోక్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అస్రార్ ఖురేష్. స్వాగతం పలికి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భూపాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మతీన్ ఖాన్. నాయకులు ఉస్మాన్ బుర్రి శివరాజు. చల్ల సమ్మిరెడ్డి. రమణ తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో జర్నలిస్టుల ధర్నా రాస్తారోకో





- దుర్భాషలాడిన ఎమ్మెల్యే తీరును ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన
- క్షమాపణ చెప్పాలని జర్నలిస్టుల డిమాండ్..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం స్థానిక కాకతీయ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. విలేకరులనుద్దేశించి దుర్భాషలాడిన ఎమ్మెల్యే తీరును ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. వెంటనే ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ముందు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విలేకరుల పట్ల అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కాకతీయ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం జర్నలిస్టులందరు ఏకమై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని తగు నిర్ణయాలను ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాలో జరిగిన మంత్రుల పర్యటన కార్యక్రమాలను ముకుమ్మడిగా బహిష్కరించారు. ఎమ్మెల్యే అసభ్యకర వ్యాఖ్యలను ఖండిస్తూ స్థానిక కాకతీయ ప్రెస్ క్లబ్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి, ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ విలేకరులను ఉద్దేశించి అసభ్యకరంగా మాట్లాడిన స్థానిక ఎమ్మెల్యే సత్యనారాయణ రావు ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు, ధర్నా సందర్భంగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో స్థానిక సిఐ నరేష్ కుమార్, ఎస్సై సాంబమూర్తిలు చేరుకొని విలేకరు లకు నచ్చజెప్పి ధర్నాను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు మంతెన సమ్మయ్య, క్యాతం సతీష్, సామంతుల శ్యాం, రవి భాస్కర్, ఎడ్ల సంతోష్, సామల శ్రీనివాస్, జల్ది రమేష్, ఎర్రం సతీష్, తడక సుధాకర్, చెరుకు సుధాకర్, బెల్లం తిరుపతి, గట్టు రవీందర్, దొమ్మాటి రవీందర్, శేఖర్ నాని, తిక్క ప్రవీణ్, సర్వేశ్వరరావు తో పాటు సుమారు 80 మంది జర్నలిస్టులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జర్నలిస్టుల నిరసనకు ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొత్తూరు రవీందర్, నాయకులు మహర్షి, చిరంజీవి, నాగరాజు, అరవింద్ తోపాటు వివిధ సంఘాలు మద్దతు తెలిపాయి.

### జర్నలిస్టులపై ఎమ్మెల్యే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం: టీయూడబ్ల్యూజే హెచ్ 143

**కాళేశ్వరం, జూలై 21,( జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల టి యు డబ్ల్యూ జే హెచ్ 143 జిల్లా సంఘం తీవ్రంగా ఖండించింది.ఈ సందర్భంగా జిల్లా నాయకుడు వెంకటేష్ మాట్లాడుతూ జర్నలిస్టులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వెనక్కి తీసుకొని, జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# స్థానిక ఎన్నికల్లో టిఆర్ఎస్ విజయం ఖాయం

- మళ్లీ కాంగ్రెస్ పార్టీ రాదని మంత్రులు ఎమ్మెల్యేలు అక్రమాలకు తెర లేపారు
- కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



**పర్వతగిరి, జూలై 21 (జనం సాక్షి) :** స్థానిక ఎన్నికల్లో టిఆర్ఎస్ విజయం ఖాయమని, మళ్లీ కాంగ్రెస్ పార్టీ రాదని మంత్రులు ఎమ్మెల్యేలు అక్రమాలకు తెర లేపారని కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పర్వతగిరి మండలం బిఆర్‌యస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం కల్లెడ గ్రామం పిఏసియస్‌లో మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల మాజీ సర్పంచులు ఎంపీటీసీలు టిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి పాలకుర్తి, వర్ధన్నపేట నియోజకవర్గం ఇంచార్జ్ ఎర్రబెల్లి దయకర్ రావు హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సిద్దంగా ఉండాలని..కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బోగస్ హమీలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత కార్యకర్తలకు ఉండాలని అన్నారు.సియం రేవంత్ మొదటి నుండి మోసకారిరేనని పచ్చి అద్దాలకోరని చాల దగ్గర నుండి చూసానని రేవంత్ రెడ్డి పై తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. మంత్రులు ఏమ్మెల్యేలు మల్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదని తెలిసి ఇప్పటినుండే అక్రమాలకు తెరలేపారని అన్నారు. మూడు సార్లు గెలిచినోడు ముఖ్య మంత్రి అయ్యాడని, ఏడుసార్లు గెలిచినోన్ని ఇంట్లో ఉన్నానని చమత్కరించారు.. ఇక రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ ఓడిపోవడానికి ముఖ్య కారణం సోషల్ మీడియా మరియు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన దొంగ 420 హామీలు అని అన్నారు. గ్రామ గ్రామాల్లో విస్తృతంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన దొంగ హామీలు మహిళలకు 2500 రూపాయలు,తులం బంగారం, ఉచిత కరెంటు,దళితులకు ఇస్తానన్న 12 లక్షలు రూపాయలు గురించి ప్రచారం చేయాలని అన్నారు.ఇక వర్షాలు పడక పంటలు ఎండుతున్న తరుణంలో ఎస్సారెస్పీ కాలువల ద్వారా వారం రోజుల్లో నీళ్లు ఇవ్వకపోతే రేవంత్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేస్తామని అన్నారు.. నీళ్ల గురించి ఏమాత్రం అవగాహన లేని కేఆర్ నాగరాజు నీళ్ల గురించి మాట్లాడుతుంటే విచిత్రం ఉందని తెలంగాణ రాకముందే తెలంగాణ రాష్ట్రనికి గోదావరి జలాలు అందాలని బాబ్రీ ప్రాజెక్టు వద్ద ధర్నా చేసి దెబ్బలు తిని జైలుకు వెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. ఇకనైనా కాంగ్రెస్ నాయకులు మాట్లాడేటప్పుడు ఎవరేంటో తెలుసుకొని జాగ్రత్తగా మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ మనోజ్ గౌడ్, బిఆర్ఎస్ మండల పార్టీ ఎలక్షన్ ఇన్చార్జ్ మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, మాజీ జెడ్పిటిసి మేడిశెట్టి రాములు, బోయినపల్లి యుగేందర్ రావు,లూనావత్ పంతులు, కల్లెడ మాజీ సర్పంచ్ చిన్నపాక శ్రీనివాస్, మాదుగుల రాజు, మహిళా నాయకురాలు శశిరేఖ, బరిగల విజయ, మండలం లోని అన్ని గ్రామాల నుండి మాజీ సర్పంచులు మాజీ ఎంపీ టీసీలు వార్డు నెంబర్లు బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రపంచ జ్ఞాని అంబేద్కర్

### అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



పాలకుర్తి, జూలై 21(జనంసాక్షి) డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ ప్రపంచ జ్ఞాని అని, సమాజంలో నేటి యువతరానికి అంబేద్కర్ ఆదర్శప్రాయుడని స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గూడూరులో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన రాజ్యాంగాన్ని రూపొందించే స్థాయికి ఎదిగిన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా బావిస్తున్నట్లు తెలిపారు. ఆటు రాజ్యాంగ నిర్మాతగా మాత్రమే కాకుండా సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప మేధావి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత కోసన వెంకట సోమనర్సింహ రెడ్డి, మార్కెట్ చైర్పర్సన్ లావుడియా మంజుల, బెల్లి దేవెందర్, రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, మాచెర్ల పుల్లయ్య, గుగ్గిళ్ళ ఆదినారాయణ, చిక్కుడు రాములు, మురళీధర్రెడ్డి, అనుములు మహేందర్, లొంక ఐలయ్య, మొల్గూరి యాకయ్య, దుబ్బ ఎల్లయ్య, బెల్లి రాజు, మాచర్ల రజిత, చెరిపెల్లి నాగమణి, తదితరులు ఉన్నారు,

### కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి..

పెద్దవంగర జులై 21(జనం సాక్షి ) అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్ కార్డు అందే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, తెలిపారు సోమవారం మండలంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న కొత్త రేషన్ కార్డుల పంపిణీ. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాల్గొని, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్దిదారులకు ఆహార భద్రత పథకం కింద కొత్త రేషన్ కార్డులు అందజేశారు. తరువాత ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ ,బానోత్ నెహ్రు నాయక్,నెమరుగోముల ప్రవీణ్ రావు, సంకపల్లి రవీందర్ రెడ్డి, పొడిశెట్టి సైదులు, బానోత్ గోపాల్ నాయక్, మహేష్, శ్రీనివాస్, మోహన్ రావు, ఉపేందర్,రవి, బానోత్ శేఖర్, అధికారులు ప్రజా ప్రతినిధులు మహిళలు తదితరులు పాల్గొన్నారు



# భారీ వర్షం... రైతన్నల హర్షం!

### పంటలకు జీవం పోసిన వాన..
### పొంగిన వాగులు, వంకలు...
### వరి నాట్లకు శ్రీకారం చుట్టిన రైతులు....

చెన్నారావుపేట, జూలై 21 (జనం సాక్షి): భారీ వర్షంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మే, జూన్ నెలల్లో కురిసిన వర్షాలతో ఆశపడ్డ రైతన్నలు పత్తి, మొక్కజొన్న, పసుపు, వేరుశనగ ఇతర పంటలను వేశారు. అంతేకాక వరి పంటలు వేయడానికి నారుమడులను, మిర్చి నార్లను కూడా పోశారు. కాని మొదట్లో ఊరించిన వర్షాలు ముఖం చాటేయడంతో వర్షాల రాక కోసం రైతన్నలు వేయికళ్లతో ఎదురుచూశారు. దీంతో వేల రూపాయల పెట్టుబడులు పెట్టి వేసిన తమ పంటలను కాపాడుకోవడానికి గ్రామాలలోని రైతన్నలు వ్యవసాయ బావులు, బోరు బావుల్లోని నీటిని అందిస్తూ కాపాడుకున్నారు. సోమవారం ఒక్కసారిగా ఎడతెరిపిలేని భారీ వర్షం కురిసింది. పాకాల, వట్టె వాగు, మున్నేరు వాగులు పొంగి ప్రవహించాయి. గ్రామాలలోని చెరువులు, కుంటల్లోకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేశారు. అంతేకాక రైతులు ట్రాక్టర్ల ద్వారా తమ పొలాలను సిద్ధం చేసి వరి నాట్లకు శ్రీకారం చుట్టారు. మహిళా కూలీలతో వరి నాట్లను వేయించారు. దీంతో గ్రామాల్లోని రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో బిజీ బిజీగా కనిపించారు. సోమవారం కురిసిన భారీ వర్షంతో ఇక పంటలకు డోకా లేకుండా పోయిందని ఇలాంటి వర్షాలు రెండుసార్లు కురిస్తే చెరువులు, కుంటలు మొత్తం నీటితో నిండి అలుగులు పోస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



# రేషన్ కార్డు పంపిణీపై ప్రణాళిక సిద్ధం చేయాలి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి జిల్లాలోని రెండు నియోజక వర్గాలలో రేషన్ కార్డుల పంపిణీపై సమావేశం నిర్వహించి ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, పౌర సరఫరాలు, వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుండి 10వ తేది వరకు రేషన్ కార్డుల పంపిణీకి మండలాల వారిగా షెడ్యూల్ తయారు చేయాలని ఆదేశించారు. మంగళవారం నానో యూరియా గురించి రైతులకు అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎరువులు, విత్తన దుకాణాలాల్లో తప్పని సరిగా స్టాకు బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి బాబు, ఇరిగేషన్ ఈఈలు తిరుపతిరావు, ప్రసాద్, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చదరంగంలో తేజ విద్యార్థుల ప్రతిభ



**కోదాడ, జులై 21 (జనంసాక్షి) :** ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి చదరంగం పోటీలలో తేజ విద్యాలయ విద్యార్థులు మూడు విభాగాలలో ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో . అండర్ 13 బాలికల విభాగంలో యోగితా ప్రథమ స్థానం, అండర్ 11 విభాగంలో అద్వైత ప్రథమ స్థానం, అండర్ 11 బాలుర విభాగంలో పశ్య జతిన్ రెడ్డి ప్రథమ స్థానం, గోపిరెడ్డి విక్రాంత్ రెడ్డి ప్రత్యేక బహుమతి సాధించడం జరిగింది. విజేతలకు నల్గొండ జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రెటరీ కె.కరుణాకర్ రెడ్డి, ఛీఫ్ అడ్వైసర్ యం.విశ్వ ప్రసాద్ బహుమతులు, ట్రోఫీ అందజేశారు. విజేతలను పాఠశాల డైరెక్టర్ రమా సోమిరెడ్డి ,అధ్యాపకులు అభినందించారు.

## అభివృద్ధి ,సంక్షేమం మా ఎజెండా : ఎమ్మెల్యే



**చర్ల జులై 21 (జనంసాక్షి) :** అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ ఎజెండా అని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. చర్లలోని రూ. 1.11కోట్ల నిధులతో చేపట్టనున్న రహదారి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు.ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు పోతున్నామన్నారు. ఎన్నో ఏళ్ల సమస్యల కు పరిష్కారం చూపుతున్నామన్నారు. పేదోడి ఇంటికలను సాకారం చేస్తున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యచరణతో ముందుకు సాగుతున్నామన్నారు. విద్య,, వైద్య సదుపాయంతో పాటు సాగు నీరు ,రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామ న్నారు.. చిన్నమిడిసిలేరులోని రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ పర్చూరు రవికుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాస్, ఎంపీడీవో ఈరయ్య, ఏఈలు వాసు, ఉపేందర్ , నాయకులు చీమలమర్రి మురళి, పోట్రు బ్రహ్మానందరెడ్డి, పోలిన లంక రాజు తదితరులు పాల్గొన్నారు.

## లబ్దిదారులకు కొత్త రేషన్ కార్డులు



**భువనగిరి జులై 21(జనంసాక్షి):** భువనగిరి ఏఆర్ గార్డెన్లో భువనగిరి పట్టణ మరియు మండలానికి చెందిన లబ్దిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేసిన స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం కొలువు తీరినందున, ఇచ్చిన మాట ప్రకారం ప్రజాపాలన కార్యక్రమంలో కొత్త రేషన్ కార్డుల జారీకి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని, అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు జారీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఇప్పటికే రేషన్ కార్డు కలిగి ఉన్న కుటుంబాలలో అదనపు కుటుంబ సభ్యుల పేర్లను చేర్చడం జరిగిందని కొత్త రేషన్ కార్డు మంజూరు అయిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్డు ద్వారా ప్రతి నెల రేషన్ సరుకులు అందుతాయని, కార్డు ఉన్న వారందరికీ సన్న బియ్యం పంపిణీ ఈ ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందనితెలిపారు. జిల్లా గ్రంథాలయ అధ్యక్షులు అవేస్ చిస్తీ, జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రామలింగం, మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జాంగిర్, పోత్నక్ ప్రమోద్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ లత బాబు, కౌన్సిలర్లు,కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

### కామ్రేడ్ అచ్యుతానందన్ మృతి

## ఎర్రజెండాకు తీరని లోటు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



**మిర్యాలగూడ, జులై 21(జనంసాక్షి) :** సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ అకాల మరణం ఎర్రజెండాకు తీరనిలోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక సిపిఎం కార్యాలయంలో అచ్యుతానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దగా చదువు లేకపోయినా కార్మిక నాయకుడిగా అంచలంచెలుగా ఎదిగి కేరళ ముఖ్యమంత్రిగా పని చేశారని ఆయన హయాంలో అనేక సంస్కరణలు చేపట్టారని గుర్తు చేశారు. ఊహ వచ్చిన నాటి నుండి చివరి శ్వాస వరకు ఎర్రజెండా నీడలో పోరాటాలు సాగించారని చెప్పారు. కేరళ ప్రజలతో అచ్యుతానందన్ ఎంతో ఆప్యాయతగా ఉండేవారని నిత్యం పేద ప్రజల పక్షాన పోరాటాలు సాగించారని చెప్పారు.

ఆయన మరణం సిపిఎం పార్టీకి, కేరళ నాయకత్వానికి తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, వన్ టౌన్, టూ టౌన్ కార్యదర్శులు డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, భావండ్ల పాడు, మండల కార్యదర్శులు రవి నాయక్, పాదూరి శశిధర్ రెడ్డి, రొండి శ్రీనివాస్, సీనియర్ నాయకులు సత్యనారాయణ రావు, నాయకులు గుణగంటి రామచంద్రు, కోడిరెక్క మల్లయ్య, పిల్లుట్ల సైదులు, కరిమున్నిసా, అరుణ, పల్లా బిక్షం,నాగేష్, ఆశీర్వాదం, రామారావు తదితరులు పాల్గొన్నారు

# దళిత బంధు లబ్దిదారుల నిధులు కలెక్టర్ల ఖాతాలో ఉన్నాయి

- యూనిట్ల అమ్మకం, కొనుగోలు చెల్లుబాటు కాదు
- 214 మందికి 4 కోట్ల 63 లక్షల చెక్కులు పంపిణీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**చింతకాని, జులై 21(జనంసాక్షి):** చింతకాని మండలంలో దళిత బంధు లబ్దిదారులకు రెండో విడత 214 మంది లబ్దిదారులకు 4 కోట్ల 63 లక్షల 15 వేల 725 నిధులకు సంబంధించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తాను సీఎల్పీ నేతగా ఉన్నప్పుడు చింతకాని మండలాన్ని దళిత బంధు పథకం కింద పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని, దళిత బంధు లబ్దిదారులందరి దళిత బంధు లబ్ధిదారు ల నిధులు కలెక్టర్ల ఖాతాలో ఉన్నాయి, ఎంచుకున్న వృత్తి, వ్యాపారాలు నిర్వహిస్తూ దశలవారీగా పొందాల్సిన నిధులను వినియోగించుకోవాలని చింతకాని మండలంలో మొత్తం 3,465 మంది లబ్ధిదారులు ఉండగా వారందరికీ సంబంధించిన పూర్తి నిధులు జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ చేసినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. 3,465 మంది లబ్ధిదారులు చింతకాని మండలంలో ఉండగా ఇందులో 1,387 యూనిట్ల వారు విక్రయించడం, దారి మళ్ళించడం



చేశారని దళిత బంధు యూనిట్లు ఇతరులు కొనుగోలు చేయడం, లబ్దిదారులు వాటిని అమ్మడం చట్ట ప్రకారం చెల్లుబాటు కాదని తెలిపారు. దళిత బంధు యూనిట్లన్నిటిని జిల్లా అధికారులు విచారిస్తున్నారు. ప్రస్తుతం 214 మంది లబ్ధిదారుల విచారణ పూర్తి చేసి రెండో విడత నిధులు పొందేందుకు అర్హులని గుర్తించి వారికి చెక్కులు పంపిణీ



చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం చెక్కులు పొందిన లబ్ధిదారులు వృత్తి, వ్యాపారాలు చక్కగా నిర్వహించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని తెలిపారు. లబ్ధి పొందిన వారు చక్కగా నిర్వహించి ఆదర్శంగా నిలిస్తే మిగిలిన లబ్ధిదారులు స్ఫూర్తి పొంది అధికారులకు సహకరించి రోజున పొద్దు అవకాశం ఉంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు. దారి తప్పిన యూనిట్ల వివరాలు ఇస్తే అధికారులు వాటిని విచారించి తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు.

## ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెరిగిన హమాలి రేట్లు

**దేవరకొండ, జులై 21 (జనంసాక్షి):** ఏఐటీయూసీ ఆధ్వర్య ంలో దేవరకొండలోని సిమెంటు దిగుమతి హమాలి రేట్లు పెంచుకోవడం జరిగిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ,జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రజా భవన్లో జరిగిన సిమెంట్ షాప్ల యాజమాన్యం , ఏఐటీ యూసీ ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో పరస్పర అంగీకా రము మేరకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలిరేట్లు పెంచుకోవడం జరిగిందని దేవేందర్ రెడ్డి తెలిపారు. రెండు సంవత్సరాలకొకసారి జరిగే అగ్రిమెంట్లో గతంలో ఉన్నటువంటి రేట్లపై 16% ఆధనంగా పెంచుకోవడం జరిగినది అన్నారు. ఎగుమతి దిగుమతి హమాలి రేట్ల తో పాటు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, సంవత్సరానికి రెండు జతల బట్టలు ఇవ్వాలని తీర్మానించారు. కార్మిక హక్కుల కోసం ఏఐటియుసి అండగా నిలబడి నిరంతరము రాజీలేని సమరశీల పోరాటాలను నిర్వహిస్తుందని అన్నారు. హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించి బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి కోరారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం లేకపోవడం వల్ల లక్షలాదీ మంది కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు




ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు, కోశాధికారి జె వెంకట్రాములు,మండల కార్యదర్శి ఏ మల్లయ్య, సిమెంట్ షాప్ యజమానులు మారుపాక సురేష్ గౌడ్, కుంచకూరి ఆనంద్, నీల బాలస్వామి, బూరుగు రవి కుమార్, హమాలి యూనియన్ అధ్యక్షులు నీల వెంకటయ్య ,కార్యదర్శి గోదాసి కృష్ణయ్య , దోమల వెంకటయ్య, యాదయ్య,పాల్గొన్నారు.

## ఇన్ ఫార్మర్ల నెపంతో అనుమానంతో ఇద్దరు గిరిజనుల హతం

- ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఘటన

**చర్ల, జులై 21 (జనంసాక్షి) :** మావోయిస్టులు మరోమారు రెచ్చిపోయారు. పోలీస్ ఇన్ ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారన్న నెపంతో ఇద్దరు గిరిజనులను దారుణంగా హతమార్చారు. ఈ ఘటన చతిస్గడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. చతిస్గడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా తెర్రెం పోలీస్ స్టేషన్ పరిధిలో గల చుట్వాయి, పోలీస్ స్టేషన్ కేంద్రంలోని తెర్రెం గ్రామాలలో మావోయిస్టులు ఈ ఘటనలకు పాల్పడ్డారు. ఆదివారం అర్ధరాత్రి తెర్రెం గ్రామంలోని మంగులు కురసం (55) ఇంటికి వేట కొడవళ్ళు, గుడ్డలతో వచ్చిన సుమారు ఐదుగురు మావోయిస్టులు మంగులును నిద్రలేపి మాట్లాడే పని ఉందని బయటకు తీసుకువెళ్లారు. ఇదే సందర్భంలో చుట్వాయి గ్రామంలోని కవాసి జోగా (55) ఇంటికి వెళ్లిన మరో ఐదారుగురు మావోయిస్టులు జోగాని కూడా నిద్రలేపి మాట్లాడే పని ఉందని బయటకు తీసుకువచ్చారు. వీరిద్దరిని మావోయిస్టులు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో వేట కొడవళ్ళు గొడ్డలితో దారుణంగా నరికి హత మార్చారు. పోలీసు ఇన్ ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నం దువల్లనే వీరిద్దరిని శిక్షించాల్సి వచ్చిందని మావోయిస్టులు మృతదేహాల వద్ద లేఖలను వదిలారు. కాగా వీరి కుటుంబాలకు చెందిన ఒక వ్యక్తి మావోయిస్టు పార్టీలో కొంతకాలంగా పని చేసి లొంగిపోయి వచ్చి కుటుంబంతో కలిసి జీవి స్తున్నాడు. అయితే అతనితో కలిసి వీరిద్దరూ కూడా ఇన్ఫార్మర్లుగా వ్యవహరిస్తు న్నారని అందుకే వీరిని హతమా ర్చినట్లుగా మావోయిస్టు పార్టీ పేర్కొంది కాగా మావోయిస్టు పార్టీలో పనిచేసి లొంగిపోయి వచ్చిన వ్యక్తిని కూడా మావోయి స్టులు హత మార్చేందుకు ప్రయ త్నించినట్లు తెలుస్తుండగా ఆయన ముందుగా నేగ్రామం నుంచి తప్పించుకుని పోయినట్లు తెలిసింది. కాగా ఇటీవల మావో యిస్టులు గడిచిన 25 రోజుల్లో పోలీసు ఇన్ ఫార్మర్లుగా అనుమానిస్తూ పదిమందిని హత మార్చగాలో బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో గల ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు కూడా ఉన్నారు.



## మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్

- ట్రయిల్ రన్ ఈనెల 24 న నిర్వహించాలి : మంత్రి తుమ్మల
- నేషనల్ హైవే ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు మార్పు చేయాలి
- వెలుగుమట్ల అర్బన్ పార్కు లో సాగునీటి పైప్ లైన్ వేయాలి
- ఖమ్మం నగరంలో రహదారుల విస్తరణ చేపట్టాలి.
- ఇళ్ళు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

**ఖమ్మం, జులై 21 (జనంసాక్షి) :** రఘునాధపాలెం మండలంలోని చెరువులన్నింటిని ఈనెల 24వ తేదీ న ట్రయల్ రన్ వేసి చెరువులు నీటితో నింపే లా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పెండింగ్లో ఉన్న పనులన్నీటిని సత్వరమే పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద సబ్ స్టేషన్ నిర్మాణం కోసం యన్.పి.డి.సి.యల్ సిఎండి వరుణ్ రెడ్డితో మాట్లాడి తక్షణమే టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టాలని ఆదేశించారు. ఇరిగేషన్ అడ్వైజర్ శ్రీ పెంటా రెడ్డి గారితో మాట్లాడి ఈనెల 24వ తారీఖున ట్రయిల్ రన్ నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా ఖమ్మం దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే పై కోడుమూరు గ్రామం వద్ద ఉన్న హై టెన్షన్ లైన్ ను తక్షణమే మార్చేలా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్కో డైరెక్టర్ లతా వినోదకు సూచించారు. నేషనల్ హైవే మరియు ట్రాన్స్కో అధికారులు సమన్వయం చేసుకొని పనులు పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా వెలుగుమట్ల అర్బన్ పార్క్లో వన్యప్రాణులకు త్రాగు నీరు నర్సరీ మొక్కలకు నీటిని అందించేందుకు కొదమూరు లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి వెలుగుమట్ల అర్బన్ పార్క్ వరకు పైప్ లైన్లు వేసేలా చర్యలు తీసుకోవాలని. ఆ డిజైన్లను డీఎఫ్ఓతో సమన్వయం చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచనలు చేశారు. ఖమ్మం నగర సుందరీకరణ కోసం రహదారులను విస్తరించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు చుట్టూ రహదారుల విస్తరణను వ్యక్తిగతంగా పరిశీలించి ఎవరినైనా గృహాలు కోల్పోతే వారికి డబల్ బెడ్రూం ఇల్లులు కానీ ఇందిరమ్మ ఇల్లు కానీ కేటాయించాలని మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు అదేవిధంగా మాస్టర్ ప్లాన్ ను సత్వరమే ఆమోదం పొందేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.




## ఈ సీజన్లోను మంచి ఫలితాలు సాధిస్తాం

- వీడియో కాన్ఫరెన్స్కు హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**బోనకల్, జూలై 21 (జనంసాక్షి):** ఈ సీజన్లోనూ ప్రకృతి మన రాష్ట్రంపై కరుణ చూపించింది.. గత సీజన్ మాదిరిగానే పెద్ద ఎత్తున ఆహార ఉత్పత్తులు సాధించి దేశంలోనే తెలంగాణ ఆదర్శ రాష్ట్రంగా నిలుస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కాగానే రైతు భరోసా నిధులు జమ చేశాం, సీజన్ ప్రారంభంలో వర్షాలు కాస్త నెమ్మదించిన ప్రస్తుతం విస్తృతంగా వర్షపాతం నమోదవుతుంది, రైతులు పంటలపరంగా ఇబ్బంది లేదని డిప్యూటీ సీఎం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల యూరియా కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురా వడం మూలంగా క్రమంగా ఆ సమస్య కూడా పరిష్కారం అవుతుందని డిప్యూ టీ సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. కలెక్టర్లు జిల్లాల్లో జాగ్రత్తగా సమన్వయం చేసుకుంటే యూరియా సమస్యను అధిగమించవచ్చని డిప్యూటీ సీఎం తెలిపారు. బ్యాంకులు కూడా సకాలంలో రైతులకు వ్యవసాయ రుణాలు అంది స్తున్నాయి, విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్ సరఫరాకు మండలాల వారిగా నిరంతరం పర్యవేక్షిస్తు న్నట్లు సీఎం తెలిపారు.

10 సంవత్సరాలుగా పంపిణీకి నోచుకోని రేషన్ కార్డులు ప్రస్తుతం పెద్ద సంఖ్యలో రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుండడంతో సర్వత్ర ఆనందం వ్యక్తం చేస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలో 93 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం అందుతున్నా యని తెలిపారు. వర్షాకాలం



సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున కలెక్టర్లు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సందర్శించి, లకు టార్గెట్లు ఫిక్స్ చేస్తే సీజనల్ వ్యాధులను అధిగమిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. నాగార్జునసాగర్ కు వరద నీరు చేరుతుంది, నాగార్జునసాగర్ కు పైన ఉన్న ప్రాజెక్టులన్ని నిండుగా ఉన్నాయని, గోదావరి పరివాహక ప్రాంతంలో ఎప్పు డు కూడా జూలై చివర్లోనే నీటి ప్రవాహాలు కనిపిస్తాయి అని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి యావత్ క్యాబినెట్ ఆకాంక్షల మేరకు అధికారులు దృష్టి పెట్టి పనిచేస్తే మంచి ఫలితాలు సాధిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు.

## కల్తీ మద్యం తయారీ ముఠా అరెస్ట్



**మేళ్లచెరువు జులై 21 (జనంసాక్షి) :** మేళ్లచెరువు మండల పరిధిలోని రామాపురంగ్రామానికి చెందిన తోట శివ శంకర్ అనే వ్యక్తి సూర్యప్రకాష్ ఇంటిలో సుమారు 832 లీటర్ల స్పిరిట్ ను నిల్వ చేశారు. ఖాళి బాటిల్స్లో స్పిరిట్ ను నింపి కాప్స్ బిగించి నకిలీ లేబుళ్లని అతికించి అమ్మే ప్రయత్నం చేస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్ ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సూపరిండెంట్ అంజి రెడ్డి ఆధ్వర్యంలో హుజూర్నగర్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బందితో కలసి సంయుక్తం గా దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 832 లీటర్ల స్పిరిట్తో పాటు 326 లీటర్ల బ్యాటిల్లో నింపబడిన 38 కాటన్ల ఎంసీ విస్కీ బాటిల్స్ నకిలీ లేబుల్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇట్టి కేసులో తోట శివ శంకర్తో పాటు దుర్గికి చెందిన శ్రీరాం మహే ష్, ఇంటి ఓనర్ సూర్య ప్రకాష్ పై కేసు నమోదు చేసినట్లు చేసినట్లు తెలిపారు. శివశంకర్ పరారీలో వుండగా మిగిలిన వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరికి స్పిరిట్ లేబుల్స్ కాప్స్ సప్లై చేసిన హైదరాబాద్కు చెందిన రూతుల శ్రీనివాస్తో పాటు శ్రీ కృష్ణా ఫార్మాకు చెందిన శివ చరణ్ సింగ్ పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

## ఫీజుల చెల్లింపులలో ర్యాంకుల నిబంధనను తొలగించాలి



**మిర్యాలగూడ, జూలై 21 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం బోధనా ఫీజుల చెల్లింపులో ర్యాంకు నిబంధనలను పెట్టడంతో బీసీ విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ర్యాంకులతో సంబంధం లేకుండా ఇంజనీరింగ్ చదివే బీసీ విద్యార్థులందరికీ పూర్తి ఫీజులు చెల్లించాలని ఈరోజు ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్ చదివే బీసీ విద్యార్థులకు పదివేల లోపు ర్యాంకుకి మాత్రమే పూర్తి ఫీజు చెల్లిస్తూ మిగతా వారికి కేవలం 35 వేల రూపాయలు మాత్రమే చెల్లించడం వల్ల బీసీ విద్యార్థులు మిగతా ఫీజులు కట్టలేక అప్పుల పాలవుతున్నారని ఇతర విద్యార్థులకు ర్యాంకులతో సంబంధం లేకుండా ఏ విధంగా చెల్లిస్తున్నారో బీసీలకు కూడా అదే విధంగా చెల్లించి న్యాయం చేయాలని లింగంగౌడ్ విజ్ఞ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ గౌడ్ రంగు సురేష్ వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

## సంస్థాన్ కోటపై కాషాయ జెండా ఎగరాలి

- రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి



**సంస్థాన్ నారాయణపురం జులై 21 (జనంసాక్షి):** స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడుతున్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సంస్థాన్ నారాయణపురం మండల శాఖ అధ్యక్షులు సుర్వి రాజుగౌడ్ ఆధ్వర్యంలో గుజ్జ,వావిల్లపల్లి ఎంపీటీసీలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి,పాల్గొని మాట్లాడుతూ మండలంలోని జడ్పిటిసి,ఎంపీపి గెలవడం కోసం మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాలని, అన్ని గ్రామాల కార్యకర్తలు సన్నద్ధం కావాలని దానికోసం నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ,రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు గుర్తు చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గెలిపించి సంస్థాన్ నారాయణపురం కోట మీద కాషాయ జెండా ఎగురవేయాలని, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు..ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు యాదవ్, తంగెళ్ళ సత్తయ్య, జక్కర్తి బిక్షపతి, ఆత్కూరి రాములు, ఎలిజాల శీను, కుకుడాల మహేందర్ రెడ్డి, జక్కర్తి నరసింహ, చాపల రాములు, చెన్నకేశవులు, నరసింహారెడ్డి, సత్యనారాయణరెడ్డి, గోపాల్, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఎట్టకేలకు లాభాల్లోకి..

## బంగారం ఇంకెంత పెరుగుతుంది?



**జనంసాక్షి:**బంగారం ధరలు రోజురోజుకీ పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే తులం (10 గ్రాములు) పసిడి ధర రూ.లక్ష దాటేసింది. అంతర్జాతీయంగా ఔన్స్ బంగారం ధర 3,350 డాలర్ల వద్ద ఉంది.అయితే రాబోయే రోజుల్లో పుత్తడి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. బులియన్ ధరను నడిపించే అనేక అంశాలు రానున్న రోజుల్లో ఉన్నాయని చెబుతున్నారు.ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ఏం మాట్లాడతారు.. అమెరికా, బ్రిటన్, యూరోజోన్ సహా ప్రధాన ఆర్థిక వ్యవస్థల గ్లోబల్ పీఎంఐ డేటా వంటి అంశాలను ట్రేడర్లు నిశితంగా పరిశీలించనున్నారు. బంగారం రేట్లు ఎలా ఉండబోతున్నాయనేదానికి యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్ల నిర్ణయాన్ని కూడా నిశితంగా పరిశీలిస్తారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. .అమెరికా ప్రకటించినా ప్రతీకార సుంకాల అమలు తేదీ ఆగస్టు 1 డెడ్‌లైన్ సమీపిస్తుండటంతో వాణిజ్య చర్చలపై అనిశ్చితి బంగారం సేఫ్ హెవెన్ డిమాండ?కు ఊతమిచ్చే అవకాశం ఉంది. మరోవైపు ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు దేశీయ పండుగల డిమాండ్ కూడా బంగారం ధరల పెరుగు దలకు మరింత ఊతమిస్తుందని జేఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ ఈబీజీ – కమోడిటీ అండ్ కరెన్సీ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ ప్రణవ్ మెర్ తెలిపారు.

## రాణించిన హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్..

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. విశ్లేషకుల అంచనాలను మించి త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు రాణించడం సూచీలకు కలిసొచ్చింది .దీంతో రెండ్రోజుల వరుస నష్టాల తర్వాత సూచీలు బయటపడ్డాయి. మరోవైపు రికార్డు త్రైమాసిక ఫలితాలను ప్రకటించినప్పటికీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 3 శాతానికి పైగా నష్టపోయాయి.సెన్సెక్స్ ఉదయం 81,918.53 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు



81,757.73) స్వల్ప లాభాల్లో ప్రారంభమై వెంటనే నష్టాల్లోకి జారుకుంది. కాసేపటి తర్వాత మళ్లీ లాభాల్లోకి వచ్చిన సూచీ.. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,274.03 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 442.61 పాయింట్ల లాభంతో 82,200.34 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 122.30 పాయింట్ల లాభంతో 25,090.70 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.30గా ఉంది.సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, బీఈఎల్ షేర్లు రాణించాయి. రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హిందుస్థాన్ యూనిలీవర్, టీసీఎస్, ఐటీసీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 69.04 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3374 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో మరోసారి ప్రైమరీ మార్కెట్లు కళకళలాడనున్నాయి. 4 కంపెనీల పబ్లిక్ ఇష్యూలు ప్రారంభంకానుండగా.. మరోవైపు ఇప్పటికే ఐపీవో పూర్తి చేసుకున్న ఏంథమ్ బయోసైన్స్ స్టాక్ ఎక్ఛేంజీలలో లిస్ట్ కానుంది.గత వారం మెయిన్‌బోర్డ్‌లో ఇష్యూ పూర్తి చేసుకున్న ఏంథమ్ బయోసైన్స్ కౌంటర్‌లో నేడు(21న) ట్రేడింగ్‌కు తెరలేవనుంది. ఇష్యూ ధర రూ. 570కాగా.. 64 రెట్లు అధికంగా స్పందన లభించడం గమనార్హం!**

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.10 | ₹ 5.12 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 91,800 (22 క్యారెట్లు) | ₹ 1,00,150 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 1,26,000

## మెడికల్.. ఇన్సూరెన్స్.. సెక్షన్ 80 మినహాయింపులు



**జనంసాక్షి:**ఈ వారం సెక్షన్ 80లో పొందుపర్చిన అంశాలు... వైద్యానికి సంబంధించిన మినహాయింపులు గురించి తెలుసుకుందాం. ముఖ్య విషయం ఏమిటంటే ఇవన్నీ కూడా కేవలం పాత పద్ధతిని అనుసరించిన వారికే మాత్రమే వర్తిస్తాయి. ఈ సెక్షన్ వ్యక్తులకు మాత్రమే వర్తిస్తుంది. ఒక వ్యక్తి తన కోసం, జీవిత భాగస్వామి కోసం తన మీద ఆధారపడ్డ పిల్లల కోసం చెల్లించే మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియంకి వర్తిస్తుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.25,000 పరిమితిని మించి మినహాయింపు ఇవ్వరు.
తల్లిదండ్రులు 60 సంవత్సరాల లోపు వారయితే అదనంగా రూ.25,000 వారి నిమిత్తం చెల్లించే ప్రీమియంలపై, మొత్తం మీద రూ.50,000 మినహాయింపు ఇస్తారు. కుటుంబంలో ఏ వ్యక్తి చెల్లిస్తాడో... ఆ వ్యక్తి ఇన్‌కంలోంచి మినహాయింపు ఇస్తారు. ఇతరులకు ఇవ్వరు. నగదులో చెల్లించిన ప్రీమియంలకు మినహాయింపు దొరకదు. చెక్కు ద్వారా, డీడీ ద్వారా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి.వ్యక్తి, అతని తల్లిదండ్రులు.. అందరూ 60 సంవత్సరాల్లోపు ఉంటే మొత్తం రూ.50వేలు, వ్యక్తి 60 సంవత్సరాల్లోపు ఉండి, తల్లిదండ్రులు అరవై ఏళ్లు దాటిన వారు అయితే రూ.25,000 కాకుండా అదనంగా రూ.50,000 దాకా మినహాయింపు ఇస్తారు. వ్యక్తి, తల్లిదండ్రులు 60 ఏళ్లు దాటితే రూ.50వేలు ం 50వేలు = మొత్తం రూ. 1,00,000 ఇస్తారు. ఇవన్నీ కాకుండా ప్రివెంటివ్ హెల్త్ చెకప్ నిమిత్తం రూ.50 వేలు ఖర్చు పెట్టొచ్చు. ఈ మేరకు నగదు చెల్లించవచ్చు. కానీ ఖర్చు మొత్తం గరిష్ఠ పరిమితికి లోబడి ఉంటుంది.ఒక వ్యక్తి మీద ఆధారపడ్డ మనిషి దివ్యాంగుడైతే, అతని వైద్యం నిమిత్తం చేసిన ఖర్చులకు మినహాయింపు ఉంది. ఈ అంగవైకల్యాన్ని శాతాల్లో చెప్పాలంటే ... 40% లోపల ఉంటే రూ.75,000బీ 80 శాతానికిపైన ఉంటే రూ.1.25 లక్షల మినహాయింపు ఉంటుంది. వైద్య ఖర్చులే కాకుండా, ఈ వ్యక్తుల మీద చేసిన జీవిత బీమా ప్రీమియం చెల్లింపులకు కూడా వర్తిస్తుంది. వైద్య ఖర్చులు, నర్సింగ్, పునరావాస నిమిత్తం మొదలైనవి ఇందులో క్లెయిమ్ చేసుకోవచ్చు. మానసిక, చెవుడు, బుద్ధి మాంద్యం, మస్తిష్క పక్షవాతం, ఆటిజం, గుడ్డితనం, చూపుతక్కువ, లోకోమోటర్ వైకల్యం (అవయవాలు లేదా శరీరభాగాలు కదలికలకు సంబంధించింది) కుష్టు వ్యాధి మొదలైన వాటికి మినహాయింపు ఉంది. ఫారం 101ఏ జతపరచాలి. వైద్య అధికారులు సర్టిపై చేయాలి.ఇది కాకుండా సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి. అంగవైకల్యం మారుతూ ఉంటుంది. తేడాలు వస్తాయి. సర్టిఫికెట్లలో ధృవీకరించిన శాతాన్ని బట్టే మినహాయింపు ఉంటుంది. దివ్యాంగుడు ముందుగా మరణిస్తే, స్కీమ్ ద్వారా వచ్చిన మొత్తాన్ని, ఏ వ్యక్తి అకౌంటులోకి వస్తుందో, ఆ వ్యక్తి ఆదాయంలో కలుపుతారు. దివ్యాంగుడు జీవించి ఉన్నప్పుడు, 60 సంవత్సరాలు తర్వాత వచ్చే యాన్యుటీకి మినహాయింపు ఉంది. ఈ సెక్షన్‌లో మినహాయింపును తీసుకున్న వ్యక్తి, ఈ ప్రయోజనాన్ని సెక్షన్ 80యూ ప్రకారం పొందకూడదు. దీని ప్రకారం వ్యక్తి తన కోసం లేదా తన మీద ఆధారపడిన వ్యక్తి నిర్దేశిత జబ్బుల చికిత్సకు అయిన ఖర్చు క్లెయిమ్ చేసుకోవచ్చు. గరిష్ఠ పరిమితి రూ.40 వేలు (60 ఏళ్ల లోపల) రూ.1,00,000 సీనియర్ సిటిజన్లకు తగ్గిస్తారు. 11 డీడీ రూల్ ప్రకారం క్లెయిమ్ చెయ్యాలి. న్యూరాలజిస్ట్, అంకాలజిస్ట్, యూరాలజిస్ట్, హెమెటాలజిస్ట్, ఇమ్యూనోలాజిస్ట్, మొదలైన స్పెషలిస్టులు ధృవీకరించాలి. పూర్తి వివరాలు ఇవ్వాలి. సీనియర్ సిటిజన్లకు రూ.1 లక్ష దాకా, ఇతరులకు రూ.40,000 ఇస్తారు. ఇన్సూరెన్స్ క్లెయిమ్ వచ్చినట్లయితే ఆ విలువ మేరకు మినహాయింపు తగ్గుతుంది.
చివరగా మరొకటి.. 80యూ
దీని ప్రకారం మినహాయింపు. మెడికల్ ఆథారిటీతో సర్టిపై చేయిస్తే అంగవైకల్యం 40% దాటి ఉంటే రూ.75 వేలు, 80% దాటి ఉంటే రూ.1.25 లక్షల మినహాయింపు ఇస్తారు. ఫారం 101ఏ ఫైల్ చేయాలి. గవర్నమెంట్ హాస్పిటల్‌లోని సివిల్ సర్జన్లు/ చీఫ్ మెడికల్ అధికారి సర్టిపై చేయాలి.

## అనధికార ఆస్తులకు బీ-ఖాతాలు జారీ

బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) 2024 సెప్టెంబర్ వరకు జారీ చేసిన బీ-ఖాతా ఆస్తుల క్రమబద్ధీకరణకు కర్ణాటక రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ చర్య వల్ల ఆయా ఆస్తులను తర్వాత ఏ-ఖాతాకు అప్‌గ్రేడ్ చేసుకునేందుకు వీలవుతుంది.ప్రభుత్వ చర్యలతో ఆస్తుల యజమానులు చాలాకాలంగా ఎదురుచూస్తున్న చట్టపరమైన స్పష్టత రానుందని భావిస్తున్నారు. 'ఆస్తులకు బీ-ఖాతా ధ్రువపత్రాలు ఇచ్చేటప్పుడు కొన్ని ప్రమాణాలు నిర్దేశిస్తాం. ఆస్తి యజమానులు ప్రమాణాలను పాటిస్తే బీ-ఖాతా జారీ చేస్తారు. తర్వాత పక్కా డాక్యుమెంట్లతో ఏ-ఖాతాకు అప్‌గ్రేడ్ చేసుకోవచ్చు. కొన్ని లోపాలున్న ఆస్తులకు పరిమిత మినహాయింపులతో బీ-ఖాతా సర్టిఫికెట్లు జారీ చేస్తాం' అని న్యాయ మంత్రి హెచ్‌కే పాటిల్ కేబినెట్ సమావేశంలో తెలిపారు. క్రమబద్ధీకరించిన తర్వాత బీ-ఖాతా ఆస్తి యజమానులకు చట్టపరమైన హోదా దక్కుతుంది. గతంలో అనుమతించని అమ్మకాలు, బ్యాంకు రుణాలు, తనఖాలకు వీలు కల్పించేలా ఏ-ఖాతాకు అప్‌గ్రేడ్ చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. బీ-ఖాతా అనేది చట్టపరమైన, ప్రణాళికా నిబంధనలను పూర్తిగా పాటించని ఆస్తుల కోసం బీబీఎంపీ నిర్వహించే ఒక రకమైన ఆస్తి రికార్డు. వీటిలో అనధికార లేఅవుట్లలోని భవనాలు, అనుమతి లేని నిర్మాణాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు లేనివి ఉన్నాయి. ఈ ఆస్తులు పూర్తిగా చట్టబద్ధం కానప్పటికీ యజమానులు ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పన్ను ప్రయోజనాల కోసం వారి వివరాలను నమోదు చేయాలి. ఇప్పటివరకు ఇలాంటి లోపాలున్న ఆస్తులు పూర్తిగా చట్టబద్ధమైనవిగా పరిగణించబడలేదు. అమ్మకం, భవన అనుమతులు పొందడం లేదా ట్రేడ్ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసేటప్పుడు ఆంక్షలు ఎదురయ్యేవి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు సాధారణంగా వాటిపై రుణాలు ఇవ్వవు. స్థానిక చట్టాలకు పూర్తిగా అనుగుణంగా ఉండే ఏ-ఖాతా ప్రాపర్టీలతో పోలిస్తే, బీ-ఖాతా ఆస్తులు సాధారణంగా తక్కువ మార్కెట్ విలువ, పరిమిత చట్టపరమైన ప్రయోజనాలను కలిగి ఉంటాయని నిపుణులు అంటున్నారు.అనధికారిక నిర్మాణాలు, ప్రణాళికారహిత అభివృద్ధి బీ-ఖాతాల సమస్యకు దారితీసింది. వీటిని నియంత్రించాలని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో పేర్కొంది. కర్ణాటక టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ చట్టం నియంత్రణ పరిధిలోకి బీ-ఖాతా ఆస్తులను తీసుకురావాలనే డిమాండ్ ఉంది. 2024 సెప్టెంబర్ 30 తర్వాత సృష్టించిన లేదా నిర్మించిన అనధికారిక ఆస్తులకు బీ-ఖాతా జారీ చేయడాన్ని గ్రేటర్ బెంగళూరు గవర్నెన్స్ చట్టం నిషేధించింది. బీ-ఖాతా అనే భావనను 2009లో ప్రవేశపెట్టారని, అందువల్ల 2009కి ముందు జారీ చేసిన అన్ని ఖతాలు ఏ-ఖాతాలేనని తెలిపింది.

# నకిలీ ఐడీలతో కోట్లు కొల్లగొట్టారు

### మహారాష్ట్రను కుదిపేస్తున్న విద్యాశాఖ అధికారుల వ్యవహారం




**జనంసాక్షి:**విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యా యులు దారితప్పి సాగించిన బాగోతం ఇప్పుడు మహారాష్ట్రను కుదిపేస్తోంది. రాష్ట్ర విద్యాశాఖకు చెందిన షలార్త్ పోర్టల్‌ను దుర్వినియోగం చేస్తూ, కొందరు సీనియర్ విద్యాధికారులు నకిలీ టీచర్ ఐడీలను సృష్టించి, అర్హత లేని వ్యక్తుల నుంచి డబ్బు తీసుకుని, వారిని టీచర్లుగా నియమించారని వెల్లడయ్యింది.ఈ విధమైన అక్రమాల ద్వారా వీరు మూడువేల కోట్ల రూపాయల వరకూ స్వాహా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం బయటపడిన దరిమిలా ప్రభుత్వం విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కుంభకోణంలో భాగస్వాములైన కొందరిని ఇప్పటికే అరెస్టు చేశారు. మరికొందరిని సస్పెండ్ చేశారు.ముంబై, నాగ్‌పూర్ జోన్‌ల విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్లు, ఈ కుంభకోణం కోసం వేలాది నకిలీ ఐడీలను సృష్టించారనే ఆరోపణలు వినవస్తున్నాయి. షలార్త్ ఐడీ గురించి మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ రామ్ పవార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏదైనా పాఠశాలలో ఉపాధ్యాయుని ఖాళీ ఏర్పడినప్పుడు.. ఆ స్థానంలో ఇంకొక అభ్యర్థిని ఎంపిక చేసిన తర్వాత, సదరు పాఠశాల అపాయింట్ మెంట్ ఆర్డర్ జారీ చేస్తుంది. తరువాత ఆ అభ్యర్థి ఈ అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తో ఆ జోన్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. అతను దానిని ఆమోదించి, అభ్యర్థికి షలార్త్ ఐడీని, పాస్‌వర్డ్‌ను అందిస్తారు. ఈ ఐడీ అతనికి జీతంతో పాటు ఇతర ప్రయోజనాలను అందుకునేందుకు ఉపయోగపడుతుంది. ఇది లేకుండా ఏ ఉపాధ్యాయునికీ చెల్లింపులు జరగవు. షలార్త్ పోర్టల్‌లో రాష్ట్రంలోని విద్యాశాఖ సిబ్బంది సమగ్ర సమాచారం ఉంటుంది.షలార్త్ ఐడీలను జారీ చేసే అధికారం విద్యా డిప్యూటీ డైరెక్టర్‌కు ఉంటుంది. ఈ కార్యాలయంలోని పలువురు అధికారులు బోగస్ ఐడీలను సృష్టించి, వాటి సాయంతో జీతాలను స్వాహా చేశారు. ఇందుకోసం నకిలీ ఆధారాలు ఉపయోగించి, పలు బ్యాంకు ఖాతాలు తెరిచారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల పోస్టులలో అర్హత లేని వారిని నియమించి, వారి నుంచి భారీగా లంచాలు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. ఎయిడెడ్ పాఠశాలల రికార్డులపై ప్రభుత్వ పర్యవేక్షణ పరిమితంగా ఉండటమే ఈ తరహా అవినీతికి కారణమని పలువురు అంటున్నారు.ఈ కుంభకోణంలో నాగ్‌పూర్ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఉల్హాస్ నారద్ అరెస్టు అయ్యారు. ఈయన నకిలీ ఐడీలు, బ్యాంకు ఖాతాలను సృష్టించేందుకు అధికారులకు సహాయం చేశారని విచారణలో తేలింది. జూలై 18న ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అసెంబ్లీలో మాట్లాడుతూ షలార్త్ ఐడీ కుంభకోణంలో మూడు కోట్ల రూపాయల వరకు దుర్వినియోగం జరిగివుండవచ్చన్నారు. ఈ ఐడీ కుంభకోణంపై దర్యాప్తునకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఇదే ఉదంతంలో ప్రమేయం ఉన్న ముంబై డిప్యూటీ డైరెక్టర్ సందీప్ సంగవేను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.


## రంగంలోకి ఆర్‌ఎస్ సంధు!

**జనంసాక్షి:**ఎయిరిండియా విమాన దుర్ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తులో పైలట్లకు భాగస్వామ్యం కల్పించాలని, సాంకేతిక నిపుణులను కూడా తీసుకోవాలని భారత ఎయిర్లైన్ పైలట్ల సంఘం(ఆల్పా ఇండియా) తీవ్రంగా పట్టుపడుతోంది.పైలట్ల సంఘం ఈమేరకు తమ డిమాండ్లను పలుమార్లు విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) ముందుంచింది. దీంతో ఏఏఐబీ కూడా సానుకూలంగా స్పందించింది. ఎయిరిండియాలో గతంలో డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్‌గా పనిచేసిన మాజీ పైలట్ కెప్టెన్ ఆర్‌ఎస్ సంధును ఏఏఐబీ రంగంలోకి దించుతోంది. గత నెల 12న అహ్మదాబాద్ వద్ద ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787-8 విమానం కూలిపోయి 260 మంది చనిపోయిన సంగతి తెలిసిందే.విమాన దుర్ఘటనపై దర్యాప్తు నిర్వహిస్తున్న బృందంలో 'డొమైన్ ఎక్స్పర్ట్'గా చేరాలని ఆర్‌ఎస్ సంధును ఏఏఐబీ కోరిందని, అందుకు ఆయన అంగీకరించారని కొన్ని వర్గాలను ఉటంకిస్తూ 'హిందుస్థాన్ టైమ్స్' పత్రిక వెల్లడించింది. వైమానిక రంగంలో విశేషానుభవం గడించిన, విషయ పరిజ్ఞానం గల నిపుణుడిగా (డొమైన్ ఎక్స్పర్ట్)గా ఆర్‌ఎస్ సంధుకు పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఎయిరిండియాలో మాజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అయిన ఆర్‌ఎస్ సంధుకు విమానయాన పరిశ్రమలో దాదాపు 39 ఏళ్ల వృత్తిపరమైన అనుభవం ఉంది. ఎయిరిండియాలో డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ హోదాలో సేవలందించారు.

### ఈవీ, హైడ్రోజన్, ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల్లో

# భారత్ నెం.1

### ఇంధన విధానంలో సమూల మార్పులు
### కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ



**జనంసాక్షి:**భారతదేశ రవాణా, ఇంధన విభాగంలో కొత్త అధ్యాయాన్ని సూచిస్తూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ కొన్ని అంశాలు పంచుకున్నారు. దేశంలోని ఎలక్ట్రిక్, హైడ్రోజన్, ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహన విభాగాలు ప్రపంచంలోనే నంబర్ వన్ అవుతాయని తెలిపారు.గ్రీన్ మొబిలిటీ, ఎనర్జీ డైవర్సిఫికేషన్, పారిశ్రామిక స్వావలంబన దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు.అధిక ఇథనాల్ ఇంధన మిశ్రమాలు, ముఖ్యంగా ఈ100 (100% ఇథనాల్)పై వస్తు సేవల పన్ను (జీఎస్టీ)తగ్గించే ప్రతిపాదనను గడ్కరీ పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఇథనాల్ ఆధారిత వాహనాల దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి, వ్యవసాయం, పరిశ్రమలు, ఎనర్జీ అంతటా బలమైన ఇథనాల్ ఆర్థిక వ్యవస్థను ప్రేరేపించడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. 'పూర్తిగా ఇథనాల్‌తో నడిచే వాహనాలు ఆచరణీయం మాత్రమే కాదు.. అవి దేశ భవిష్యత్తుకు చాలా అవసరం' అని గడ్కరీ నొక్కి చెప్పారు. ఖరీదైన శిలాజ ఇంధన దిగుమతులకు ప్రత్యామ్నా యంగా ఈమేరకు పైలట్ ప్రాజెక్టుల అవసరాన్ని, ఇథనాల్ సామర్థ్యాన్ని హైలైట్ చేశారు.ముడిచమురు దిగుమతి చేసుకునే దేశాల్లో భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉంది. ఆ వినియోగంలో రవాణా ప్రధాన వాటాను కలిగి ఉన్నందున, ఇంధన భద్రతను మెరుగుపరచడానికి ప్రత్యామ్నాయ ఇంధనాలు కీలకం. ఈ100-అనుకూలమైన వాహనాలను ప్రోత్సహించడం ద్వారా చెరకు, బియ్యం, మొక్కజొన్న ఆధారిత ఇథనాల్ వాడకాన్ని పెంచవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీని ద్వారా ఒనగూరే లక్ష్యాలు ఈ విధంగా ఉన్నాయి. శిలాజ ఇంధన దిగుమతులను తగ్గిం చడం..తక్కువ కర్బన ఉద్గారాలు..గ్రామీణ, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలకు ఊతమివ్వడం..గ్రీన్ ఫ్యూయల్ టెక్నాలజీల్లో పారిశ్రామిక ఆవిష్కరణలను ప్రోత్సహించడం.. జాతీయ బయో-ఎనర్జీ ప్రోగ్రామ్‌కు మద్దతు ఇవ్వడం

## గ్రీన్‌కార్డులకూ ఎసరు..

పని చేస్తున్నవారు కూడా వెళ్లిపోయేటట్లు చేస్తోంది. అమెరికాలోనే అతిపెద్దదైన మెట్రోపాలిటన్ ర్యాపిడ్ ట్రాన్సిట్ అథారిటీ (మార్టా) సీఈవో కొల్లిన్ గ్రీన్‌వుడ్ జులై 17న పదవి నుంచి వైదొలిగారు. ఆయనకు వర్క్‌పర్మిట్ కాలవ్యవధి ముగిసిపోవడం.. గ్రీన్‌కార్డ్ జారీలో జాప్యంతో ఆయన తన పదవిలో కొనసాగడం అసాధ్యంగా మారింది. దీంతో ముందస్తు రిటైర్మెంట్‌ను ఆయన ఎంచుకొన్నారు. ఆయన స్వస్థలం కెనడా. తమ సీఈవోకు గ్రీన్‌కార్డ్ త్వరలోనే వస్తుందని మార్టా చెప్పినా.. పదవిని వీడేందుకే గ్రీన్‌వుడ్ మొగ్గు చూపారు. వాస్తవానికి గ్రీన్‌వుడ్ మార్టా సీఈవోగా 2022 జనవరిలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన వచ్చిన తర్వాత కంపెనీ ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపడింది. ఆయన ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజ్డ్ డాక్యుమెంట్ జూన్ 18నే ముగిసిపోయింది. అయినా కానీ, ఆయన గ్రీన్‌కార్డ్ వచ్చేవరకు కెనడా వీసాపై అమెరికాలో కొనసాగుతారని మార్టా పేర్కొంది. అమెరికా రవాణారంగంలో పలువురు హైప్రొఫైల్ అధికారులు రాజీనామాల పరంపరలో గ్రీన్‌వుడ్‌ది కూడా ఒకటి. వీరిలో చాలామంది ఆపరేషనల్ సవాళ్లు, ఇమిగ్రేషన్ టైమ్‌లైన్ వంటి కారణాలతో ఉద్యోగాలను వదిలేశారు.

**భారతీయులకు గ్రీన్‌కార్డుల్లో భారీ జాప్యం..**

అమెరికాలో గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకొన్న భారతీయులు.. ప్రాసెసింగ్‌లో తీవ్ర జాప్యాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఇమిగ్రేషన్ బ్యాక్‌లాగ్‌లో 1.13 కోట్ల దరఖాస్తులున్నాయి. ఈ స్థాయిలో పెండింగ్‌లో ఉండటం ఓ రికార్డ్. ఇక ఈ ఏడాది రెండో త్రైమాసికంలో మరో 16 లక్షల కొత్త దరఖాస్తులు వచ్చి చేరనున్నాయి. ఇటీవల యూఎస్ సీఐఎస్ ప్రచురించిన డేటాషీట్‌లో ఈ వివరాలున్నాయి.

## ట్రంప్ కసి.. ఒబామా అరెస్టు అంటూ ఏఐ వీడియో




**జనంసాక్షి:**సంచలన ఆరోపణల వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోస్ట్ చేసిన ఓ వీడియో తీవ్ర చర్చనీయాంశమైంది. 'చట్టానికి ఎవరూ అతీతులు కాదని' సందేశంతో ఆయన ఆ పోస్ట్ చేశారు.అయితే మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా అరెస్ట్ అయిన నేపథ్యంతో ఉన్న ఏఐ వీడియోను తన ట్రూత్ ప్లాట్‌ఫారమ్‌లో పోస్ట్ చేయడం గమనార్హం. ఓవల్ ఆఫీసులో ట్రంప్‌తో భేటీ అయిన సందర్భంలో మాజీ అధ్యక్షుడు ఒబామాను ఎఫ్‌బీఐ అరెస్టు చేసినట్లుగా ఆ వీడియో ఉంది. ఒబామా చేతుల్ని వెనక్కి విరిచి మరీ అధికారులు బేడీలు వేశారు. ఆ సమయంలో నవ్వుతూ కనిపించారు ట్రంప్. అటుపై ఒబామా కటకటాల్లో ఉన్నట్లు ఆ వీడియోలో ఉంది. అంతకంటే ముందు ఈ వీడియోలో.. చట్టానికి ఎవరూ అతీతులు కాదని పలువురు నేతలు చెప్పిన సందేశాన్ని దానికి జత చేశారు. ఆ నేతల్లో ముందుగా ఉంది ఒబామానే కావడం గమనార్హం.

## కళలకు పుట్టినిల్లు ఒడిశా

**జనంసాక్షి:**భిన్న సంస్కృతులతో భాషిల్లుతున్న మన రాష్ట్రం కళలకు పుట్టినిల్లని మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ గిరిధర్ గొమాంగో అన్నారు. స్థానిక బిజు పట్నాయక్ ఆడిటోరియంలో ఆదివారం మా మజ్జిగౌరి ఎంటర్‌టైన్మంట్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన రాయగడ టాలెంట్ అవార్డు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కళాకారులనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రానికి చెందిన ఎంతో మంది కళాకారులు దేశ, విదేశాల్లో తమ ప్రతిభను చాటుకుని ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. ప్రముఖ గాయకుడు రఘునాథ్ పాణిగ్రహి అనేక తెలుగు చలన చిత్రాల్లో తన మధురమైన స్వరంతో పాటలు పాడి అందరినీ మైమరపించారని గుర్తు చేశారు.ఎంతో మంది కళామతల్లిని నమ్ముకుని ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కళాకారులను, కళలను ప్రోత్సాహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కళారంగంలో వారు రాణించగలిగితే రాష్ట్రం కళారంగంలో మరో మైలురాయి చేరుకునే అవకాశం ఉంటుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కళారంగాన్ని నమ్ముకుని ఉన్న ఎంతో మంది సీనియర్ కళాకారులు నేడు అత్యంత దయనీయమైన స్థితిలో ఉన్నారన్నారు. అటువంటి వారిని గుర్తించి ప్రభుత్వం వారిని ఆదుకోవడంతోపాటు నెల వారి పింఛన్‌ను అందివ్వాలన్నారు. డు యువ కళాకారులు వారి ప్రతిభను చాటి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నారన్నారు.

## 'డ్రాప్ చేసి ఇంటికి వచ్చేలోపు దుబాయ్ వెళ్లింది'

ఏటా వాహనాలు పెరుగుతుండడంతో రోడ్లపై ట్రాఫిక్‌జామ్ అధికమవుతోంది. ఇటీవల బెంగళూరులో జరిగిన ఓ సంఘటన పెరిగిన ట్రాఫిక్‌కు అద్దం పడుతోంది. దుబాయ్ వెళ్తున్న తన స్నేహితురాలిని ఎయిర్‌పోర్ట్‌లో దింపి ఇంటికి వెళ్లాలని చూసిన ఓ యువతికి ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు.దాంతో ఈమె ట్రాఫిక్ దాటుకొని ఇంటికెళ్లేలోపు తన ఫ్రెండు దుబాయ్ చేరిపోయింది. ఈ వివరాలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంతో అదికాస్తా వైరల్‌గా మారింది.కంటెంట్ క్రియేటర్లు ప్రియాంక, ఇంద్రయాణి ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లోని వివరాల ప్రకారం..'నా స్నేహితురాలు దుబాయ్ బయలుదేరుతుండగా బెంగళూరు విమానాశ్రయంలో డ్రాప్ చేశాను. కొద్దిసేపటికి ఆమె దుబాయ్ చేరుకున్నట్లు సమాచారం అందించింది. కానీ నేను అప్పటికీ బెంగళూరు ట్రాఫిక్‌లోనే చిక్కుకుపోయాను' అని పోస్ట్ చేశారు. 'యదార్థ సంఘటనల ఆధారంగా..' అని హెడ్డింగ్‌తో పోస్ట్ చేసిన ఈ వివరాలు వైరల్‌గా మారాయి. ఇప్పటివరకు ఈ పోస్ట్‌కు 19 మిలియన్లకు పైగా వ్యూస్, మిలియన్ కంటే ఎక్కువ లైక్‌లు వచ్చాయి.దీనిపై నెటిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు. 'బెంగళూరులో కారులో 1 కి.మీ వెళితే 3 గంటలు.. కాలినడక ద్వారా వెళితే 1 కి.మీకు 10 నిమిషాలు సమయం పడుతుంది' అని ఒక యూజర్ తెలిపారు. 'ఇతర రాష్ట్రం నుంచి రెండు గంటలు ఫ్లైట్ ఎక్కి బెంగళూరు ఎయిర్ పోర్టుకు వచ్చిన నేను.. ఇంటికి వెళ్లేందుకు ఐదు గంటలు పట్టింది' అని మరోవక్తి చెప్పారు. జనాభా పెరుగుదల, ఐటీ బూమ్‌కు అనుగుణంగా బెంగళూరులో మౌలిక సదుపాయాలు లేవని కొందరు అభిప్రాయపడుతున్నారు. విమానాశ్రయం సిటీకి 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. రద్దీ సమయాల్లో, ఇంటికి తిరిగి ప్రయాణించేందుకు చాలా సమయం పడుతోంది. ఇది చాలా దేశీయ లేదా తక్కువ దూరంలో ఉన్న అంతర్జాతీయ విమానాల సమయం కంటే చాలా ఎక్కువ అనే వాదనలున్నాయి.



# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి





- కాల్పోల్ తండాలో వైద్య శిబిరం ఆకస్మిక తనిఖీ
- పరిస్థితి అదుపు తప్పకుండా జాగ్రత్తలపై ఆదేశం
- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి

**నిజామాబాద్ జిల్లా బ్యూరో, జూలై 21 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లాలోని అధికార యంత్రాంగం సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని మోపాల్ మండలం కాల్పోల్ తండాను కలెక్టర్ సోమవారం సందర్శించారు. తండాలో పలువురికి జ్వరాలు సోకిన నేపథ్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జ్వర పీడితుల వివరాలను, వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి అధికారులను వివరాలు తెలుసుకున్నారు. జ్వరాలు ప్రబలేందుకు గల కారణాలను గుర్తిస్తూ, పరిస్థితి అదుపు తప్పకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జ్వరాలు, ఇతర అనారోగ్య కారణాలతో అస్వస్థతకు గురైన వారికి మెరుగైన చికిత్సలు అందించాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే స్థానికులు వైద్య శిబిరాన్ని సందర్శించి తగిన చికిత్సలు పొందేలా చూడాలన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలని స్థానిక అధికారులను ఆదేశించారు. నివాస ప్రాంతాల నడుమ నీరు నిలువ ఉండకుండా చూడాలని, పారిశుధ్య సమస్య నెలకొనకుండా శానిటేషన్ పనులు జరిపించాలన్నారు. మురికి కాల్వలు, నీరు నిలువ ఉన్న ప్రదేశాలలో దోమల నివారణ మందులు పిచికారీ చేయించాలని, ప్రతి ఇంటిని సందర్శించి పరిస్థితిని సమీక్షించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగానే కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా తండాలోని ఆయా నివాస ప్రాంతాలను సందర్శిస్తూ, స్థానికంగా నెలకొని ఉన్న పరిస్థితులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నివాస ప్రాంతాల నడుమ నిరుపయోగంగా ఉన్న టైర్లు, ఇతర వస్తువులను గమనించిన కలెక్టర్, వాటిని నివాస ప్రదేశాలకు దూరంగా పారవేయాలని స్థానికులకు హితవు పలికారు. లేనిపక్షంలో దోమలు వ్యాప్తి చెంది జ్వరాలు, సీజనల్ వ్యాధులు వచ్చేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. మరో వారం రోజుల పాటు తండాలో వైద్య శిబిరం ఉంటుందని, జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే శిబిరాన్ని సందర్శించి చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. పరిస్థితి అదుపులోనే ఉందని, ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని తండా వాసులకు కలెక్టర్ భరోసా కల్పించారు. కలెక్టర్ వెంట జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డా. తుకారాం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మోపాల్ ఎంపీడీఓ రాములు, ఎంపీఓ కిరణ్ తదితరులు ఉన్నారు.

## అమ్మా... భోజనం రుచిగా ఉంటోందా?

### నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి



అమ్మా.... మీకు భోజనం రుచిగా పెడుతున్నారా? అని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అడగడంతో కంజర రెసిడెన్సియల్ పాఠశాల, కళాశాల విద్యార్థినులు సంతోషంగా ఫీల్ అయ్యారు. జిల్లాలోని మోపాల్ మండలం కంజర గ్రామంలో గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలను కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని విభాగాలను తిరుగుతూ, నిశితంగా పరిశీలించారు. కిచెన్, డార్మెటరీ, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్ లలో వసతులను పరిశీలన జరిపారు. విద్యార్థినుల కోసం సిద్ధం చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. స్టోర్ రూంలో నిల్వ ఉన్న బియ్యం, పప్పు దినుసులు, వంట నూనె ఇత్యాది సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినుల ఆరోగ్య స్థితిగతులు, వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని నిర్వాహకులను ఆదేశించారు. అల్పాహారం, భోజనం రుచికరంగా ఉంటోందా? అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయా, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అని బాలికలను అడిగి తెలుసుకున్నారు. రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల తరగతి గదులు, పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిర్వహణ సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు.



## మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేసిన కలెక్టర్

**ముస్తాబాద్ జులై 21 (జనం సాక్షి):** మండల కేంద్రంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పలువురు మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం అధ్యక్షులు మట్ట రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు శిక్షణ ఇప్పిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు, రైతులకు పనిముట్లు పరికరాలు అందించారు, పిడిఎఫ్ సంస్థ నుండి ఎన్నో సేవా కార్యక్రమాలతో పాటు ప్రజలకు ఉపయోగపడే పనులు చేస్తున్నందుకు మండల ప్రజలు అభినందిస్తున్నారు ముస్తాబాద్ లోని రైతు వేదికలో దాదాపు 28 కుట్టు మిషన్లు మహిళలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు కుట్టు మిషన్లు మహిళలకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. మహిళలు కుట్టు మిషన్లు సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కే కే మహేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఏఎంసీ చైర్ పర్సన్ తలారి రాణి, తహసిల్దార్ సురేష్ ఏపీఎం దేవరాజు, సీసీలు, సిఏలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏళ్ల బాల్‌రెడ్డి, టి వాణి, అనిల్, కరెడ్ల తిరుపతిరెడ్డి, ఎన్జీవో వెంకటేశ్వర్, కే సునీత మహిళలు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



## ముఖ్య మంత్రిని కలిసిన గడ్డం ఇందుప్రియ

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** సీఎం రేవంత్ రెడ్డి ని కామారెడ్డి తాజా మాజీ మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియా సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి పుష్ప గుచ్చం అందించారు. సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదములు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సీఎం కోరినట్లు తాజామాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ తెలిపారు,కామారెడ్డిలో పార్టీ పరిస్థితిని సీఎం అడిగి తెల్సుకున్నారని తెలిపారు. కామారెడ్డి అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని కోరగా, సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## పిడుగు పాటుతో 30 గోర్లు మృతి



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని సిరిపురం లో పిడుగు వేయడంతో అదృష్టవశక్తి గొర్ల కాపరి ప్రాణం తృటిలో తప్పింది. స్థానికుల కథనం ప్రకారం సోమవారం చిల్లపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి పుట్ట పోచయ్య సిరిపురం దగ్గర గోదావరి ఒడ్డుకు గొర్లను మేపాడానికి వెళ్లగా సాయంత్రం 5 గంటల సమయం లో ఒకే సారి పెద్ద శబ్దంతో గొర్ల మంద పైన పిడుగు పడటంతో 30 గోర్లు అక్కడికి అక్కడే మృతి చెందాయి. అక్కడే ఉన్న గొర్ల కాపరి పుట్ట పోచయ్య కళ్ళు ఒకే సారి మూతలు పడి స్పృహ కొలిపోయారు. అక్కడే ఉన్న గొర్లు మేపుతున్న మరో గొర్ల కాపరి గంగయ్య వెంటనే వారి కుటుంబ సభ్యులకు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు వెళ్ళి వెంటనే పుట్ట పోచయ్యను హాస్పిటల్ కి తరలించారు. ప్రభుత్వం వెంటనే పిడుగు పాటుకు గురై 30 గొర్రె ల మృతితో దాదాపు రూ. 3 లక్షల పైగ నష్టం జరిగిందని, అ గొర్రెల కాపరి కుటుంబానికి ప్రభుత్వం ఆదుకొని నష్టం పరిహారం చెల్లించాలని మంథని యాదవ సంఘం మండల అధ్యక్షులు పరిశవేన మోహన్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు.

## యువతకు అండగా ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పం

### రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** యువతకు ఉపాధి కల్పనలో అండగా ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో టాస్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృత్తి శిక్షణా కేంద్రాన్ని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, టాస్క్ సీఈఓ శ్రీకాంత్, సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి లతో కలిసి మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఎంబీఏ తదితర ఉన్నత విద్యనభ్యసించిన నిరుద్యోగ యువతకు స్కిల్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భూపాలపల్లి జిల్లా యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. నైపుణ్యం కలిగిన యువతకు బహుళ జాతి సంస్థలు ప్రాధాన్యత ఇస్తున్నాయని, టాస్క్ ద్వారా 50 పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు సింగరేణి, విద్యుత్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు.
రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, యువతలో నైపుణ్యాలను వెలికితీసేందుకు, వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వృత్తి శిక్షణా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఈ కేంద్రాలు యువత తమపై తాము ఆధారపడేలా చేయడం లక్ష్యంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. అలాగే, శిక్షణా కేంద్రంలో ఫాకల్టీ ఉత్తమంగా ఉండేలా చూసుకోవాలని, కేవలం నామమాత్రంగా కాకుండా ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కేంద్రాన్ని ఉత్తమ శిక్షణా కేంద్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. సింగరేణి, జెన్కో వంటి ప్రాంతాలలో ఉపాధి అవకాశాల కోసం నిరుద్యోగ యువతకు ఈ కేంద్రాలు ఉపాధి కల్పన వేదికగా నిలవాలని ఆయన స్పష్టం చేశారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని భాస్కరగడ్డలో రెండు పడక గదుల ఇళ్ళు మంజూరు అయిన లబ్ధిదారులకు నూతన బట్టలు పెట్టి శుభాకాంక్షలు తెలిపారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించారు.

## కాంగ్రెస్ పార్టీకి దిశా నిర్దేశం చేస్తూ పార్టీని ముందుకు నడిపించాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 21 (జనం సాక్షి) :** మరింత రెట్టింపు ఉత్సాహంతో ఆయురారోగ్యాలతో ఉంటూ కాంగ్రెస్ పార్టీకి దిశా నిర్దేశం చేస్తూ పార్టీని ముందుకు తీసుకువెళ్లాలని కోరుతూ మల్లికార్జున్ ఖర్గే,కు సోమవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే జన్మదినం సందర్భంగా సోమవారం ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన షబ్బీర్ అలీ,ఖర్గే కలకాలం ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఇంకొన్నేళ్లు దేశానికి ప్రజలకు సేవ చేయాలని కోరుకుంటున్నా అన్నారు. అదేవిధంగా భారత ప్రజల పట్ల మీ నాయకత్వం,నిబద్ధత, అంకితభావం ఎల్లప్పుడూ మా అందరికీ స్ఫూర్తినిస్తాయి అన్నారు.

## రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- కాలువలద్వారా వచ్చేనీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- ఈ నెల 23 న రిజర్వాయర్ల ద్వారా నీటి విడుదల



**స్టేషన్ ఘన్పూర్, జూలై 21 (జనంసాక్షి ) :** నియోజకవర్గంలోని రిజర్వాయర్ల ద్వారా ఈ నెల 23 నుంచి నీటి విడుదల చేసి, దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా రైతుల పంటలను కాపాడేందుకు ప్రయత్నిస్తామని, కాలువల ద్వారా వచ్చే సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నారు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాదుల పథకం ద్వారా సాగునీరు అందించే ప్రయత్నం చేస్తున్నామని, అయితే మోటార్లు సరిగా పనిచేయకపోవడం వల్ల సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ధర్మసాగర్, స్టేషన్ ఘనపూర్, మల్లన్న గండి, అశ్వారావుపల్లి రిజర్వాయర్లలో నీటి నిలువలు పెంచేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు నాట్లు వేసేందుకు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, ప్రస్తుత నీటి నిలువలతో 10 రోజుల పాటు నీటిని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ధర్మసాగర్ సౌత్ కెనాల్, మల్లన్న గండి కుడి, ఎడమ కాలువలు, ఘనపూర్ నవాబ్ పేట మెయిన్ కెనాల్, అశ్వారావుపల్లి రైట్ మెయిన్ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేస్తామని, దీనివల్ల నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. నీటి నిలువల కారణంగా నిరంతరాయంగా నీటి విడుదల సాధ్యం కాదని, ఆన్-ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేయనున్నామని, రైతులు సహకరించాలని కోరారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ పార్టీ బీసీలపై ప్రేమ చూపాలంటే బీసీ బిల్లుకు మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలపై కపట ప్రేమ చూపిస్తూ ప్రభుత్వాన్ని తప్పుపట్టడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అందించేందుకు శాసనసభలో ఆమోదించి కేంద్రానికి పంపినట్లు, రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్య, నాయకులు చింతకుంట్ల నరేందర్ రెడ్డి, జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, పోగుల సారంగపాణి, నీల గట్టయ్య, బూర్ల శంకర్, గద్దమీది సురేష్ కుమార్, కోళ్ల రవి గౌడ్, ఇనుగాల వెంకటేశ్వర్ రెడ్డి, మామిడాల లింగారెడ్డి, తాళ్లపెల్లి సమ్మయ్య, జగదీష్ చందర్ రెడ్డి, రాజేష్ నాయక్, సింగపురం వెంకటయ్య, చింత ఎల్లయ్య, రజాక్, కొలిపాక సతీష్, నరేందర్, లింగాజీ, భూక్య రమేష్ నాయక్, దిలీప్ రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, సత్యం, గుర్రం రాజు, గట్టు రమేష్, కత్తుల కట్టయ్య, పల్లె రవీందర్, ఫాతి కుమార్, తెల్లాకుల రామకృష్ణ, వెంకటస్వామి, యాకూబ్ పాష, శ్రీధర్, బాస్కుల సమ్మయ్య, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు కూతురుకు ఐఐటి సీటు

**సదాశివ నగర్ జూలై 21 జనం సాక్షి**
కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల కేంద్రానికి చెందిన వ్యవసాయ రైతు కోతి దేవా రెడ్డి పావని రెడ్డిల కూతురు శ్రీనిత రెడ్డి ఐఐటి సీటు సంపాదించడం గర్వకారణంగా ఉందని మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం పలువురు నాయకులతో కలిసి సదాశివ నగర్ లో ఘనంగా సన్మానించారు. దేశంలో 15 లక్షల మంది ఈ పరీక్ష రాయగా శ్రీనిత రెడ్డి 16, 000 ర్యాంకు సాధించి 98% మార్కులతో సీటు పొందడం గర్వంగా ఉందని దేవా రెడ్డి అన్నారు తాను వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను బాగా చదివియాలని ఎంతో ఆశపడ్డానని అందుకు అనుగుణంగా తన కూతురు ఐఐటి సీటు సంపాదించిందన్నారు. శ్రీనిత రెడ్డి ఆదర్శంగా తీసుకొని గ్రామీణ యువతీ యువకులు తల్లిదండ్రుల కలలు నిజం చేయడానికి కష్టపడి చదవాలని మాజీ జెడ్పిటిసి అన్నారు .ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు సదాశివ నగర్ మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త బోరింగ్ రామ్ రెడ్డి, ఎన్ఆర్ఐ నాయకుడు వెంకటస్వామి తో పాటు పలువురు పాల్గొని శ్రీనిత రెడ్డికి అభినందనలు తెలియజేశారు.

## కరీంనగర్ అభివృద్ధి, ఎన్నికల విజయంపై

# సీఎం రేవంత్‌తో రాజేందర్ రావు చర్చ




**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 21 (జనంసాక్షి) :** హైదరాబాదులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రితో చర్చించారు. కరీంనగర్‌లో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. కరీంనగర్ నగర కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు అనుసరించాల్సిన ప్రణాళిక, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో అత్యధిక విజయం సాధించే స్ట్రాటజీపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాజేందర్ రావు తెలిపారు. పార్టీ నాయకులు, శ్రేణులతో సమన్వయంతో ముందుకు సాగుతున్నామని, మున్సిపల్ ఎన్నికల్లో విజయం కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలందరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, స్వశక్తి మహిళలకు వడ్డీ లేని రుణాలు, రైతులకు రైతుబంధు సాయంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని దేవుడిలా కొలుస్తున్నారని, సకల జనుల హితమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో గెలిచేలా కష్టపడతామని రాజేందర్ రావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజేందర్ రావు పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసి, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కైవసం చేసుకునేలా కృషి చేయాలని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు.

# మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ చేసిన విప్





**కథలాపూర్, జూలై 21(జనం సాక్షి) :** మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కథలపూర్ మండలం అంబారి పేట గ్రామంలోని శ్రీ ఓంకారేశ్వర స్వామి వారి దేవాలయ ఆవరణలో మొక్కలు నాటారు.అనంతరం శ్రీ ఓంకారేశ్వర స్వామివారిని దర్శించి కథలాపూర్ మండలం పరిధిలో ఇటీవల మంజూరి అయినా 14 లక్షల విలువ గల 35 ముఖ్యమంత్రి సహాయానికి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ పాటు పడాలని తెలిపారు.ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దానిని పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.
మొక్కలు నాటడం వల్లే వర్షాలు విరివిగా కురుస్తాయని దీనివల్ల చెరువులు కుంటలు నిండి భూగర్భ జలాలు కూడా పెరిగి రైతులు పంటలు పండించుకోవడానికి నీటి కొరత లేకుండా ఉంటుందన్నారు. అడవుల్లో పళ్ళముక్కలు పెంచడం వల్ల పెంచడం వలన వన్య ప్రాణులకు కూడ ఉపయోగం ఉంటుంది అన్నారు.ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రుణాలను ప్రజా ప్రభుత్వంలో పునరుద్ధరించామని అన్నారు. 93 లక్షల పేద కుటుంబాలకు రాష్ట్రంలో సన్న బియ్యం రేషన్ కార్డు ద్వారా సరఫరా చేస్తున్నామని,500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. ఆర్థికంగా అనేక కష్టాలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయల జమ చేశామని అన్నారు.రైతు భరోసా క్రింద పెట్టుబడి సహాయం ఎకరానికి 12 వేల రూపాయలకు పెంచి 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయల జమ చేశామని, రైతు బీమాకు 3 వేల కోట్ల అందించామని అన్నారు.
త్వరలోనే ఉమ్మడి మేడిపల్లి కథలాపూర్ మండల ప్రజల చిరకాల వాంఛ కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ నిర్మాణం పూర్తి అవుతుందని తెలిపారు.ఇప్పటికే సుమారు 6 కోట్ల మీద రూపాయలతో పనులు జరిగిందని మిగతా పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. గుడి ఎడమ కాలువలకు భూసేకరణ జరుగుతుందని కాలువల నిర్మాణం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కథలాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పుంద్ర నారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి అజీమ్,రాష్ట్ర పిసిసి కార్యవర్గ సభ్యుడు తోట్ల అంజయ్య వైస్ చైర్మన్ పులి శిరీష ప్రసాద్ మాజి సర్పంచ్ దేవా యాదవ్, మండల యూత్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ డైరెక్టర్ వాకిటి రాజారెడ్డి, మరియు పలు హోదాలో ఉన్న కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులు ప్రజలు పాల్గొనడం జరిగింది.

# మోకాలి గాయంతో నితీశ్ ఔట్


## టీమిండియాకు గాయాల బెడద




టీమిండియా ఇంగ్లాండ్ పర్యటనలో గాయాల బెడదతో సతమతమవుతోంది. ఇప్పటికే టెస్ట్ సిరీస్‌లో 2-1 తేడాతో వెనుకబడిన భారత జట్టుకు స్టార్ ఆటగాళ్ల గాయాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. టెస్ట్ అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్న అర్ష్‌దీప్ సింగ్ ప్రాక్టీస్ సెషన్‌లో బౌలింగ్ చేస్తూ చేతికి గాయమైనట్లు తెలుస్తోంది. స్టార్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కూడా గాయపడ్డాడు. ఆదివారం జిమ్‌లో కసరత్తులు చేస్తుండగా లిగమెంట్ దెబ్బతినడంతో అతడు అర్ధాంతరంగా భారత్‌కు తిరిగి వస్తున్నట్లు సమాచారం. ఈ సిరీస్‌లో రెండు టెస్టులు ఆడిన నితీశ్, బౌలింగ్‌లో మూడు వికెట్లు తీసి, బ్యాటింగ్‌లో 45 పరుగులు చేశాడు. ముఖ్యంగా మూడో టెస్ట్‌లో అతడు బౌలింగ్‌లో కీలక వికెట్లు తీసి, బ్యాటింగ్‌లో మెప్పించాడు. ఈ నేపథ్యంలో బీసీసీఐ అన్షుల్ కాంబోజ్‌ను జట్టులోకి తీసుకుంది. రెండో టెస్ట్‌లో అద్భుత ప్రదర్శన చేసిన ఆకాశ్‌దీప్ కూడా గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి, దీంతో నాలుగో టెస్ట్‌లో అతడు ఆడటం అనుమానంగా మారింది. ఈ ముగ్గురు ఆటగాళ్ల గాయాలపై బీసీసీఐ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లకు పనిభారం కారణంగా విశ్రాంతి ఇవ్వాలనే డిమాండ్ల మధ్య, కీలక ఆటగాళ్ల గాయాలు జట్టుకు తలనొప్పిగా మారాయి. మూడో టెస్ట్‌లో గాయపడిన రిషభ్ పంత్ ఇంకా పూర్తిగా కోలుకోలేదని, నాలుగో టెస్ట్‌లో స్పెషలిస్ట్ బ్యాటర్‌గా దిగనున్నట్లు సమాచారం. కరుణ్ నాయర్ వరుసగా మూడు టెస్ట్‌ల్లో విఫలమవడంతో, సాయి సుదర్శన్ లేదా అభిమన్యు ఈశ్వరన్‌ను తుది జట్టులోకి తీసుకోవాలని మాజీలు సూచిస్తున్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లేని ఈ సిరీస్ ప్రారంభానికి ముందు, ఇంగ్లాండ్ ముందు భారత్ నిలబడగలదా అని అందరూ అనుమానించారు. అయితే, తొలి టెస్ట్‌లో టీమిండియా అద్భుతంగా ఆడి, గెలుపు అవకాశాలను సృష్టించుకుని, నాలుగు రోజులు ఆధిపత్యం చెలాయించి, చివరి రోజు అనూహ్యంగా ఓడిపోయింది. రెండో టెస్ట్‌లో ఇంగ్లాండ్‌కు చుక్కలు చూపిస్తూ భారీ తేడాతో విజయం సాధించింది. మూడో టెస్ట్‌లోనూ అద్భుతంగా పోరాడి, గెలుపు అంచుల వరకు వచ్చి, చివరకు 22 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో సిరీస్‌లో నిలవాలంటే నాలుగో టెస్ట్‌లో భారత్ తప్పక గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి కీలక సమయంలో ఆటగాళ్ల గాయాలు తుది జట్టు ఎంపికపై ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. బ్యాటింగ్‌లో పెద్దగా సమస్యలు లేనప్పటికీ, బౌలింగ్‌లో ఎవరిని ఎంపిక చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. మాంచెస్టర్ వేదికగా ఈ నెల 23వ తేదీ నుంచి నాలుగో టెస్ట్ ప్రారంభం కానుంది.

# బీసీసీఐ ప్రెసిడెంట్ రేసులో ఆ ఇద్దరు?





బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీకి జులై 19తో 70ఏళ్లు నిండాయి. దీంతో బోర్డు రాజ్యాంగం ప్రకారం గరిష్ఠ వయోపరిమితి దాటడంతో బిన్నీ తన పదవికి అనర్హుడవుతారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్‌లో జరిగే వార్షిక సర్వసభ్య సాధారణ సమావేశం..వరకు బిన్నీ కొనసాగుతాడా లేదా ఉపాధ్యాక్షుడు రాజీవ్ శుక్లాకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించి ఆయన తప్పకుంటాడా అనే విషయంపై ఇప్పుడు ఉత్కంఠ నెలకొంది. అంతేకాదు జాతీయ క్రీడా బిల్లు ముసాయిదా రూపంలో మరో ట్విస్ట్ బిన్నీకి అనుకూలంగా మారే ఛాన్స్ కనిపిస్తోంది. సోమవారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో నూతన క్రీడా బిల్లును ప్రవేశపెడతారు. ఈ డ్రాఫ్ట్ ప్రకారం పాలకుల వయోపరిమితిని 70 నుంచి 75ఏళ్లకు పెంచాలని ప్రతిపాదించారు. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొందినట్లయితే..జాతీయ క్రీడా సమాఖ్యలకు అన్నింటికీ ఈ నిబంధన వర్తిస్తుంది.బీసీసీఐ కూడా ఎన్ఎస్ఎఫ్ కావడంతో చట్టం ప్రకారం నడుచుకోవాల్సిందే. అంతర్జాతీయ క్రికెట్ మండలి నిబంధనల్లో కూడా ఎక్కడా వయోపరిమితులను విధించలేదు. ఇలా చూస్తే బోర్డు అధ్యక్షుడిగా బిన్నీ మరో 5ఏళ్లు కొనసాగే అవకాశం ఉంటుంది. ఇదే విషయంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, న్యాయనిపుణులతో బిన్నీ ఈపాటికే చర్చించినట్లు తెలుస్తోంది. మరోవైపు బోర్డులో చక్రం తిప్పగల పెద్దలు కూడా మరో 3ఏళ్లు బిన్నీనే కొనసాగించాలని భావిస్తున్నారట. కొందరు మాత్రం కొత్త బిల్లు వచ్చేంత వరకు శుక్లాకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించాలనుకుంటున్నారట.

# ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్

## భారత్-పాక్ మ్యాచ్ రద్దు వివాదం

ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ రెండవ సీజన్ జూలై 18న ప్రారంభమైంది. ఈ సిరీస్‌లో భారత్-పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జూలై 20న జరగాల్సింది. అయితే, ఈ ఏడాది ఏప్రిల్‌లో పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని దృష్టిలో ఉంచుకుని, భారత ఆటగాళ్లు ఈ మ్యాచ్ ఆడటానికి నిరాకరించారు. వారు ఈ మ్యాచ్‌ను బహిష్కరించాలని నిర్ణయించారు, దీంతో యాజమాన్యం భారత జట్టు నిర్ణయానికి తలవంచి, చివరకు మ్యాచ్‌ను రద్దు చేయాల్సి వచ్చింది. ఈ రద్దుకు ప్రధాన కారణాల్లో ఒకటిగా పాకిస్థాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది చెప్పబడుతున్నాడు. కొంతకాలం క్రితం అఫ్రిది సోషల్ మీడియాలో భారత్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. ఈ ఛాంపియన్‌షిప్ జట్టులో అఫ్రిది కూడా ఉన్నాడు. మ్యాచ్ రద్దైన తర్వాత కూడా అఫ్రిది మరోసారి విషయం కక్కాడు %ంశీఅస్త్రషతీఙవతీ%: భారత్-పాకిస్థాన్ మధ్య జరగాల్సిన మ్యాచ్ గురించి విమర్శలు చేశాడు. భారత జట్టులోని చాలా మంది ఆటగాళ్లు ఈ రద్దుతో నిరాశ చెందారని, ఒక ఆటగాడి కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించాడు. విలేకరుల సమావేశంలో, భారత జట్టు ఈ మ్యాచ్ ఆడలేకపోవడంపై నిరాశ వ్యక్తం చేసిందని, దీనికి భారత మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ కారణమని అఫ్రిది వ్యాఖ్యానించాడు. శిఖర్ ధావన్ జూలై 11న బహిరంగంగా పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో తాను పాల్గొనబోనని ప్రకటించిన సంగతి తెలిసిందే. అఫ్రిది ధావన్‌ను "కుళ్ళిన గుడ్డు" అని పిలిచి, అతడు టీమిండియా ఆటగాళ్లను చెడగొట్టాడని ఆరోపించాడు. "క్రీడలు దేశాలను దగ్గర చేస్తాయి. క్రీడలలో రాజకీయాలను తీసుకువస్తే, ఎలా ముందుకు వెళతారు?" అని ప్రశ్నించాడు. సంభాషణ లేకుండా ఏదీ సరిదిద్దబడదని, ఇటువంటి మ్యాచ్‌లు సంబంధాలను మెరుగుపరచడానికి నిర్వహిస్తారని, కానీ ప్రతి అంశాన్ని పాడు చేసేలా మాట్లాడకూడదని అన్నాడు.

భారత చెస్ ప్లేయర్, ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి ఫిడే మహిళల చెస్ వరల్డ్ కప్ సెమీఫైనల్ చేరిన తొలి భారత క్రీడాకారిణిగా నిలిచారు. క్వార్టర్ ఫైనల్లో 1.5-0.5 పాయింట్ల తేడాతో చైనా ప్లేయర్ యుక్సిన్ సాంగ్ పై తెలుగు తేజం కోనేరు హంపి విజయం సాధించి ఫిడే మహిళల చెస్ వరల్డ్ కప్ సెమీఫైనల్లోకి దూసెకెళ్లారు.

# అదరగొట్టిన బంగ్లాదేశ్

## 7 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను మట్టికరిపించిన బంగ్లాదేశ్





సొంతగడ్డపై బంగ్లాదేశ్ అదరగొట్టింది. ఇటీవల శ్రీలంకతో టీ20 సిరీస్ నెగ్గిన బంగ్లా తాజాగా పాకిస్థాన్‌తో సిరీస్‌ను కూడా ఘనంగా ఆరంభించింది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 7 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను మట్టికరిపించింది. దీంతో బంగ్లాదేశ్ సిరీస్‌లో లీడ్‌లోకి దుసుకెళ్లగా, పాకిస్థాన్ ఖాతాలో అత్యంత చెత్త రికార్డు చేరింది.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 19.3 ఓవర్లలో 109 పరుగులకే ఆలౌటైంది. బంగ్లా బౌలర్ల దెబ్బకు పాక్ బ్యాటర్లు విలవిల్లాడారు. ఓపెనర్ ఫకర్ జమాన్ (44 పరుగులు) టాప్ స్కోరర్. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్‌లో ముగ్గురు బ్యాటర్లే రెండంకెల స్కోర్ సాధించారు. మిగతా ప్లేయర్లంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. ఈ క్రమంలోనే పాక్ చెత్త రికార్డు నమోదు చేసింది. టీ20 చరిత్రలో తొలిసారి బంగ్లాదేశ్ చేతిలో ఆలౌట్ అయ్యింది.గతంలో పాకిస్థాన్- బంగ్లాదేశ్ ఈ మ్యాచ్ కాకుండా 22సార్లు టీ20 ఫార్మాట్‌లో తలపడ్డాయి. ఇందులో అత్యధికంగా పాక్ 19సార్లు నెగ్గగా, బంగ్లాదేశ్ 3 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. కానీ గతంలో పాక్‌ను బంగ్లాదేశ్ ఎప్పుడు కూడా ఆలౌట్ చేయలేదు. పాక్ జట్టులోని పదికి పది వికెట్లు నేలకూల్చడం బంగ్లాదేశ్‌కు ఇదే తొలిసారి కావడం విశేషం.మ్యాచ్ విషయానికొస్తే, ఛేదనలో బంగ్లాకు కూడా పాక్ గట్టి షాక్ ఇచ్చింది. 7 పరుగులకే రెండు కీలక వికెట్లు పడగొట్టి మ్యాచ్‌పై ఆసక్తి పెంచింది. బౌలర్ సల్మాన్ మిర్జా తంజీద్ హసన్ తమిమ్ (1), లిట్టన్ దాస్ (1)ను పెవిలియన్ పంపి పాక్‌కు బ్రేక్ ఇచ్చాడు. కానీ, పర్వేజ్ హొసన్ (56 పరుగులు), తౌహిత్ హ్రిదయ్ (36) బంగ్లాను ఆదుకున్నారు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు 73 పరుగులు జోడించి మ్యాచ్‌ను తమవైపునకు తిప్పుకున్నారు. 12.3 ఓవర్ వద్ద హ్రిదయ్ ఔటైనా, జెకర్ అలీ (15)తో కలిసి పర్వేజ్ మ్యాచ్ పూర్తి చేశాడు. 110 పరుగుల లక్ష్యాన్ని బంగ్లాదేశ్ 15.3 ఓవర్లలోనే అందుకుంది. హాఫ్ సెంచరీతో అదరగొట్టి, నాటౌట్?గా నిలిచిన పర్వేజ్ హొసన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. తాజా విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో బంగ్లా 1-0తో లీడ్‌లోకి దూసుకెళ్లింది. ఇరుజట్లు మధ్య రెండో టీ20 మ్యాచ్ మంగళవారం (జూలై 22)ఢాకా వేదికగా జరగనుంది.

# పదేళ్ల అనుబంధానికి ప్రతీక





భారత్, ఇంగ్లండ్ నాలుగో టెస్టు వేళ టీమిండియా దిగ్గజం ఫరూఖ్ ఇంజనీర్ కు అరుదైన గౌరవం లభించనుంది. మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రఫోర్డ్ మైదానంలో ఒక స్టాండ్‌కు ఫరూక్ పేరు పెట్టాలని ల్యాంక్‌షైర్ కౌంటీ క్లబ్ నిర్ణయించింది. తమజట్టుకు పదేళ్లు ఆడిన ఆయన సేవలకు గుర్తుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు సోమవారం సదరు క్లబ్ తెలిపింది. వెస్టిండీస్ లెజెండ్ క్లైవ్ లాయిడ్ పేరును కూడా ఒక స్టాండ్‌కు పెడుతామని తెలిపింది ల్యాంక్‌షైర్. 'ఫరూఖ్, లాయిడ్ మా క్లబ్ క్రికెట్ పురోగతికి విశేషంగా కృషి చేశారు. అందుకే ఈ దిగ్గజ ఆటగాళ్ల పేర్లతో స్టాండ్స్ ఏర్పాటు చేయాలనుకున్నాం. ఈ ఇద్దరూ ఈ గౌరవానికి అన్ని విధాలా అర్హులు' అని ల్యాంక్‌షైర్ క్లబ్ ఒక ప్రకటనలో వెల్లడించింది. లాయిడ్ ఏకంగా రెండు దశాబ్దాలు ఈ క్లబ్ జట్టు తరఫున ఆడాడు. సో.. ఈ ఇద్దరు మాజీల పేర్లతో స్టాండ్స్‌ను ఏర్పాటు చేసి సమున్నతంగా గౌరవించింది.

ఫరూఖ్ 1968 నుంచి 1976 వరకూ175 మ్యాచులు ఆడాడు. వికెట్ కీపర్ అయిన అతడు ల్యాంక్‌షైర్ తరఫున 42 క్యాచ్‌లు పట్టడమే కాకుండా 35 స్టంపింగ్స్ చేశాడు. అంతేకాదు ఆ జట్టు నాలుగు పర్యాయాలు జిల్లెట్ కప్ ఛాంపియన్‌గా నిలవడంలో ఫరూఖ్ కీలక పాత్ర పోషించాడు. విండీస్‌కు రెండు వన్డే వరల్డ్ కప్‌లు అందించిన లాయిడ్ కూడా ఈ క్లబ్ క్రికెట్ అభివృద్ధికి ఎనలేని కృషి చేశాడు.

# సృష్టిని ప్రతిసృష్టి చేయగల డేటా సైన్స్, కృత్రిమ మేధ

## ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు



**ఖైరతాబాద్ , జూలై 21 (జనం సాక్షి) :** డేటా సైన్స్, కృత్రిమ మేధ ప్రపంచ వ్యాపార, వాణిజ్య రంగాల్లో నూతన ఆవిష్కరణలకు నాంది పలికాయని గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు అన్నారు. విశ్లేషణా సామర్థ్యాలను తెలియచేసే డేటా సైన్స్ తో కృత్రిమ మేధ తోడైనపుడు ఆటోమేషన్ ద్వారా అద్భుతమైన ఫలితాలను అందించవచ్చని పేర్కొన్నారు. వైద్యరంగం, ఆర్థిక రంగం, రిటైల్ వంటి అనేక రంగాలలో డేటా సైన్స్, కృత్రిమ మేధతో సామాజిక సవాళ్లను ఎదుర్కొంటునట్లు ఆయన అన్నారు. భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డిపార్టుమెంట్ అఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ పై ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాలో ఒక వారం రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిధిగా చెన్నై ఈఓడి ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ చీఫ్ టెక్నీకల్ ఆఫీసర్ డాక్టర్ అభిషేక్ చింతగుంట మాట్లాడుతూ ఆర్టిఫిషయల్ ఇంటిలిజెన్సు ఆధారిత ఆటోమేషన్ తయారీ విద్య, వైద్య, వ్యాపార, వాణిజ్య, కార్పొరేట్ రంగాలను సులభ తరం చేసిందన్నారు. వారం రోజుల జరిగే ఈ శిక్షణా కార్యక్రమంలో విషయ నిపుణులతో కూడిన ఫాకల్టీల ద్వారా ఏఐ ఎథిక్స్ అండ్ ప్రాక్టీసెస్, బేసిక్స్ అఫ్ న్యూరల్ నెట్ వర్క్స్ అండ్ డీప్ లర్నింగ్, ఏఐ ఇన్ సైంటిఫిక్ రీసర్చ్-కేస్ స్టడీస్ తదితర అనేక విషయాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు కార్యక్రమ సమన్వయ కర్త, ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ సెల్ హెడ్ పి.సాయి కిషోర్ తెలిపారు. వివిధ రాష్ట్రాల నుండి 24 మంది అభ్యర్థులతో పాటుగా కార్యక్రమ సహాయకులు మోహన్, సన్వేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ ఫిర్యాదుల ఉచ్చులో.. సింగరేణి విజిలెన్స్ విభాగం?

**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి సంస్థలో విజిలెన్స్ విభాగం పనితీరు తీవ్రవిమర్శలకు గురవుతోంది. నిబంధనల ప్రకారం పూర్తి వివరాలు లేకుండా వచ్చిన ఫిర్యాదులను తొలగించాల్సిన అవసరం ఉన్నా..బినామీ ఫిర్యాదులను విచారిస్తూ..అధికారులు సమయాన్ని వృథా చేస్తుండటం కలవరపాటుకు గురిచేస్తోంది. పేరు, చిరునామా, ఆధారాలు లేకుండా దాఖలయ్యే ఫిర్యాదులను విచారణకు స్వీకరించడం.. సుదీర్ఘంగా నడిచే దర్యాప్తునకు దారితీస్తోంది. ఈ దర్యాప్తుల పుణ్యమా అని పదోన్నతికి అర్హత సాధించిన అధికారులు సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. డిపెండెంట్ ఉద్యోగ నియామ కాలలోనూ అర్హత కలిగిన అభ్యర్థులపై ఉన్న అభ్యంతరాలు తొలగించేందుకు సమయం ఉండక పోవడంతో వారి భవిష్యత్తు నిలిచిపోయింది. ఒకవైపు అసత్య ఆరోపణలతో అధికారులను వేధించే పరిస్థితి నెలకొంటే, మరోవైపు వాస్తవ అవినీతి కేసులు పక్కకు నెట్టబడుతున్నాయి. ఉద్దేశపూర్వకంగా అడ్డంకులు సృష్టించే వారు ఈ విధమైన విజిలెన్స్ విభాగ వ్యవహార శైలినీ ఆయుధంగా మలుచుకుంటున్నారు. విజిలెన్స్ విభాగం ఎలాంటి ఆధారాలు లేని, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన ఫిర్యాదులను విచారణలోకి తీసుకోవడం అధికార వ్యవస్థ నైతిక స్థిరత్వాన్ని బలహీనపరు స్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పేరులేని ఫిర్యాదుల వెనుక వ్యక్తిగత కుట్రలు, విరోధాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**దర్యాప్తు పేరుతో వేధింపులు-నిజమైన కేసులు నిర్లక్ష్యం :**

తప్పుడు ఫిర్యాదులతో నెలల తరబడి విచారణలు జరిపినప్పటికీ చివరికి అవి నిరాధారంగా తేలుతున్న ఉదాహరణలు అనేకమున్నాయి. అయితే ఈ మధ్యంతర వ్యవధిలో బాధిత ఉద్యోగులు మానసికంగా తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. అసలు అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఫిర్యాదులు మాత్రం అలసత్వానికి గురవుతూ అవినీతి వ్యవస్థకే పరోక్షంగా వెన్నుదన్నుగా నిలుస్తున్నయన్న విమర్శలు ఎదురవుతున్నాయి.

**నిర్లక్ష్యపు దర్యాప్తులతో కోల్పోతున్న విశ్వాసం :**

ఇలాంటి నిర్లక్ష్యపు దర్యాప్తులు పరిపాలనా పద్ధతిపై ప్రజల్లో నమ్మకాన్ని కోల్పింపజేస్తున్నాయి. విజిలెన్స్ విభాగం విధివిధానాలను పునఃసమీక్షించి, ఆధారాలు లేని ఫిర్యాదులను విచారణకు అనర్హం చేయాల్సిన అవసరం అత్యవసరంగా మారింది. అంతేకాకుండా ఏళ్లకేల్లుగా విజిలెన్స్ విభాగంలో తిష్టవేసిన కొందరు అధికారులు, సిబ్బందితో గోపిక ఉంచే సమాచారం బయటకు పొక్కుతోందన్న అపవాదులేక పోలేదు. బాధిత ఉద్యోగుల జీవనోపాధిని,అధికార వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేందుకు సంబంధిత ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘాలు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

# రాష్ట్రంలో పరుగులు పెడుతున్న అభివృద్ధి, సంక్షేమం

- మహిళలకు, రైతులకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం
- అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి ప్రధాన లక్ష్యం
- మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- భూపాలపల్లి జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్‌లో 5.50 కోట్ల రూపాయల కెటిపిపి సీఎస్ఆర్ నిధులతో నూతన బస్ స్టాండ్ నిర్మాణాన్ని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ ఛైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, ఆర్టీసీ అధికారులతో కలిసి మంత్రి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. మంచి కార్యక్రమాలకు దేవుని ఆశీస్సులు, సహకారాలు లభిస్తాయని, ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉండాలని, ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని ఆయన అన్నారు. దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి మహిళలను లక్షాధికారులను చేయాలని సంకల్పించగా, ప్రస్తుత ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ కేంద్రాలు, దాన్యం సేకరణ కేంద్రాలు, మహిళా క్యాంటీన్లు, అమ్మ ఆదర్శ పాఠశాలలు వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన 8 లక్షల కోట్ల రూపాయల అప్పు ఉన్నప్పటికీ, 10 నెలల్లో 21 వేల కోట్ల రుణమాఫీ, 9 రోజుల్లో 9 వేల కోట్ల రైతు భరోసా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్ సిలిండర్, రూ.10 లక్షల ఆరోగ్య శ్రీ, 5 లక్షల కొత్త రేషన్ కార్డులు, 16 లక్షల కొత్త పేర్ల నమోదు, 3.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, భూపాలపల్లిలో 3500 ఇళ్లు, అదనంగా 1500 ఇళ్ల మంజూరుతో పేదలకు సహాయం చేస్తున్నామని తెలిపారు. ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు నిధులు జమ చేస్తున్నామని, అన్ని హామీలను నెరవేరుస్తామని స్పష్టం చేశారు. స్థానిక శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మూడుసార్లు ఓడిపోయినా ప్రజల మన్ననలతో నాలుగోసారి గెలిచారని, ఓడినా గెలిచినా ప్రజల వెన్నంటి ఉండే నాయకుడని అభినందించారు. గత వరదల నష్టాన్ని పరిహరించేందుకు, కర్ణాలకుంటలో 180 ఎకరాల సమస్యను పరిష్కరిస్తామని, స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వానికి సహకారం కావాలని కోరారు. ఐటీ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో నడిపిస్తున్నామని, గతంలో రేషన్ కార్డులు, ఇళ్ల కోసం అలమటించినా పట్టించుకోని పరిస్థితి మారి, 15 వేల రేషన్ కార్డుల్లో మార్పులు, 5 వేల కొత్త కార్డులు, చెల్పూర్‌లో బస్టాండ్, 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, 60 ఎకరాలలో పారిశ్రామిక పార్కు, మహిళలకు 20 ఎకరాలతో మినీ ఇండస్ట్రీస్, సబ్సిడీలతో వ్యాపారవేత్తలుగా ఎదిగే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సత్యనారాయణ రావు మాట్లాడుతూ, గోరి కొత్తపల్లి, టేకుమట్లలో 6 కోట్లతో భవనాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, భూ భారతి చట్టంతో 12 ఏళ్ల సాగు రైతులకు పట్టాలు, బైపాస్ రోడ్డు, మైనింగ్, పాలిటెక్నీక్ కళాశాలలు, 320 కోట్లతో 44700 ఎకరాల ఆయకట్టుకు కాలువలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్టీసీ ఎడ్ సలోమం, ఆర్ఎం విజయ భాను, డిఎం ఇందు, సింగిల్ విండో చైర్మన్ కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు గూటోజు కిష్టయ్య, గుమ్మడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా యుద్ధోన్మాదం, మానవాళికి ప్రమాదకరం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్




**నిజామాబాద్ జిల్లా బ్యూరో జులై 21 (జనం సాక్షి) :** అమెరికా యుద్ధోన్మాదం మానవాళికి ప్రమాదకరమని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ అన్నారు. తన ఆయుధ సంపత్తిని విక్రయించి, ఆయా దేశాలపై గుత్తాధిపత్యం చెలాయించేందుకు అమెరికా యుద్ధాలను ప్రోత్సహిస్తోందని, ఇది మానవాళికి తీవ్ర నష్టమని, ఇటువంటి చర్యలను అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. అమెరికా మెప్పు కోసం కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించి, ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్పోరేట్, బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా, కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని, దీంతో కార్మికుల కనీస హక్కులు కోల్పోతున్నాయని విమర్శించారు. నిజామాబాద్‌లోని నాందేవ్వాడలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశం, స్టడీ సర్కిల్ నిర్వహించగా, అబ్బాస్ ముఖ్యవక్తగా ప్రసంగించారు. అమెరికా నుంచి పౌల్ట్రీ, డెయిరీ ఉత్పత్తుల దిగుమతితో దేశీయ కంపెనీలు, కార్మికులు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చట్టాల మార్పుతో పని ప్రదేశాల్లో కార్మికులకు కనీస రక్షణ లేకుండా పోతోందని, సంగారెడ్డి వద్ద సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 8 మంది కార్మికుల మృతదేహాలు కూడా లభించని దుస్థితి నెలకొందని తెలిపారు. స్కిల్డ్ కార్మికులకు ఎక్కువ వేతనం ఇవ్వకుండా అన్‌స్కిల్డ్ కార్మికులతో పనులు చేయిస్తున్నారని, గతంలో ఉన్న కనీస వేతన చట్టం స్థానంలో యజమాని నిర్ణయించిన వేతనాలు అమలవుతున్నాయని ఆరోపించారు. మానిటైజేషన్ పైప్‌లైన్ పేరుతో అంబానీ, అదానీ వంటి కార్పోరేట్ కంపెనీలకు భూములు, గనులు, సహజ సంపదను దోచిపెడుతున్నారని, ఎన్నికల్లో లబ్ధి పొంది అధికారంలోకి వచ్చాక వారికి అనుకూలంగా వ్యవహరిస్తూ దేశ సంపదను కొల్లగొడుతున్నారని విమర్శించారు. కార్పోరేట్ కంపెనీలు, మతోన్మాద సంస్థల మధ్య ఒప్పందాలు జరుగుతున్నాయని, వీరు పరస్పరం సహకరించుకుంటున్నారని తెలిపారు. కులమతాల పేరుతో మీడియా, సోషల్ మీడియాలో ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని, గతంలో ఓటర్లు ప్రభుత్వాలను ఎన్నుకుంటే, ఇప్పుడు ప్రభుత్వమే ఓటర్లను ఎన్నుకుంటోందని, బీహార్‌లో ఓటర్ల ఏరివేత జరుగుతోందని, ఓటు హక్కు పోతే అన్ని హక్కులూ పోతాయని హెచ్చరించారు. ఈ విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని, నిరంతర అధ్యయనంతో ప్రజలను చైతన్యం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రసాద్, జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దివెంకట్రాములు, నూర్జహాన్, పల్లపు వెంకటేశ్, శంకర్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు జంగం గంగాధర్, నన్నేసాబ్, కొండ గంగాధర్, సుజాత, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

# భూ నిర్వాసితుల ఉద్యమం ఉద్రుక్తమవుతోంది



**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనం సాక్షి):** మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూమి కోల్పోతున్న భూనిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని గత ఏడు రోజులుగా ఆందోళన చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం విడ్డూరమని భూనిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి జిల్లా అధ్యక్షులు మశ్చేంధర్ విమర్శించారు. సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్ దగ్గర ఏడవ రోజు రిలే దీక్షలను వారు ప్రారంభించి ప్రసంగించారు. దీక్షలలో కూర్చున్న జాజాపూర్ సింగారం గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు తమకు న్యాయమైన పరిహారం అందే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. భూ నిర్వాసితులు తమ ఇండ్ల దగ్గరనే నిరసనలు తెలియజేసి ప్రభుత్వానికి నివేదించారని. జూలై 22న గ్రామలో ర్యాలి నిర్వహించి గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తారని కార్యదర్శులకు వినతిపత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించని ఎడల జూలై 26న మండల తహాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా ఉంటుందని జులై 28న జిల్లా కలెక్టరేట్ ముట్టడి జరుగుతుందని తెలిపారు. కనక ప్రభుత్వం వెంటనే స్పందించి భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించేందుకు ముందుకు రావాలన్నారు లేనిపక్షంలో భవిష్యత్తులో అనేక రూపాల్లో ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఏడవ రోజు రిలే దీక్షలో జాజపూర్ సింగారం భూనిర్వాసితులు నాయకులు కొనింటి హనుమంతు ,మన్నే లక్ష్మి కాంత్, సూరపు మల్లప్ప, జి నారాయణ బాలప్ప, నర్సింగమ్మ, భీమప్ప ,శివకుమార్ ,మాలప్ప, రామస్వామి తదితరులు పాల్గొన్నారు

జనంసాక్షి www.janamsakshi.org | మంగళవారం 22 జూలై 2025

# అబేయన్స్‌లో జీవో 49

- ఆదివాసీల్లో అనుమానాలు నెలకొన్న నేపథ్యంలో సర్కారు నిర్ణయం
- అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు జూపల్లి, సీతక్క సీఎంకు నివేదన
- సీఎం రేవంత్ ఆదేశాల మేరకు జీవో 49 అబేయన్స్‌లో పెడుతూ ఫారెస్టు డిపార్టుమెంటు ఉత్తర్వులు
- ప్రజా ప్రభుత్వం అడవీ బిడ్డలకు ఎప్పుడూ అండగా ఉంటుంది : కొండా సురేఖ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** జీవో 49 మీద ఆదివాసీలు, గిరిజనులకు ఎటువంటి ఆందోళన వద్దని, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అడవి బిడ్డలకు ఎప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పునరుద్ఘాటించారు. ఆదిలాబాద్ ఇంచార్జీ మంత్రి జూపల్లి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఆదివాసీ బిడ్డ సీతక్క సమిష్టిగా నిర్ణయం తీసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివేదించగా... ఆయన ఆదేశాల మేరకు సోమవారం జీవో 49 అబేయన్స్‌లో పెడుతూ అటవీ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జీవో 49 మీద స్థానిక ఆదివాసీల్లో అనుమానాలు, అభ్యంతరాలు నెలకొన్న నేపథ్యంలో వాటిపై పలు దఫాలు మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, సీతక్క భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మంత్రులు సమావేశాలు నిర్వహించి, సమగ్ర వివరాలు సేకరించారు. ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో స్థానిక కలెక్టర్ నుంచి మరొకసారి నివేదిక తెప్పించుకున్న ప్రభుత్వం... ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. పులుల కారిడార్ కవ్వాల్ అభయారణ్యంలో భాగంగా ఉన్న ఆసిఫాబాద్ ప్రాంతాన్ని కుమురంభీం పులుల కన్జర్వేషన్ రిజర్వ్‌గా మారుస్తూ గత నెల 30న అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ జీవో విడుదల చేసిన విషయం తెలిసిందే. జిల్లాలోని ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్, కర్జెల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ రేంజ్‌లలో లక్ష 49 వేల హెక్టార్ల ను టైగర్ రిజర్వులోకి మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జీవో విడుదల కోసం 330 ప్రభావిత గ్రామాల ప్రజల్లో నెలకొన్న అనుమానాలా నివృత్తి చేసేందుకు అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో మంత్రులు సమగ్ర వివరాలు సేకరించారు. స్థానిక ఆదివాసీల విజ్ఞప్తి మేరకు... సీఎం రేవంత్ రెడ్డికి ఈ విషయాన్ని నివేదించి... అబేయన్స్ లో పెట్టాలని ప్రభుత్వం ముందడుగు వేసింది. అయితే, రానున్న రోజుల్లో కూడా ఆదివాసీలకు ఇబ్బందులకు రాకుండా చూసుకుంటామని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ హామీనిచ్చారు. తమ ప్రభుత్వానికి ప్రజా సంక్షేమమే ధ్యేయం అని వ్యాఖ్యానించారు.

# వేసవిలోనూ సాగునీరిచ్చిన ఘనత మనది

- హల్దీవాగులో లిఫ్ట్ ద్వారా నీరిచ్చి ఆదున్నాం
- కాంగ్రెస్ రాకతో పడిపోయిన భూముల ధరలు
- గజ్వేల్ కార్యకర్తల సమావేశలో హరీష్ రావు విమర్శలు



**గజ్వేల్, జూలై21 (జనంసాక్షి) :** భారత రాష్ట్ర సమితి హయాంలో వేసవిలోనూ పంటల సాగుకు తగినంత నీరు ఇచ్చామని సిదిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గతంలో హల్దీ వాగులో లిఫ్ట్ పెట్టి గద్దర్ వాళ్ల ఊరికి నీళ్లు వచ్చేలా చేశామని చెప్పారు. కేసీఆర్ పాలనను గద్దర్ కూడా మెచ్చుకున్నారని పేర్కొన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం నీళ్లు ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. కాళేశ్వరంలను కావాలనే పండబెట్టారని అన్నారు. సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల ముఖ్య సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి మద్దతుదారులను గెలిపించుకోవాలన్నారు. అన్ని మండలాల్లో విజయకేతనం ఎగురవేయాలన్నారు. కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు తగ్గిపోయా యని చెప్పారు. ఒకప్పుడు తెలంగాణలో ఎకరా భూమి అమ్మితే ఏపీలో పదేకరాల భూమి వచ్చేదని.. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక సీన్ రివర్స్ హరీష్ రావు ఎద్దేవా చేశారు. ఏపీలో ఎకరా అమ్మితే ఇప్పుడు తెలంగాణలో రెండెకరాల భూమి వస్తుందని.. సీఎం రేవంత్ రెడ్డికి పాలన చేతకాక మన దగ్గర ఇలాంటి పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. తెలంగాణలో మళ్ళీ కేసీఆర్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటు న్నారన్నారు. సిద్దిపేట జిల్లాపై కాంగ్రెస్ పార్టీ పగపట్టిందని హరీష్ రావు పేరొన్నారు. కాంగ్రెస్ 20 నెలల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైంది. కాంగ్రెస్ పాలనలో ప్రజలు స్వీయ అనుభవం చెందారు. రేవంత్ రెడ్డి చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగుల ను కాంగ్రెస్ పార్టీ రెచ్చగొట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఒక్కరికి కూడా పెన్షన్ ఇవ్వలేదు కానీ 2 లక్షల పెన్షన్లు తీసేశారు. కాంగ్రెస్ పాలనలో ఎరువుల కోసం చెప్పులు క్యూలైన్లో పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. కేసీఆర్ హయాంలో నాట్లకు, నాట్లకు రైతు బంధు వచ్చేది. రేవంత్ రెడ్డి హయాంలో ఓట్లకు, ఓట్లకు మధ్య రైతు భరోసా వస్తుంది. కాంగ్రెస్ వచ్చాక బోరు బావుల మోటర్ల మెకానిక్లు మాత్రమే బాగుపడ్డారని ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. గజ్వేల్ లో కాంగ్రెస్ నేతలు వసూళ్లకు పాల్పడుతున్నారు. గజ్వేల్‌లో అన్ని మండలాల్లో గులాబీ జెండా ఎగరాలి. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గజ్వేల్. స్థానిక సంస్థల ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దు. సిద్దిపేట జిల్లాపై కాంగ్రెస్ పార్టీ పగపట్టింది. నాయకులు ఎవరు గ్రూపుల జోలికి పోవొద్దు. రిజర్వేషన్లు వచ్చినప్పుడు ఎవరు పోటీలో ఉంటారనేది చర్చించి నిర్ణయం తీసుకుందాం అని ఎమ్మెల్యే హరీష్ రావు నేతలకు సూచించారు.

# నిష్పక్షపాతంగా అహ్మదాబాద్ విమాన ప్రమాద దర్యాప్తు

- తుది నివేదికలో పూర్తి వివరాలు వెల్లడవుతాయి
- విదేశీ మీడియా తప్పడు ప్రచారాలు నమ్మవద్దు
- లోక్‌సభలో మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి



**న్యూఢిల్లీ, జూలై21 (జనంసాక్షి) :** ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై నిష్పక్షపాతంగా దర్యాప్తు సాగుతోందని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. విదేశీ మీడియా కావాలనే ప్రమాదంపై అనుచిత వార్తలు ప్రచారం చేస్తోందని అన్నారు. లోక్‌సభలో ప్రతిపక్షాలు ప్రశ్నించిన నేపథ్యంలో.. అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమానం ప్రమాదంపై దర్యాప్తు అంతర్జాతీయ ప్రోటోకాల్‌లకు అనుగుణంగా జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ దర్యాప్తును ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బోర్డ్ నిర్వహిస్తోందన్నారు. ప్రమాదం ఎలా, ఎందుకు జరిగిందనే దానిపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని, తుది నివేదికలో పూర్తి వివరాలు వెల్లడవుతాయని మంత్రి అన్నారు. మొదటి దశ దర్యాప్తు ఇప్పటికే పూర్తయింది. ఈ దశలో ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. విమానంలోని బ్లాక్ బాక్స్‌కు కొంత నష్టం జరిగినట్లు తెలిసింది. సాధారణంగా, బ్లాక్ బాక్స్‌కు నష్టం జరిగినప్పుడు దానిని విశ్లేషణ కోసం తయారీదారుకు పంపడం ఆనవాయితీ. అయితే, ఈ సారి భారతదేశంలోనే మొదటిసారిగా బ్లాక్ బాక్స్ డీకోడింగ్ పక్రియ విజయవంతంగా జరిగిందని మంత్రి రామ్ మోహన్ నాయుడు వెల్లడించారు. ఇది భారతదేశ పౌర విమానయాన రంగంలో ఒక ముఖ్యమైన విజయంగా ఆయన అభివర్ణించారు. దర్యాప్తు పక్రియలో నిష్పాక్షికతను మంత్రి సమర్థించారు. కొన్ని విదేశీ మీడియా సంస్థలు ఈ ప్రమాదంపై తమ సొంత కథనాలను రూపొందించి తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. అలాంటి కథనాలను తాను గమనించానని, వాటిని నమ్మొద్దన్నారు. ఈ సందర్భంగా, ఎయిర్ ఇండియా లేదా బోయింగ్ వంటి సంస్థలకు మద్దతు ఇవ్వడం కాదని, తమ లక్ష్యం కేవలం సత్యాన్ని వెలికితీసేందుకేనని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. దర్యాప్తు పక్రియను అందరూ గౌరవించాలని, నిజమైన సమాచారం తుది నివేదిక ద్వారా బయటకు వస్తుందని ఆయన వెల్లడించారు. ఇలాంటి విమాన ప్రమాద దర్యాప్తులు అంతర్జాతీయంగా ఒక నిర్దిష్ట పక్రియను అనుసరిస్తాయని మంత్రి వివరించారు. భారతదేశం కూడా ఈ అంతర్జాతీయ ప్రమాణాలకు కట్టుబడి ఉందని, ఈ దర్యాప్తు ఆ దిశగా సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రమాద కారణాలను గుర్తించేందుకు సమగ్ర విశ్లేషణ జరుగుతోందని, తుది నివేదికలో అన్ని వివరాలు స్పష్టమవుతాయని ఆయన హామీ ఇచ్చారు. ఈ విషయంపై లోక్‌సభలో జరిగిన చర్చల సందర్భంగా, కార్యకలాపాలు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి.

# రాజకీయ పార్టీలు ఉచితాలను కట్టడి చేయాలి

- యువతకు పని కల్పించేందుకు దృష్టి సారించాలి
- ఉచితాలతో రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అవుతుంది
- సమాజంలో అవినీతి విపరీతంగా పెరిగిపోయింది
- పెద్దల సభ గౌరవాన్ని దిగజార్చే విధంగా ఎమ్మెల్సీలు వ్యవహరించొద్దు
- శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి




**నల్గొండ బ్యూరో, (జనంసాక్షి) :** రాజకీయ పార్టీలు ఉచితాలను కట్టడి చేసి, యువతకు పని కల్పించేందుకు దృష్టి సారించాలని తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. సోమవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ ఉచిత పథకాలతో ఆయా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అవుతుందని అన్నారు. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు ఉచిత వాగ్దానాలు ఇవ్వకుండా సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్, కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవలి కాలంలో రాజకీయాల్లో అన్ పార్లమెంటరీ భాష వాడడం పరిపాటి అయిందని అంటూనే ఇది భవిష్యత్ తరాలకు మంచిది కాదన్నారు. అలాగే సమాజంలో అవినీతి విపరీతంగా పెరిగిపోయిందని, ఈ అవినీతిని అరికట్టేందుకు రాజకీయ నాయకులు ఉద్యోగులు నడుం బిగించాలని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఇంజనీరింగ్ వ్యవస్థలో అవినీతి వేళ్లూనుకు పోయిందని, అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని సూచించారు. బనకచర్ల ప్రాజెక్టు పై రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగానే ముందుకు సాగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతే కాకుండా పెద్దల సభ గౌరవాన్ని దిగజార్చే విధంగా కొందరు ఎమ్మెల్సీలు వ్యవహరిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యంలో సరైన పద్ధతి కాదని ఆయన పరోక్షంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కు చురకలంటించారు.

# ఖర్గేకు పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ శుభాకాంక్షలు




**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ఏఐసీసీ అధ్యక్షులు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున్ ఖర్గేను టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో కలిసి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా నేతగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఖర్గే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుణ్ణి కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు.. ఈ సందర్భంగా ఆయన వెంట ఎంపీ సురేష్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్, ఉపాధ్యక్షులు బొంతు రాంమోహన్, కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ తదితర నాయకులు ఉన్నారు.

# జూలై 28 వరకు నీట్ యూజీ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్‌లు

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** నీట్ యూజీ – 2025 కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సోమవారం (జూలై 21) ప్రారంభమైంది. ఈ కౌన్సెలింగ్ ద్వారా దేశంలోని మెడికల్ కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులలో సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) ఈ మొత్తం ప్రక్రియను **mcc.nic.in** అనే తమ అధికారిక వెబ్‌సైట్‌లో నిర్వహిస్తోంది. ఈ రిజిస్ట్రేషన్, ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ జూలై 28 వరకు కొనసాగుతుంది. విద్యార్థులు ఈ గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించి, తమకు నచ్చిన కళాశాలలు, కోర్సులను ఎంపిక చేసుకోవాలి. ఈ ఏడాది దేశవ్యాప్తంగా సుమారు 1.3 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో దాదాపు 1 లక్ష ఎంబీబీఎస్ సీట్లు, 28 వేల బీడీఎస్ సీట్లు ఉన్నాయి. మొత్తం 775 విద్యా సంస్థలు ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొంటున్నాయి. కౌన్సెలింగ్ ప్రక్రియలో మొత్తం మూడు సాధారణ రౌండ్లు, ఒక స్ట్రే వాకెన్సీ రౌండ్ ఉంటాయి. ప్రతి రౌండ్‌లోనూ విద్యార్థులు రిజిస్ట్రేషన్, చాయిస్ ఫిల్లింగ్, సీటు కేటాయింపు, రిపోర్టింగ్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ వంటి దశలను పూర్తి చేయాల్సి ఉంటుంది. విద్యార్థులు తమ నీట్ యూజీ 2025 ర్యాంక్, సీట్ల లభ్యత, చాయిస్ ఫిల్లింగ్ ఆధారంగా సీట్లను పొందుతారు.

# యూఏఈలో కేరళ యువతి అనుమానాస్పద మృతి



**తిరువనంతపురం (జనంసాక్షి) :** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని షార్జాలో కేరళకు చెందిన 29 ఏళ్ల అతుల్య శేఖర్ అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. వరకట్న వేధింపులే ఆమె మరణానికి కారణమని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. కొల్లాంకు చెందిన అతుల్య శేఖర్ 2014లో సతీష్ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. శనివారం షార్జాలోని తన అపార్ట్‌మెంట్‌లో ఆమె మృతదేహం లభ్యమైంది. తన అల్లుడు సతీష్.. అతుల్యను గొంతు నులిమి, కడుపులో తన్ని, తలపై ప్లేట్‌తో కొట్టాడని, దీని వల్ల అతుల్య మరణించిందని ఆమె తల్లి ఆరోపిస్తోంది. పెళ్లయినప్పటి నుండి సతీష్ వరకట్నం కోసం అతుల్యను వేధిస్తున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వారు సతీష్‌కు 40 సవర్ల బంగారు నగలు, ఒక బైక్ ఇచ్చారని చెప్పారు. కాగా సతీష్‌పై యూఏఈలో హత్య కేసు నమోదైనట్టు తెలుస్తోంది.

# అత్యాధునికంగా ఖమ్మం మార్కెట్ అభివృద్ధి

## పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల



**ఖమ్మం, జూలై21 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ఖమ్మం మార్కెట్‌ను మోడల్ మార్కెటింగ్ గా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..రూ.150 కోట్లతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణ పనులు చేపట్టారు. మార్కెట్ చుట్టూ 6 గేట్లు ఏర్పాటు– చేయాలని తుమ్మల అధికారులకు సూచించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో అన్ని వసతులూ ఏర్పాటు– చేస్తున్నామని, సంక్రాంతి నాటికి మార్కెట్ పనులు పూర్తి చేస్తామని తెలియజేశారు. మార్కెట్ విస్తరణలో స్థలాలు కోల్పోయిన వారికి స్థలాలు ఇస్తామని, మార్కెట్ చుట్టూ ఆహ్లాదకరమైన పరిస్థితి ఉండేలా చూస్తామని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# లిక్కర్ మాఫియా గుప్పిట్లో ప్రభుత్వం

- కల్లు కాంపౌడ్‌లను ఎత్తేసే కుట్ర
- కులవృత్తులను అగౌరవపరుస్తున్న కాంగ్రెస్
- మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్




**హైదరాబాద్, జూలై21 (జనంసాక్షి) :** కుల వృత్తులను కాపాడుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వాటిని నాశనం చేయాలని చూస్తుందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఏ కుల వృత్తిపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. ఆదాయం వచ్చే కుల వృత్తులను ప్రభుత్వం నాశనం చేయాలని చూస్తోందన్నారు. గీత కార్మికులకు ఐదు ఎకరాల పొలం ఇస్తామని చెప్పారు. గీత కార్మికులు చెట్లపై నుంచి పడి చనిపోతే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లుగీత వృత్తిని బంద్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. కల్లు కంపౌండ్ ద్వారా పది కులాలు బ్రతుకుతున్నాయి. ఉప్పల్‌లో తాటి చెట్లు కొట్టి గీత కార్మికులకు నష్టం చేశారు. కల్లు కంపౌండ్‌ను నిషేధిస్తామని ప్రభుత్వం లీకులు ఇస్తోంది. లిక్కర్ కంపెనీలు, డిస్టలరీలన్ని ఒకరిద్దరి చేతుల్లో నడుస్తున్నాయి. లిక్కర్ కంపెనీల కమీషన్లకు కక్కుర్తిపడి, లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లు కాంపౌండ్ బంద్ చేయాలని చూస్తున్నారని మండిపడ్డరు. కల్లులో మీరే ఏదో కలిపి కుట్ర చేస్తూ ఓఆర్ఆర్ లోపల కల్లుపై నిషేధం విధించాలని చూస్తున్నారు. కుల వృత్తిని అవమానించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిని నిషేధించడంలో ప్రభుత్వం ఎందుకు విఫలం అవుతుంది. కల్తీ పాలు అరికట్టడంపై ప్రభుత్వం ఎందుకు దృష్టి పెట్టడం లేదు. రాష్ట్రంలో విచ్చలవిడిగా ఫార్మా కంపెనీలకు పర్మిషన్లు ఇస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో నిషేధించిన బీర్లను తెలంగాణలో అమ్ముతున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఒక్కో ఎమ్మెల్యేకు 10 నుంచి 15 లక్షలు ఇస్తున్నారు. దాదాపు 35 మంది ఎమ్మెల్యేలు నెలవారీ డబ్బులు తీసుకుంటు–న్నారు. కల్తీ కల్లును ప్రోత్సహిస్తున్నది ఎవరనేది ప్రభుత్వం తేల్చాలి. గీత సంఘాల నుంచి ఎమ్మెల్యేలు డబ్బులు తీసుకుంటూ కల్తీ కల్లును ప్రోత్సహిస్తున్నారా? బిఆర్ఎస్ హయాంలో జిల్లాకో నీరా కేంద్రం పెట్టాలని భావించాం. హైదరాబాద్ నగర నడిబొడ్డున నీరా కేఫ్ పెట్టి కులవృత్తిని కాపాడాం. కల్లు కంపౌండ్ దమ్ముంటే బంద్ చేసి చూడండి. కల్లు కంపౌండ్ బంద్ చేస్తే ప్రభుత్వాన్ని నడవనీయం. మళ్లీ కేసీఆర్ సీఎం కాగానే కల్లు దుకాణాలను తెరిపిస్తాం. వైన్ షాపులు కల్లుగీత కార్మికుల కుటుంబాలకు ఇస్తాం అని ప్రకటించారు. నిజామాబాద్ జిల్లాలో గౌడ కులస్తులపై నిషేధం విధించారు. 60 మంది గౌడ కుల స్త్రీలు గుడికి వెళ్తే గుళ్లోకి రావద్దని వెనక్కి పంపారు. లక్షలు, లక్షలు మామూళ్లు తీసుకుని కల్లు దుకాణాలు బంద్ చేస్తామంటే చూస్తూ ఊరుకోం. కల్లు దుకాణాలు బంద్ పెడితే బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద మామూళ్లు తీసుకుంటున్న ఎమ్మెల్యేల పేర్లు బయటపెడతాం. హైదరాబాద్ నగర శివారు ప్రాంతంలో గీత చెట్లు– ఉన్నాయి. కల్లు కంపౌండ్ పేదోళ్లకు రిక్రియేషన్ సెంటర్ లాగా ఉంటు–ంది. తాము అధికారంలోకి వచ్చాక లిక్కర్ మాఫియా నుంచి, కల్లు కంపౌండ్ నుంచి డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. అలాగే తాటి చెట్లు– నరికిన వారిపై కేసులు పెట్టాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీల పట్ల వివక్ష చూపుతున్నారన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ కాంగ్రెస్ పార్టీకి గుర్తుకు రాలేదా అని ఆయన ప్రశ్నించారు. 34 శాతం రిజర్వేషన్లపై 2013లో కాంగ్రెస్ పార్టీ కోర్టుకు అఫిడవిట్ ఇచ్చి, ఈసారికి మాత్రమే బీసీ రిజర్వేషన్లు అని చెప్పిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మూలంగానే ఏపీ, తెలంగాణలో బీసీలకు 23 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నట్లు– తెలిపారు. బీసీలకు రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల రేవంత్ రెడ్డి. ఎప్పుడూ సానుకూలంగా లేరన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370